

ఈ సంచికతోపాటు 12 పేజీల **లైఫ్** సప్లిమెంట్ అందుకోండి

V6 NEWS
ప్రతి దృశ్యం... ప్రజల పక్షం...

ప్రభాత
వెలుగు
28.01.2019
www.v6velugu.com
సోమవారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 342 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL



జనరల్
మా పైసలు మాకిచ్చేయండి
పంచాయతీ ఎలక్షన్లలో ఓడిన క్యాండిడేట్లు తాము పంచిన పైసలు వసూలు చేసుకుంటున్నరు.
03



దేశం - విదేశం
ఫిలిప్పీన్స్ చర్చిపై బాంబు దాడి
టెర్రరిస్టుల దుశ్చర్యకు 27 మంది బలికాగా.. 80 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు.
05



ప్లే
జకోవిచ్.. ఏడోసారి
ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌లో స్పెయిన్ టెన్నిస్ స్టార్‌పై విజయం సాధించిన సెర్బియా ప్లేయర్.
11



బిజినెస్
త్వరలో సీప్లేన్‌లు
ఉడాన్ పథకం కింద దేశవ్యాప్తంగా సీ ప్లేన్ సర్వీసులను తెస్తామని స్పైస్‌జెట్ అధిపతి అజయ్‌సింగ్ చెప్పారు.
10

కాలంకాని కాలంలో వానలే వానలు. అక్కడిక్కడ అని లేదు. చాలా జిల్లాల్లో దంచికొడుతున్నయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లారే దాకా మస్తుచోట్ల వర్షా లు పడ్డయి. సిద్దిపేట జిల్లా నంగునూరుల అత్యధికంగా 10 సెంటీమీటర్ల వాన పడింది. వందల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. మామిడి, మిర్చి, పసుపు, మక్క, కంది పంటలు దెబ్బతిన్నయి. పల్లి పంటకు మాత్రం ఈ వానలు మేలే చేసినయని కొందరు రైతులు అంటున్నరు. సోమవారం కూడా వానలకు అవకాశం ఉందని వాతావరణ విభాగం అధికారులు తెలిపారు. రెండ్రోజుల నుంచి వర్షా లు పడుతుండడంతో టెంపరేచర్ బాగా తగ్గిపోయింది. హైదరాబాద్ కూల్‌గా మారింది. ఆదివారం రోజంతా ముసురు పెట్టింది. మధ్యాహ్నమైనా సూరీడు తొంగిచూడకపోవడంతో జనం చలికి గజగజ వణికారు.

నల్లగొండ జిల్లా దేవరకొండలో వాన నీళ్లతో నిండిపోయిన మెయిన్ రోడ్డు





హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద వాన

చెడగొట్టు వానలు


సిద్దిపేట, జనగామ, భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాల్లో భారీ వర్షా లు

- సిద్దిపేట జిల్లా నంగునూరులో అత్యధికంగా 10 సెం.మీ.
- మామిడి, మిర్చి, పసుపు, మక్క, కంది పంటలకు నష్టం
- పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం
- హైదరాబాద్‌లో పొద్దంతా ముసురు
- ఇయ్యాల కూడా వర్షా లకు అవకాశం: ఐఎండీ

04

రైతుల కోసం భారీ ప్యాకేజీ!

నేటి కేంద్ర కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం



న్యూఢిల్లీ: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా రైతులను ఆకట్టుకునేలా ఎన్డీయే సర్కారు భారీ ప్యాకేజీ ప్రకటించనున్నట్టు సమాచారం. దీనికి సంబంధించి సోమవారం జరిగే కేంద్ర కేబినెట్ సమావేశంలో ఓ నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు. రైతుల ఆదాయం పెంచడంతోపాటు వారు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు పరిష్కారం చూపించేలా ప్యాకేజీ ఉండే అవకాశాలున్నాయని చెబుతున్నారు. రైతులకు అవసరమైన అంశాలపై కేంద్ర వ్యవసాయ శాఖ ఇప్పటికే అనేక సిఫార్సులను చేసింది. అందులో పంట రుణాలపై వడ్డీ మాఫీ అంశం కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఖజానాపై భారం పడే అవకాశమున్నా రైతులను ఆకట్టుకోవాలంటే కీలక నిర్ణయాలు తప్పవని ఎన్డీయే సర్కారు భావిస్తున్నట్టు సమాచారం.

రైతు బంధు పథకం తరహాలో..

మన రాష్ట్రంలో అమలవుతున్న 'రైతు బంధు' పథకం తరహాలో జాతీయ స్థాయిలో పథకాన్ని కేంద్రం ప్రకటించే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది. ఇందుకు సంబంధించిన సాధ్యసాధ్యాలను పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో వెంటనే అమలయ్యేలా పథకానికి రూపకల్పన చేయాలని కేంద్రం భావిస్తోంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీకి ఎదురుదెబ్బలు తగిలిన నేపథ్యంలో రైతులను ఆకర్షించే చర్యలపై దృష్టి సారించింది.



గంటకు 180 కిలోమీటర్ల స్పీడ్‌తో వచ్చేస్తోంది

'వందే భారత్' ఎక్స్‌ప్రెస్

- దేశంలోనే ఫాస్టెస్ట్ రైలు.. అత్యాధునిక సౌకర్యాలు
- ఆటోమేటిక్ డోర్లు, వైఫై, ఎల్ఈడీ లైటింగ్
- ఢిల్లీ-వారణాసి మధ్య త్వరలోనే మొదలు

02

దేశంలోనే అత్యంత వేగంగా ప్రయాణించే 'వందే భారత్' ఎక్స్‌ప్రెస్ ట్రాక్ ఎక్కేందుకు రంగం సిద్ధమైంది. మేకిన్ ఇండియాలో భాగంగా పూర్తిగా దేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ రైలు ఢిల్లీ-వారణాసి మధ్య పరుగులు పెట్టనుంది. 70వ రిపబ్లిక్ ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎన్డీయే సర్కారు ఇస్తున్న కానుక ఇదని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

ఇండోనేసియా మాస్టర్స్ విజేత

సైనా నెహ్వాల్



కొత్త ఏడాది రెండో టోర్నీలో ఇండియన్ బ్యాడ్మింటన్ స్టార్ సైనానెహ్వాల్ చాంపియన్‌గా నిలిచింది. ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీని కైవసం చేసుకుంది. ఫైనల్‌లో వరల్డ్ నంబర్ ఫోర్, స్పెయిన్ ప్లేయర్ మరీన్‌తో తలపడ్డ సైనాను మ్యాచ్ పూర్తి కాకుండానే విజయం వరించింది. మ్యాచ్ మొదలైన కాసేపటికే ప్రత్యర్థి మరీన్ మోకాలి గాయంతో తప్పుకోవడంతో ట్రోఫీ సైనా సొంతమైంది. గతవారం మలేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో మరీన్ చేతిలో ఓడిన సైనా ఈ టోర్నీలో అద్భుతంగా ఆడి ఫైనల్ దాకా చేరుకుంది. గత ఏడాది ఇదే టోర్నీలో ఫైనల్‌కు చేరినా రన్నరప్‌గా నిలిచింది.

11



అవినీతిపై పోరు

ఆపేది లేదు

- ప్రజలను దోచుకోవడానికే ప్రతిపక్షాలు ఏకమవుతున్నాయి: మోడీ
- పేదల కోసమే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు
- ఆరోగ్య రంగానికి టాప్ ప్రయారిటీ ఇస్తాం
- తమిళనాడు, కేరళల్లో ప్రధాని పర్యటన

05

ఓటేయడం పవిత్ర కర్తవ్యం
ఈ ఏడాది తొలి 'మన్ కీ బాత్'లో ప్రధాని

'పాలమూరు'కు జోష్


ప్రాజెక్టుకు వరుసగా అనుమతులు

దక్షిణ తెలంగాణ జిల్లాలకు సాగు, తాగునీరందించే 'పాలమూరు–రంగారెడ్డి' ప్రాజెక్టు పనులు ముమ్మరం కానున్నాయి. ప్రాజెక్టుకు అవసరమైన అటవీ భూముల బదలాయింపునకు ఇటీవలే కేంద్రం క్లియరెన్స్ ఇవ్వగా.. త్వరలోనే పర్యావరణ తుది అనుమతులు రానున్నాయని అధికారులు చెబుతున్నారు. రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెలలో ప్రాజెక్టు పనులను సీఎం కేసీఆర్ పరిశీలించనున్నారు.



02

ఉల్లిగడ్డ ధర తగ్గుతోంది



- ఇతర రాష్ట్రాల్లో భారీగా పెరిగిన దిగుబడి
- రాష్ట్ర మార్కెట్‌కు తరలిస్తున్న వ్యాపారులు
- హోల్‌సేల్‌లో క్వింటాల్‌కు రూ. 700 లోపే
- రిటైల్‌గానూ కిలో రూ.10కి తగ్గిన ధర

02

వెన్‌కాబ్
(ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
83.00	83.00	83.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
84.00	83.00	82.00



హామీలు తీర్చకుంటే జనం చితగ్గొడతరు

కలల్ని నిజం చేసే నాయకుడే కావాలని జనం అనుకుంటారు. అదే జనం ఆ కలలను తీర్చకపోతే నాయకుడిని చితగ్గొడతారు. కాబట్టి నెరవేర్చగలిగిన హామీలనే జనానికి ఇవ్వాలి. నేనైతే హామీలను అరచేతిలో చూపించే వ్యక్తిని కాదు. ఏం చెప్తానో అదే చేస్తాను.


- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

ఉల్లి దిగొస్తున్నది

రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.10కి తగ్గిన ధర

హైదరాబాద్, వెలుగు:

- హోల్‌సేల్‌లో క్వింటాల్ రూ.500 నుంచి 700
- గతంలో రూ.1,000 నుంచి 1,400 పలికిన ధర
- ఇతర రాష్ట్రాల నుంచి భారీగా దిగుమతులు



ఉల్లి ధరలు దిగొస్తున్నాయి. రోజురోజుకు రేట్లు తగ్గుతున్నాయి. గత పదిహేను రోజులతో పోలిస్తే ధరలు సగానికి పడిపోయాయి. ఇతర రాష్ట్రాల నుంచి ఉల్లి గడ్డలు భారీ మొత్తంలో దిగుమతి అవుతున్నాయి. అక్కడ అధిక పంట దిగుబడి, నిల్వ చేసిన సరుకును మన రాష్ట్రానికి తరలిస్తున్నారు. దీంతో ప్రస్తుతం ఉల్లి క్వింటాల్‌కు రూ.600 నుంచి 700 వరకు మాత్రమే పలుకుతోంది. మార్కెట్‌లో కిలో ధర రూ.10 నుంచి 15 వరకు పలుకుతోంది.

మస్త్ దిగుమతి..

హైదరాబాద్‌లోని మలక్‌పేట గంజ్ మార్కెట్ ఉల్లిగడ్డకు పేరు గాంచింది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ఇక్కడి నుంచే ఉల్లి సరఫరా అవుతుంది. ప్రధానంగా మహబూబ్‌నగర్, మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీలోని కర్నూల్ ప్రాంతాల నుంచి గంజ్‌కు ఎక్కువగా సరుకు వస్తుంది. వారం రోజులుగా మార్కెట్‌కు ఉల్లి భారీగా వస్తోంది. నిత్యం 60 నుంచి 70 ట్రక్కుల్లో 10 వేల బ్యాగులు వస్తాయి. ప్రస్తుతం 70 నుంచి 120 ట్రక్కుల్లో 30 వేల సంచుల వరకు దిగుమతి అవుతోంది.

కారణాలు ఇవే

మహారాష్ట్రలో ఈసారి పంట దిగుబడి అధికంగా వచ్చింది. అదీగాక 2018 రబీ సీజన్‌లో నిల్వ ఉంచిన సరుకు బయటకు తీస్తున్నారు. ఈ క్రమంలో అక్కడ ధరలు దారుణంగా పడిపోయాయి. సగటున కిలో 50 పైసల నుంచి రూ.2 మించడం లేదని తెలుస్తోంది. కనీసం పెట్టుబడులు కూడా రాక అక్కడి రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. కొంతమంది ఉల్లిని రోడ్లపైనే పారబోస్తున్నారు. ఈ నేపథ్యంలో అంత తక్కువ ధరకు అక్కడే అమ్మే బదులు రైతులు తెలంగాణకు తీసుకొస్తున్నారు.

మరింత కిందికి..

ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్లో క్వింటాల్ ధర రూ.500 నుంచి రూ.700 మాత్రమే పలుకుతోంది. నాసిరకం ఉల్లిని రూ.200 నుంచి రూ.400కు అమ్ముతున్నారు. అయితే పది రోజుల క్రితం వరకు క్వింటాల్ రూ.1,000 నుంచి రూ.1,400 వరకు కొనుగోలు చేశారు. రిటైల్ మార్కెట్‌లో ప్రస్తుతం ఉల్లి ధర కిలో రూ.10 నుంచి 15 వరకు పలుకుతోంది. వారం క్రితం రూ.20 వరకు పలికింది. ధర మరింత తగ్గే అవకాశం ఉందని ఉల్లి వ్యాపారులు చెబుతున్నారు.



మద్దతు ధర వస్తలేదు

పంట బానే వచ్చింది. కానీ మహారాష్ట్రలో మద్దతు ధర వస్తలేదు. డిసెంబర్‌లో రావాల్సిన నిల్వ చేసిన సరుకును ఇప్పుడు బయటికి తీసి అమ్ముతున్నరు. దీంతో కిలోకు 50 పైసల నుంచి రూ.2 మాత్రమే వస్తోంది.

- శివాజీ చంద్రబాన్ సుఖదే, మహారాష్ట్ర



ఐదుగురం కలిసొచ్చినం..

మహారాష్ట్రలో ధర లేకపోవడంతో నలుగురు, ఐదుగురం కలిసి ఉల్లిని ఒకే లారీలో హైదరాబాద్‌కు తీసుకొచ్చినం. ఇక్కడ క్వింటాల్‌కు 500 నుంచి 700లే వస్తోంది. ఖర్చులు కూడా మిగలట్లేదు

- గణేశ్ నాయక్ నైఖ్వాడే, బీడ్ మహారాష్ట్ర

రామ జన్మభూమి కేసు మళ్లీ వాయిదా

న్యూఢిల్లీ: అయోధ్య రామ జన్మ భూమి కేసులో ఈ నెల 29న జరగాల్సిన విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఐదుగురు సభ్యుల బెంచ్‌లో జస్టిస్ ఎస్.ఏ బాబ్డే అందుబాటులో లేనందున కేసు విచారణను వాయిదా వేస్తున్నట్టు కోర్టు రిజిస్ట్రీ పేర్కొంది. ఈ కేసు విచారణలో నుంచి జస్టిస్ యు.యు.లలిత్ తప్పుకోవటంతో ఇటీవల ఐదుగురు సభ్యులతో కొత్త బెంచ్ ఏర్పాటవడం తెలిసిందే. 29న కేసును విచారిస్తామని గతంలో సుప్రీం ప్రకటించింది.

కొచ్చర్ కేసు విచారణ అధికారి బదిలీ

న్యూఢిల్లీ: ఐసీఐసీఐ బ్యాంక్ కేసు విచారణ జరుపుతున్న అధికారి సుధాన్షు ధర్ మిశ్రాను సీబీఐ బదిలీ చేసింది. ప్రాథమిక విచారణలో జరిపిన సోదాలకు సంబంధించిన వివరాలు లీకయ్యాయని, అందులో సుధాన్షు పాత్ర ఉందనే అనుమానంతో ఆయనను ట్రాన్స్‌ఫర్ చేసినట్లు సమాచారం. చందాకొచ్చర్ , ఆమె భర్త దీపక్‌కొచ్చర్ తోపాటు వీడియోకాన్ ఎండీ వేణుగోపాల్ ధూత్‌పై చార్జిషీటు దాఖలు చేసిన మరుసటి రో జే ఎస్పీ సుధాన్షును సీబీఐ రాంచీకి పంపింది. సీబీఐలో బ్యాంకింగ్, సెక్యూరిటీస్ ఫ్రాడ్ సెల్‌లో సుధాన్షు పనిచేస్తున్నారు. ఐసీఐసీఐ-వీడియోకాన్ కేసులో కొచ్చర్ దంపతులు, వేణుగోపాల్‌పై ఈ నెల 22న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.



'వందే భారత్' వస్తున్నది

దేశంలోనే అత్యంత వేగవంతమైన రైలు
ఢిల్లీ -వారణాసి మధ్య పరుగులు
ప్రజలకు గణతంత్ర బహుమతి: రైల్వే మంత్రి

న్యూఢిల్లీ: అందరికీ నమస్తే అంటూ రాబోతోంది 'వందే భారత్'. న్యూఢిల్లీ నుంచి వారణాసి మధ్య గంటకు 180 కిలోమీటర్ల టాప్ స్పీడ్‌తో దూసుకెళ్లబోతోంది. నిన్న మొన్నటి వరకూ 'ట్రైన్ 18'గా పిలుచుకున్న ఈ రైలు పేరును వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌గా మార్చినట్లు రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ఆదివారం ప్రకటించారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా తయారైన శతాబ్ది ఎక్స్‌ప్రెస్ వారసుడికి వందే భారతే తగిన పేరని నిర్ణయించినట్లు చెప్పారు. 70వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా దేశ ప్రజలకు ఎన్డీయే సర్కారు ఇస్తున్న బహుమతి ఇదేనన్నారు. రైలును పచ్చజెండా ఊపి ప్రారంభించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కోరతామని తెలిపారు.

స్వదేశీ టెక్నాలజీ

వందే భారత్‌ని తయారు చేసింది భారతీయ ఇంజనీర్లే. కేవలం 97 కోట్ల రూపాయలతో 18 నెలల్లో ప్రపంచస్థాయి కోచ్‌లను రైలు కోసం సిద్ధం చేశారు. బుల్లెట్ ట్రైన్ ఫీల్ రావడానికి తెలుపు, ముదురు నీలం రంగులను ఎంచుకున్నారు. వందేభారత్‌లో 16 కోచ్‌లు ఉంటాయి. ఢిల్లీ నుంచి బయల్దేరి వారణాసికి చేరే మధ్యలో కాన్పూర్, అలహాబాద్‌లో మాత్రమే ఆగుతుంది. ట్రైన్ 18కు మంచి పేరు సూచించాలని ప్రజలను సర్కారు కోరిన సంగతి తెలిసిందే. దీంతో వేల మంది ప్రజలు అభిప్రాయాలు పంపారు. అయితే వందే భారత్ ప్రజలు సూచించిన పేరు కాదు. సర్కారే ఏరి కోరి ఈ పేరు పెట్టింది. సర్వీసులోకి వస్తే ఇండియాలో నడిచే అత్యంత వేగవంతమైన రైలు



రైలు లోపలి భాగం

ఇదే. ప్రస్తుతం శతాబ్ది ఎక్స్‌ప్రెస్ 155 కిలోమీటర్ల టాప్ స్పీడ్‌తో తొలి స్థానంలో ఉంది.

సామాన్యుడు తట్టుకోగలడా?

ట్రైన్ 18 గురించి తెలిసిన నాటి నుంచి దేశ ప్రజల్లో దాని గురించి భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మన ఇంజనీర్లు స్పెషల్‌గా డిజైన్ చేసిన ట్రైన్ ప్రజలకు తెగ నచ్చేసింది. రైలు అందుబాటులోకి వచ్చాక సాధ్యపడితే ఒక్కసారైనా ఎక్కాలనుకునే మిడిల్ క్లాస్ వాళ్లకు దేశంలో కొదవేలేదు. కానీ వందే భారత్ టికెట్ల ధరల గురించి తెలిస్తే సామాన్యుడు 'అమ్మో' అనక మానడు. శతాబ్ది ఎక్స్‌ప్రెస్ టికెట్ల ధరల కంటే 40 నుంచి 50 శాతం ఎక్కువగా వందే భారత్ టికెట్లను అమ్మాలని రైల్వే శాఖ నిర్ణయించింది. మామూలుగా శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ నుంచి వారణాసి చేరడానికి 11 గంటల 30 నిమిషాలు పడుతుంది. అదే వందే భారతయితే కేవలం 8 గంటల్లో 755 కిలోమీటర్ల దూరానికి సునాయాసంగా వచ్చి చేరుతుంది. పైగా ఆగే స్టాప్స్ రెండే. వేగంగా గమ్య స్థానానికి వెళ్లాలనుకునే వారికి బాగానే ఉపయోగపడుతుందనే అంచనాలు ఉన్నాయి. ఎగ్జిక్యూటివ్ క్లాస్ చార్జీలు రూ.2,800 నుంచి రూ.2,900 మధ్య, చైర్ కార్ చార్జీలు రూ.1,600 నుంచి 1,700 ఉంటాయని రైల్వే శాఖ ఆఫీసర్లు వెల్లడించారు.

విశేషాలివి


- ఈ రైలుకు ఇంజన్ ఉండదు. ఏరో డైనమిక్ డ్రైవర్ క్యాబిన్లు రెండు వైపులా ఉంటాయి. 16 కోచ్‌లు కలిసికట్టుగా ఓ కంప్యూటర్ యూనిట్‌లా పని చేస్తాయట.
- చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ(ఐసీఎఫ్)లో ట్రైన్ 18ను దేశీ పరిజ్ఞానంతో తయారు చేశారు.
- ఆప్టికల్ సెన్సర్లతో కూడిన ఆటోమేటిక్ డోర్లు
- రైల్లోని రెండు బోగీలు ఎగ్జిక్యూటివ్ చైర్ కార్లు. యూరోపియన్ స్టైల్‌లో సీటింగ్ ఉంటుంది. 180 డిగ్రీల్లో ఈ చైర్లను ఎటు కావాలంటే, అటు తిప్పుకోవచ్చు.
- ఆన్‌బోర్డు వైఫై, ఎల్ఈడీలను కాంతిని అవసరానికి తగ్గొట్టు మార్చుకోవచ్చు. సీట్లకు రీడింగ్ లైట్స్ కూడా అమర్చివుంటాయి.
- బయో వాక్యూమ్ సిస్టమ్‌తో కూడిన ఆధునిక టాయిలెట్లు
- ప్రతి కోచ్‌లోనూ మినీ ప్యాంట్రీ ఉంటుంది. ఇందులో అన్ని రకాల వసతులు ఉంటాయి.
- జీపీఎస్ బేస్డ్ పాసింజర్ ఇన్ఫర్మేషన్
- దివ్యాంగుల కోసం డ్రైవర్ క్యాబిన్‌లో వీల్ చైర్స్ అందుబాటులో ఉంటాయి.



వందే భారత్ రైలు డ్రైవర్ క్యాబిన్

ఏవోబీలో 'ఆపరేషన్ సమాధాన్'

వరంగల్, వెలుగు: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో మావోయిస్టుల 'ఆపరేషన్ సమాధాన్' వారోత్సవాలు ఆదివారం నుంచి మొదలయ్యాయి. ఏవోబీ కటాఫ్ ఏరియాలో స్థూపం నిర్మించి అమరులకు నివాళులు అర్పించారు. ఇటీవల ఎదురుకాల్పుల్లో చనిపోయిన మావోయిస్టు మొదటి మహిళా నాయకురాలు మీనా స్మారకంగా దీన్ని నిర్మించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున గిరిజనులు హాజరైనట్లు సమాచారం. 'అటవీ సంపదను దోచుకుంటున్న వారిని అడ్డుకుందాం, ఖనిజ సంపదను కాపాడుకుందా' అని విప్లవ గీతాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అన్యాయాలను గిరిజనులకు మావోయిస్టు నాయకులు వివరించినట్లు తెలుస్తోంది. దీంతో ఏవోబీలో బస్సులు, వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వారంపాటు స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. బయటకు వెళ్లొద్దని ప్రజాప్రతినిధులకు సూచించారు.



మార్స్‌పై మరో కొత్త గొయ్యి

అంగారక గ్రహంపై మరో కొత్త గొయ్యిని సైంటిస్టులు గుర్తించారు. గత ఏడాది జూలై, సెప్టెంబర్ మధ్యలో ఆ గొయ్యి ఏర్పడి ఉండొచ్చని భావిస్తున్నారు. భారీ ఉల్క ఢీకొట్టడం వల్ల మార్స్‌పై గొయ్యి పడి ఉండొచ్చంటున్నారు. ఉల్క ప్రభావం వల్ల 'రెండు టన్నుల' శక్తితో పేలుడు సంభవించిందంటున్నారు. ద మార్స్ రికనైసెన్స్ ఆర్బిటార్ హై రిజొల్యూషన్ ఇమేజింగ్ సైన్స్ ఎక్స్‌పరిమెంట్ (హైరైజ్) కెమెరా తీసిన ఫొటోలను సైంటిస్టులు విశ్లేషించి ఈ విషయం చెప్పారు. ఉల్క ప్రభావానికి గొయ్యి చుట్టు పక్కల మంచంతా పోయిందన్నారు. మార్స్ దక్షిణ ధ్రువంలో ఏర్పడిందీ గొయ్యి. అయితే, దాని గురించి పూర్తి వివరాలు మాత్రం వెల్లడించలేదు. మార్స్‌ను ఏటా 200 ఉల్కలు, తోకచుక్కలు ఢీకొడతాయట.

'పాలమూరు'కు జోష్

పరుగులు పెట్టనున్న పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు పనులు



- పర్యావరణ తుది అనుమతులే పెండింగ్
- రేపో మాపో అవీ వస్తాయంటున్న అధికారులు
- వచ్చే నెలలో పనులను పరిశీలించనున్న సీఎం
- రెండేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళిక

హైదరాబాద్, వెలుగు: దక్షిణ తెలంగాణ వరప్రదాయిని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టనున్నాయి. 12.30 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే ఈ ప్రాజెక్టుకు అన్ని లైన్లు క్లియర్ అవుతున్నాయి. ఇటీవలే కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ తుది దశ అటవీ అనుమతులు ఇవ్వడంతో మార్గం సుగమమైంది. రేపోమాపో తుదిదశ పర్యావరణ అనుమతులు కూడా వస్తాయని ఇంజినీర్లు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇందుకోసం ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నారు. అనుమతులన్నీ వచ్చేస్తుండటంతో ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రెండోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్.. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే తొలి ప్రాధాన్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే కాళేశ్వరం పనులు శరవేగంగా సాగుతున్నాయి. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కూడా పూర్తి చేయాలని ఆయన అధికారులకు తేల్చిచెప్పారు. ఫిబ్రవరిలో ప్రాజెక్టు పనులను పరిశీలిస్తానని ఇటీవల నిర్వహించిన నీటి పారుదల శాఖ రివ్యూలో తెలిపారు. కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని సీఎం అన్నారు.

21 వేల ఎకరాలకుపైగా భూ సేకరణ


ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ఆరు రిజర్వాయర్లు, పంపుహౌస్‌లు, కాలువలు, టన్నెళ్ల కింద 27,035.32 ఎకరాల భూమి ముంపునకు గురవుతుండగా.. ఇందులో 21,506.77 ఎకరాలు పట్టా భూములు, 5,528.56 ఎకరాలు ప్రభుత్వ భూములు, 508 ఎకరాలు అటవీశాఖ భూములు. పట్టా భూముల్లో 16,597.96 ఎకరాలు, ప్రభుత్వ భూముల్లో 4,808.34 ఎకరాలు సేకరించారు. మొత్తంగా ఇప్పటివరకు 21,406.30 ఎకరాల భూసేకరణ జరిగింది. ఇటీవల అటవీ శాఖ తుది అనుమతులివ్వడంతో ఆ శాఖ పరిధిలోని భూముల బదలాయింపునకు మార్గం సుగమమైంది.

జూరాల టు శ్రీశైలం

ఉమ్మడి ఏపీలో జూరాల ప్రాజెక్ట్ నుంచి రోజుకు 1.5 టీఎంసీల నీటిని ఎత్తి కోయిలకొండ, గండీడు, కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్లను నింపి 10 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జూరాల నుంచి అంత మొత్తంలో నీటిని తోడటంలో సాంకేతిక ఇబ్బందులు, భారీ ముంపు వంటి సమస్యలు ఎదురయ్యాయి. ఈ క్రమంలో తెలంగాణ ఏర్పడి టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టును రీ డిజైన్ చేసింది. శ్రీశైలం నుంచి వర్షాకాలంలో కనీసం 60 రోజులపాటు 2 టీఎంసీల చొప్పున నీటిని ఎత్తిపోయాలని టార్గెట్ పెట్టుకున్నారు. అంజనాగిరి, వీరాంజనేయ, వెంకటాద్రి, కురుమూర్తిరాయ, ఉద్దండపూర్, కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్లకు, చెరువులకు నీటిని ఎత్తిపోయాలని ప్రతిపాదించారు. ఆరు రిజర్వాయర్ల సామర్థ్యం 69.60 టీఎంసీలు. ఆయకట్టును 12.30 లక్షల ఎకరాలకు పెంచారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 1,226 గ్రామాలకు సాగునీరు అందనుంది. మిషన్ భగీరథలో భాగంగా వెయ్యి గ్రామాలకు ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీరు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

రెండేళ్లలో పూర్తి

ప్రాజెక్టును రీ డిజైనింగ్ చేసిన ప్రభుత్వం 2015 జూన్ 10న రూ.35,200 కోట్లకు పరిపాలన అనుమతులు ఇచ్చింది. వర్క్ ఏజెన్సీ 29,248 కోట్లతో అగ్రిమెంట్ చేసుకొని పనులు చేపట్టింది. ఇప్పటి వరకు రూ. 5 వేల కోట్లకు పైబడి పనులు చేశారు. 30 నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా అటవీ శాఖ అనుమతులు, భూసేకరణలో సమస్యలతో ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమైంది. రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయాడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే కేంద్రానికి అందజేస్తామని వెల్లడించారు.



డబ్ల్యూహెచ్‌వో రీజినల్ డైరెక్టర్‌గా పూనమ్

వరుసగా రెండోసారి నియామకం

న్యూఢిల్లీ: ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సౌత్‌ఈస్ట్ ఆసియా రీజినల్ డైరెక్టర్‌గా పూనమ్ క్షేత్రపాల్ సింగ్ వరుసగా రెండోసారి నియమితులయ్యారు. డబ్ల్యూహెచ్‌వో ఎగ్జిక్యూటివ్ బోర్డు ఈ మేరకు ఆమె నియామకాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. అంతకుముందు 11 సభ్య దేశాలు క్షేత్రపాల్ సింగ్‌ను ఏకగ్రీవంగా నామినేట్ చేశాయి. దీంతో మరో ఐదేళ్లపాటు రీజినల్ డైరెక్టర్‌గా ఆమె కొనసాగుతారు.

దహన సంస్కారాలకు వెళ్తూ తిరిగి రాని లోకానికి

- లోయలో పడ్డ కారు
- ఉత్తరాఖండ్‌లో 8 మంది మృతి

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని లోహాఘాట్ ఏరియాలో ఆదివా రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగిం ది . ఈ ప్రమాదంలో ఎనిమిది మంది చినిపోగా.. పది మంది గాయపడ్డా రు. అనారోగ్యంతో చనిపోయిన ఒక వ్యక్తి దహన సంస్కారాలకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కారు లోయలో పడటంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు చెప్పారు. ఈ ఘటనలో ఎనిమిది మంది అక్కడికక్కడే చనిపోగా.. మరో 10 మంది గాయపడ్డారు. గాయపడిన వారిని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

బూడిదే కదా అనొద్దు

ఎరువులకు ప్రత్యామ్నాయంగా మొక్కలకు ఫ్లైయాష్

హైదరాబాద్, వెలుగు:

బూడిదలో పోసిన పన్నీరంటూ.. బూడిదను వృథాగా చెబుతుంటారు. కానీ ఆ బూడిద కూడా ఆదాయ వనరేనని సైంటిస్టులు అంటున్నారు. మొక్కల ఎదుగుదలకు తోడ్పడుతుందని, ఎరువుల స్థానంలో వాడితే మంచి ఫలితాలొస్తాయని చెబుతున్నారు.

పోషకాల మూట

మొక్కల ఎదుగుదలకు ప్రాథమిక పోషకాలైన నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం బూడిదలో పుష్కలంగా ఉన్నాయి. కాపర్, జింక్, మెగ్నీషియం, ఫెరస్, మాలీబిడ్నం, బోరాన్, జిప్సమ్ వంటి సూక్ష్మ పోషకాలూ ఉన్నాయి. దాదాపు అన్ని పంటల్లోనూ ఈ పోషకాలున్న ఎరువులనే వాడుతారు. వాటికి బదులు ఫ్లైయాష్ వాడితే కొంత వ్యయ భారం తగ్గుతుంది. పైగా బూడిద భూమిని గట్టి పడనివ్వదు. ఎప్పుడూ గుల్లగా ఉండేలా తోడ్పడుతుంది. దీంతో వేర్లకు సరిపడ ఆక్సిజన్ అంది మొక్క ఎదుగుదల బాగుంటుందని సైంటిస్టులు వివరిస్తున్నారు. చవుడు భూముల క్షారత్వాన్నీ ఫ్లై యాష్ తగ్గిస్తుందని, యూకలిప్టస్, వెదురు, టేకు, నీలగిరి వంటి చెట్లు వేగంగా ఎదగడానికి దోహదపడుతుందని చెబుతున్నారు. మన రాష్ట్ర భూముల్లో ఫాస్పరస్, పొటాషియం తక్కువగా ఉంటాయని, ఇవి రెండూ పుష్కలంగా ఉండే ఫ్లైయాష్ వాడితే మంచి ఫలితాలుంటాయని ఫారెస్టు అకాడమీ డైరెక్టర్ కె.తిరుపతయ్య చెప్పారు.

మెగావాట్‌కు ఎకరం!

ఓ మెగా వాట్ విద్యుదుత్పత్తికి వెలువడే ఫ్లైయాష్‌ను నిల్వ చేసేందుకు ఎకరం భూమి అవసరం. ఎన్టీపీసీల్లో మిగులుతున్న యాష్‌ను వాడుకలోకి తీసుకురావాలన్న లక్ష్యంతో 1994లో అప్పటి ప్రభుత్వం ఫ్లైయాష్ మిషన్‌ను రూపొందించింది. ప్రస్తుతం ఇటుకలు, సిమెంట్, కాంక్రీట్ తయారీ, రోడ్ల నిర్మాణంలో, కాలం చెల్లిన గనుల్లో ఇసుకకు బదులుగా యాష్‌ను వాడుతున్నారు. ఫ్లైయాష్‌ఉపయోగాలు తెలియక వాడటానికి ఎక్కువ మంది ఆసక్తి చూపడంలేదు. అందుకే దీనివి నియోగంపై ప్రత్యేక కోర్సు ప్రారంభించడానికి ఫారెస్టు అకాడమీ సిద్ధమవుతోంది.

నర్సరీలకు సరఫరా

సింగరేణి, భద్రాచలంలోని ఐటీసీ పేపర్‌మిల్‌సంస్థ చెట్ల పెంపకంలో బూడిద వాడి మంచి దిగుబడులు సాధించింది. దీంతో 'తెలంగాణకు హరితహారం'లో భాగంగా రాష్టంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లోనూ మొక్కల పెంపకానికి బూడిదే వాడాలని అటవీ శాఖ ఆలోచిస్తోంది. ఈ ఏడాది ఐదో విడత హరితహారం మొదలవనుంది. ఆ లోగా నర్సరీలకు ఫ్లైయాష్‌పంపాలని ఆ శాఖ అధికారులు భావిస్తున్నారు. పెద్దపల్లి జిల్లాలోని రామగుండం థర్మల్‌విద్యుదుత్పత్తి కేంద్రం నుంచి ఫ్లైయాష్‌ను అన్ని నర్సరీలకు సరఫరా చేయొచ్చని, దీనికి లాజిస్టిక్స్ సమకూర్చోకోవాల్సి ఉందని ఓ అటవీ అధికారి చెప్పారు.

సోమవారం | హైదరాబాద్
28.01.2019
www.v6velugu.com
ప్రభాత వెలుగు
Follow: v6velugu

'ఓ అవ్వా.. ఓ అన్నా.. ఓ అక్కా.. నాకు ఓటు వేసుడు మరిసిపోకుండ్రి. నేను గెలిస్తే మీకు మస్తు పనులు జేసిపెడుతా' అంటూ మొన్నటివరకు ఊళ్లల్లో ఓటర్ల దగ్గరకు వెళ్లి పైసలు పంచిన నేతలు ఇప్పుడు ప్లేటు ఫిరాయించారు. ఫస్ట్ ఫేజ్, సెకండ్ ఫేజ్ పంచాయతీ ఎన్నికల్లో ఓడిపోయినవాళ్లంతా.. తాము పంచిన డబ్బులను తిరిగి ఇచ్చేయాలంటూ పట్టుబడుతున్నారు.

మా పైసలియ్యుండ్రి

పంచిన పైసలు వసూలు చేసుకుంటున్న ఓడిన అభ్యర్థులు



మెదక్, వెలుగు: ఈ సారి పంచాయతీ ఎలక్షన్లల్లో చాలాచోట్ల ఇది వరకు ఎన్నడూ లేనట్టు గట్టి పోటీ నెలకొంది. పెద్ద పంచాయతీలు, ఎక్కువ ఆదాయం వచ్చే చాన్స్ ఉన్నచోట సర్పంచ్‌గా గెలిచేందుకు క్యాండిడేట్లు దండిగ పైసలు ఖర్చు పెట్టారు. ఎలాగైనా గెలవాలని మందు, విందులకు మస్తు ఖర్చు పెట్టారు. గంపగుత్తగా ఓట్లు కొనేందుకు కుల సంఘాలు, వృత్తి సంఘాలకు లక్షలకు, లక్షలు ఇచ్చారు. అంతేగాక తమ ప్యానెల్ నుంచి నిలబడ్డ వార్డుమెంబర్ల ఎలక్షన్ ఖర్చుకు దండిగనే పైసలిచ్చారు. ఇక పక్కాగా గెలుపు మాదే అని భరోసాతో ఉండగా, బ్యాలెట్ డబ్బాలిప్పి ఓట్లు లెక్కపెట్టేసరికి రిజల్ట్ ఉల్టాపల్టా అయ్యింది. 'నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనాయన్నట్టు' పైసలు తీసుకుని పక్కాగ మీకే ఓటేస్తామని మాటిచ్చినోళ్ల చెయ్యిచ్చారు. వార్డు మెంబర్ క్యాండిడేట్‌లు సైతం వాళ్ల గుర్తులు ప్రచారం చేసుకున్నారు కానీ సర్పంచ్ గుర్తుల గురించి పెద్దగా పట్టించుకోలేదు. దీంతో క్రాస్ ఓటింగ్‌తో ఓడిపోయిన సర్పంచ్ క్యాండిడేట్‌లు ఇంత మోసమా అని గుస్సా అవుతున్నారు. కొందరు ఏం జేస్తాం మాకు సర్పంచ్ అయ్యే భాగ్యం లేదని చప్పుడు చేయకుండా ఊరుకుంటే దండిగా ఖర్చు పెట్టిన మరికొందరు ఇచ్చిన పైసలు రికవరీ చేస్తున్నారు. కొన్ని ఊర్లలో ఎలక్షన్ సందర్భంగా మహిళలకు పంపిణీ చేసిన చీరలు, కుంకుమ భరిణెలు వంటి వస్తువులు కూడా తమవి తమకు ఇచ్చేయాలని అడుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఓటర్లు మాత్రం 'మేం మీ దగ్గరికి వచ్చి పైసలియ్యమని అడిగినమా.. మీ అంత మీరే వచ్చి ఇచ్చిండ్రు' మీరు ఓడిపోతే దానికి మేం కారణమా అంటూ ఎదురుదాడికి దిగుతుండటంతో వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇదిలా ఉండగా క్రాస్ ఓటింగ్ జరిగిన గ్రామాల్లో మీ కారణంగానే మేం ఓడిపోయామంటూ సర్పంచ్ క్యాండిడేట్‌లు వార్డు మెంబర్‌లకు ఇచ్చిన పైసలు తిరిగిచ్చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని రెండు గ్రామాల్లో ఓడిపోయిన క్యాండిడేట్లు పైసలు తిరిగి ఇవ్వాలని అడగడంతో మాటామాటా పెరిగి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

గజ్వేల్ నియోజకవర్గంలోని ఓ పంచాయతీలో ఇద్దరు అభ్యర్థులు పోటాపోటీగా తలపడ్డారు. గ్రామంలో 400 లోపు ఓట్లు ఉన్నాయి. ఓ అభ్యర్థి ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలని రూ. 2 లక్షల వరకు ఓటర్లు, కులసంఘాలకు ముట్టజెప్పాడు. ఈ పంచాయతీకి రెండో విడతలో జరిగిన ఎన్నికల్లో ఆ అభ్యర్థి ఓడిపోయాడు. దీంతో ఓటర్లు, సంఘాలకు పంచిన పైసలు తిరిగి ఇవ్వాలని ఇంటింటికి వెళ్లి వసూలు ప్రారంభించాడు. సంఘాలకు ఇచ్చిన లక్ష తిరిగిస్తామని వారు ఒప్పుకున్నారు. ఓటర్లు మాత్రం మేం ఎందుకిస్తామని ఎదురు తిరగడంతో గ్రామంలో ఈ విషయం చర్చనీయంగా మారింది.

కొండపాక మండలం ఓ పంచాయతీలోని వార్డులో 220 లోపు ఓట్లున్నాయి. పోటీ తీవ్రంగా ఉండడంతో పోటీలో ఉన్న అభ్యర్థి ఒకరు వార్డులోని మహిళలకు సుమారు 50 చీరల వరకు పంపిణీ చేశాడు. తీరా ఎన్నికల్లో ఓటమి పాలయ్యాడు. అది తట్టుకోలేక అతని భార్య తిట్ల పురాణం మొదలు పెట్టింది. దీంతో ఆ వార్డులోని మహిళలంతా చీరలు తెచ్చి ఆమె ముఖాన విసిరికొట్టారు.

కొండపాక మండలంలోని మరో పంచాయతీలో సర్పంచి అభ్యర్థి ఎన్నికల్లో ఎలాగైనా గెలిపించాలని లక్షల్లో ఖర్చుపెట్టాడు. తీరా ఓటమి పాలయ్యాడు. దీంతో ఓ సంఘానికి చెందినవారు తమకిచ్చిన రూ.50 వేలు స్వచ్ఛందంగా ఆయనకు ఇచ్చేశారు.

సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం జాజిరెడ్డిగూడానికి చెందిన ఓ నాయకుడు తన భార్యను వార్డు మెంబర్‌గా నిలబెట్టాడు. 245 ఓట్లున్న వార్డులో విజయం కోసం ఒక్కో ఓటుకు రూ. 500 చొప్పున పంచాడు. తీరా భార్య ఓడిపోవడంతో డబ్బులు తిరిగి ఇచ్చేయాలని సంచీ పట్టుకొని అందరి ఇళ్లకూ తిరుగుతున్నాడు.

రైతుల కోసం సరికొత్త కార్యక్రమం

ఏపీ సీఎం చంద్రబాబు

విజయవాడ, వెలుగు: ఏపీలో రైతులు, కౌలు రైతులను ఆదుకునేందుకు సరికొత్త కార్యక్రమాన్ని చేపట్టనున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ఆదివారం కృష్ణా జిల్లా కొమరవోలులో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. సతీమణి భువనేశ్వరి దత్తత తీసుకున్న కొమరవోలులో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, పంచాయతీ కార్యాలయం, ఎన్టీఆర్ గృహసముదాయాన్ని ప్రారంభించారు. అభివృద్ధి కార్యక్రమాల పైలాన్‌ను ఆవిష్కరించారు. 'ప్రపంచంలోని ఐదు అత్యుత్తమ నగరాల్లో అమరావతి ఒకటిగా నిలుస్తుంది. ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా రైతుల నుంచి 33వేల ఎకరాలు సేకరించాం. పోలవరం కంటే ముందు పట్టిసీమ పూర్తి చేసి కృష్ణా డెల్టా రైతులను ఆదుకున్నాం. చరిత్ర ఉన్నంత వరకు నేను చేసిన అభివృద్ధి నిలిచిపోతుంది' అని అన్నారు.


వైఎస్ జగన్‌తో దగ్గుబాటి భేటీ

త్వరలో వైఎస్సార్సీపీలోకి!


హైదరాబాద్, వెలుగు: వైఎస్సార్సీపీ చీఫ్ వైఎస్ జగన్‌తో కలిసి పని చేసేందుకు తన కుమారుడు హితేశ్ చెంచురామ్ సిద్ధంగా ఉన్నాడని ఏపీ సీఎం చంద్రబాబు తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జగన్‌తో ఆయన భేటీ అయ్యారు. త్వరలో నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో సమావేశమై వైఎస్సార్సీపీలో చేరే అంశంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. తన భార్య పురందేశ్వరి బీజేపీలోనే కొనసాగుతారని చెప్పారు. బాబు ప్రభుత్వం పనితీరు గాడి తప్పిందని, ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవంటూనే దీక్షల పేరుతో రూ. కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ఎన్ని కష్టాలొచ్చినా పార్టీని జగన్ నడుపుతున్న తీరు అభినందనీయమన్నారు. మరోవైపు తాను బీజేపీని వీడేది లేదని పురందేశ్వరి స్పష్టం చేశారు.

'అవార్డుల'పై మాటల మంటలు

ఎంపిక తీరుపై విమర్శల వెల్లువ


బాబా రాందేవ్


కేరళ మాజీ డీజీపీ సేన్‌కుమార్


మల్లికార్జున ఖర్గే

- హిందూ సన్యాసులకు భారత రత్న ఎందుకివ్వరు?
- థెరిస్సాకు ఇచ్చినప్పుడు వాళ్లేం తప్పుచేశారు?: రాందేవ్
- ఆరెస్సెస్ సిఫార్సులే అమలు చేస్తున్నారు: మాతే మహాదేవి
- మున్ముందు రేపిస్టులకూ ఇస్తారేమో: కేరళ మాజీ డీజీపీ

న్యూఢిల్లీ: భారత రత్న, పద్మ అవార్డుల ఎంపిక తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాయకులు, సాధువులు, మాజీ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఇప్పటివరకు ఏ ఒక్క హిందూ సన్యాసికి భారతరత్న ఇవ్వకపోవడం దురదృష్టకరమని యోగా గురువు బాబా రాందేవ్ అన్నారు. స్వామి వివేకానంద, దయానంద సరస్వతి వంటివారు దేశానికి చేసిన సేవకంటే రాజకీయ నాయకులు, కళాకారులు చేసిన సేవలు ఎక్కువా? అని ప్రశ్నించారు. 70 ఏళ్లలో ఏ ఒక్క హిందూ సాధువుకు భారత రత్న ఇవ్వలేదని, క్రిస్టియన్ అయిన మదర్ థెరీసాకు ఇచ్చినప్పుడు హిందూ సాధువులకు ఇవ్వకపోవడం ఏమిటని ఆదివారం మీడియాతో అన్నారు. హిందుత్వం కోసం పాటుపడే సన్యాసులను కొందరు చులకనగా చూస్తున్నారని, ఈ దేశంలో హిందూ సాధువులుగా పుట్టడం అంత పాపమా? అని ప్రశ్నించారు. రాజకీయాలకు అతీతంగా ఉండాల్సిన భారతరత్న పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని బసవదళ పీఠానికి చెందిన మాతే మహాదేవి ఆరోపించారు. సిద్ధగంగ మఠాధిపతి శివకుమార స్వామీకి అన్ని అర్హతలున్నా.. ఆయనను ఎందుకు ఎంపిక చేయలేదని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ సిఫారసు చేసిన వారికే భారతరత్న ఇచ్చారని ఆరోపించారు. శివకుమార స్వామీకి భారత రత్న ఇవ్వాలని కోరినా కేంద్రం పట్టించుకోలేదని కర్ణాటక హోం మంత్రి ఎం.బి.పాటిల్ అన్నారు. మరో వైపు పౌరసత్వ బిల్లు వివాదాన్ని తెరదించేందుకే అస్సాంకు చెందిన గాయకుడు భూపేన్ హజారికాకు భారత రత్న ప్రకటించారని ఆ రాష్ట్ర నేతలు విమర్శిస్తున్నారు. 'హజారికాకు భారతరత్న ఇవ్వడంపై అందరం హర్షిస్తున్నాం. కానీ పౌరసత్వ బిల్లు వివాదం కారణంగానే ఇచ్చినట్లు అనుమానాలు కలుగుతున్నాయి. ఆ బిల్లును రద్దు చేయడమే హజారికాకు నిజమైన నివాళి' అని అసోం మాజీ సీఎం తరుణ్ గొగోయ్ అన్నారు. ఇదిలా ఉంటే.. ఇస్రో సైంటిస్టు నంబి నారాయణన్‌కు పద్మభూషణ్ అవార్డు ప్రకటించడంపై కేరళ మాజీ డీజీపీ టీపీ సేన్ కుమార్ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. నంబి నారాయణన్‌పై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగానే అవార్డు ఎలా ప్రకటిస్తారని, సమాజానికి ఆయన చేసిందేమీ లేదని అన్నారు. మున్ముందు రేపిస్టులకు, క్రిమినల్స్‌కు కూడా అవార్డులను ఇస్తారేమోనని విమర్శించారు. సేన్ కుమార్ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి కేజే అల్ఫోన్స్ తప్పుబట్టారు. 'మలయాళీలది డీఎన్ఏ సమస్య. ఒక మలయాళీ ఎదిగితే మరో మలయాళీ సహించలేడు' అని దుయ్యబట్టారు.

ఖర్గే, జుబీన్ గార్గ్‌పై కేసు

భారతరత్న ఎంపికపై విమర్శలు చేసిన కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే, అస్సాం గాయకుడు జుబీన్ గార్గ్‌పై కేసులు నమోదయ్యాయి. 'ఆధ్యాత్మిక గురువు శివకుమార స్వామికి బదులు గాయకుడు (భూపేన్ హజారికా), ఆరెస్సెస్ ప్రచారక్ (నానాజీ దేశ్‌ముఖ్)కు భారత రత్న ప్రకటించడం ఏమిటి?' అని ఖర్గే శనివారం వ్యాఖ్యానించారు. అస్సాం రాష్ట్ర ప్రజల మనోభావాలను ఖర్గే కించపరిచారని పేర్కొంటూ ఆర్టీఐ కార్యకర్త రాజు మహంతా ఫిర్యాదు చేయగా.. ఆ రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేశారు. మరో వైపు అస్సాం గాయకుడు జుబీన్ గార్గ్ భారత రత్న అవార్డును కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని పోలీసులు కేసు నమోదు చేశారు. 2016లో అస్సాం అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయానికి తన పాటలతో కీలక పాత్ర పోషించిన జుబీన్.. పౌరసత్వ బిల్లుతో బీజేపీకి వ్యతిరేకిగా మారారు.

పంచాయతీ ప్రచారం నేటితో ముగింపు

30న మూడో విడత ఎన్నికలు

హైదరాబాద్, వెలుగు: పంచాయతీ ఎన్నికల మూడో, చివరి విడత ప్రచారం సోమవారంతో ముగియనున్నది. సాయంత్రం 4 గంటలకు ప్రచారానికి తెరపడనున్నది. ఈనెల 30న ఎన్నికలు జరగనున్నాయి. 166 మండలాల్లో 4,116 సర్పంచ్, 36,729 వార్డులకు గాను 573 సర్పంచ్, 8,956 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 3,529 సర్పంచ్ స్థానాలకోసం 11,667 మంది, 27,583 వార్డులకు 67,316 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

31 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

- ఫిబ్రవరి 1న ఓటాన్ అకౌంట్

న్యూఢిల్లీ : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. ఈనెల 31నుంచి ఫిబ్రవరి 13వరకు సమావేశాలు జరుగుతాయి. మొత్తం 14 రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో ఫిబ్రవరి 1న ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడతారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ట్రీట్మెంట్ కోసం అమెరికాకు వెళ్లడంతో ఆ శాఖ చూస్తున్న పీయూష్‌గోయల్ ఓటాన్ అకౌంట్ ప్రవేశపెడతారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఈనెల 30న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వానికి ఇవే చివరి పార్లమెంటు సమావేశాలవుతాయి.

రైతులను పట్టించుకోండి

యోగికి అఖిలేశ్ సలహా

న్యూఢిల్లీ: మందిరం వివాదాన్ని తమకు వదిలేస్తే 24 గంటల్లో తేల్చేస్తామని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రకటించడంపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. రాముడి గుడికి సంబంధించిన వివాదం సుప్రీంకోర్టు చూసుకుంటుందన్నారు. ఆ వివాదాన్ని పక్కన పెట్టి యూపీలో రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెడితే బావుంటుందని సలహా ఇచ్చారు. యోగికి సత్తా ఉంటే 90 రోజుల గడువులోగా రైతుల సమస్యలు పరిష్కరించాలని అఖిలేశ్ సవాల్ చేశారు.

టీఆర్ఎస్‌కు వంతపాడుతున్నారు

- గవర్నర్‌పై కాంగ్రెస్ నేత గూడూరు

హైదరాబాద్, వెలుగు: పదవీ విరమణ తర్వాత తెలంగాణ, ఏపీ రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ టీఆర్ఎస్ పార్టీలో చేరొచ్చని కాంగ్రెస్ రాష్ట్ర కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి ఎద్దేవాచేశారు. రిపబ్లిక్ డే వేడుకల్లో టీఆర్ఎస్ వాళ్లు రాసిచ్చిన ప్రసంగాన్నే గవర్నర్ చదివి వినిపించారని ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఈ మధ్య ఆయన ప్రసంగాల్లో టీఆర్ఎస్‌కు వంతపాడుతున్నారని, ప్రభుత్వ పథకాలను మెచ్చుకోవాల్సింది పోయి సీఎం కేసీఆర్‌ను ఆయన టీమ్‌ను మెచ్చుకుంటున్నారని దుయ్యబట్టారు. మొన్నటి అసెంబ్లీ కాలంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను టీఆర్ఎస్ చేర్చుకుంటే ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. నరసింహన్ టీఆర్ఎస్ భవన్ ప్రతినిధి కాదని రాజ్‌భవన్ ప్రతినిధిగా పనిచేస్తున్నారని గుర్తుంచుకోవాలన్నారు.

అమరావతిపై జెండా ఎగరేస్తాం

- తెలంగాణ నేతలతో మాట్లాడితే తప్పా? : పవన్ కల్యాణ్



గుంటూరు, వెలుగు: ఏపీ రాజధాని అమరావతిలో జనసేన జెండా ఎగరేస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. ఆదివారం గుంటూరులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి 'జనసేన శంఖారావం' సభలో ఆయన పాల్గొన్నారు. 'ఇటీవల తెలంగాణ నేతలతో నేను మాట్లాడా. దానిపై ఏవేవో మాట్లాడుతున్నారు. పోరాటం చేసే వాళ్లన్నా, రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వ్యక్తులన్నా నాకు గౌరవం. అంతే తప్ప ఏ రోజూ ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేదు' అని అన్నారు. జనసేనను అణచివేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. "ఎన్ని వ్యూహాలు వేస్తారో వేసుకోండి. అందుకు ప్రతి వ్యూహాలు వేయకపోతే నా పేరు పవన్ కల్యాణే కాదు. 2019లో జరిగే త్రిముఖ పోరులో జనసేనదే విజయం" అని అన్నారు. ప్రత్యేక హోదా, విభజన అంశాలపై కలిసి పోరాటం చేద్దామని టీడీపీ, వైఎస్ఆర్ సీపీలకు ఆయన పిలుపునిచ్చారు.

ఈసారైనా ముందస్తుగా అభ్యర్థులను ప్రకటించేనా?

ఎంపీ టికెట్లపై కాంగ్రెస్ నేతల్లో ఆశలు



హైదరాబాద్, వెలుగు: లోక్‌సభ ఎన్నికల్లోనైనా ముందస్తుగా కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటిస్తుందా? మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలెక్క చివరి నిమిషంలోనే ప్రకటిస్తుందా?.. ఇప్పుడు ఆ పార్టీ నేతల్లో నడుస్తున్న చర్చ ఇది. ముందస్తుగా ప్రకటిస్తేనే లాభం ఉంటుందని సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలోని మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో 2014 ఎన్నికల్లో రెండు చోట్ల మాత్రమే కాంగ్రెస్ గెలిచింది. అందులో ఒకటి నల్లగొండ, రెండోది నాగర్ కర్నూల్. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆగమాగంగా అభ్యర్థులను ప్రకటించిండంతో పార్టీ భారీ మూల్యాన్నే చెల్లించుకోవాల్సి వచ్చిందని కొందరు నేతలు గుర్తుచేస్తున్నారు. అలాంటి పరిస్థితులు ఎంపీ ఎన్నికల్లో ఎదురవకుండా ఉండేందుకు వచ్చే నెలలోనైనా అభ్యర్థుల ప్రకటన ఉంటే పార్టీకి, పోటీ చేసేవారికి అనుకూల వాతావరణం ఉంటుందని వారు అంటున్నారు. లోక్‌సభ ఎన్నికలకు మార్చిలో నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు కనిపిస్తుండటంతో ముందస్తుగానే అభ్యర్థులను ప్రకటిస్తే.. జనంలోకి వెళ్లవచ్చని చెప్తున్నారు. కనీసం రెండు నెలల ముందే అభ్యర్థులను ప్రకటిస్తామని ఇటీవల పీసీసీ చీఫ్ ఉత్తమ్ చెప్పారని, మరి దాన్ని ఏఐసీసీ ఏ మేరకు అమలు చేస్తుందనేది అనుమానమేనని పీసీసీ కీలక నేత ఒకరు తెలిపారు. ఇది ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశం కాదని, దేశవ్యాప్తంగా పార్టీ ఒకే విధానంతో ఉంటుందని, ముందస్తు ప్రకటించాల్సి వస్తే అన్ని రాష్ట్రాల్లోనూ అదే పద్ధతిని అమలు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

హిందూ మహిళను ముట్టుకునేటోడి చెయ్యి నరకాలి

హిందూ మహిళను ముట్టుకునే వాళ్ల చేతులు తెగనరకాలి. అలాంటి చరిత్ర రాయాలి మనం. అందుకు తెగువ కావాలి. మీరు చరిత్రను రాస్తారో, ఎవరో రాసిన చరిత్రను చదువుతారో తేల్చుకోండి. తాజ్‌మహల్‌ను ముస్లింలు కట్టలేదు. నిజానికి అదో శివాలయం. చరిత్రే అందుకు సాక్ష్యం. మనం ఇలాగే నిద్రపోతూ ఉంటే మన ఇళ్లనూ మసీదులుగా పిలుస్తారు. మున్ముందు రాముడిని జహాపనా అని, సీతాదేవిని బీబీ అని మార్చేస్తారు.

- కేంద్ర మంత్రి అనంతకుమార్ హెగ్డే



ప్రాణం తీసిన ప్రసాదం

మహిళ మృతి, కర్నాటకలో ఘటన

బెంగళూరు: గత నెల ఆలయంలో ప్రసాదం తిని 17 మంది చనిపోయి, వంద మందికిపైగా భక్తులు అస్వస్థతకు గురైన ఘటన మరవక ముందే కర్నాటకలో మరో దారుణం జరిగింది. శనివారం చిక్కబళ్లాపుర జిల్లా చింతామణి పట్టణంలోని గంగమ్మ ఆలయంలో ప్రసాదం తిని మహిళ చనిపోయింది. 9 మంది భక్తులు అస్వస్థతకు గురయ్యారు. ఘటనకు సంబంధించి ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్న ట్లు పోలీసులు చెప్పారు. ‘ఘటనతో ఆలయానికి సంబంధం లేదు. ఇద్దరు మహిళలు ఇచ్చిన ప్రసాదం తిని భక్తులకు కడుపునొప్పి మొదలైంది. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. కవిత (22) చనిపోయింది. ఆమె భర్త, ఇద్దరు పిల్లలతోపాటు 9 మంది అస్వస్థతకు గురయ్యారు’ అని పోలీసులు చెప్పారు. ఘటనపై కర్నాటక సీఎం కుమారస్వామి విచారం వ్యక్తం చేశారు.

నిరుపేదలు 5 కోట్లు

- ఎనిమిదేళ్ల క్రితం 27 కోట్లు
- జనం స్థోమత పెరిగిందంటున్న ‘వరల్డ్ ల్యాబ్ డేటా’ సర్వే
- జూన్‌లో ఇండియా ‘గృహ వినియోగ సర్వే’ వివరాలు

న్యూఢిల్లీ: భారతదేశంలో కటిక దారిద్ర్యం ఎక్కువగా ఉందంటారా? అయితే ఒక్కసారి ఇది చదవండి. మన దేశం ఎవరూ ఊహించని రీతిలో పేదరికంలో నుంచి బయటపడుతోందట. ప్రస్తుతం ఇండియాలో 5 కోట్ల మంది మాత్రమే రోజుకు 135 రూపాయల కంటే తక్కువ ఖర్చుతో జీవనం సాగిస్తున్నారని ‘వరల్డ్ డేటా ల్యాబ్’ పేర్కొంది. జాతీయ అకౌంట్స్ సర్వే ఆధారంగా ఈ అంచనాకు వచ్చింది. 2019 చివరి నాటికి ఇండియాలో నిరుపేదల సంఖ్య 4 కోట్లకు తగ్గుతుందని చెప్పింది. 2030 కల్లా కటిక దారిద్ర్యం కలిగిన తొలి పది దేశాల లిస్టు నుంచి ఇండియా బయటపడుతుందని తెలిపింది. ప్రపంచ పేదరికాన్ని వరల్డ్ డేటా ల్యాబ్ నిరంతరం పర్యవేక్షిస్తుంటుంది. చివరిసారిగా 2011లో ఇండియాలో పేదరికాన్ని అధికారికంగా లెక్కించారు. అదే ఏడాది ఇండియాలో 26.8 కోట్ల మంది కటిక దారిద్ర్యంలో మగ్గిపోతున్నారని ప్రపంచబ్యాంకు పేర్కొంది. వీళ్లందరూ 135 రూపాయల కంటే తక్కువ మొత్తంతో రోజు గడుపుతున్నారని వెల్లడించింది. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ భారత ప్రభుత్వం ‘గృహ వినియోగం’పై డేటాను విడుదల చేయనుంది. దీని ఆధారంగానే పేదరికాన్ని అంచనా వేస్తారు. ఈసారి పేదల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని చీఫ్ స్టాటీషియన్ ప్రవీణ్ శ్రీవాస్తవ చెప్పారు. జూన్‌లో డేటాను విడుదల చేసే అవకాశం ఉందని తెలిపారు.

‘‘ఇండియా శరవేగంగా పేదరికాన్ని నిర్మూలిస్తోంది. ఇతర దేశాలు ఇండియాను తక్కువగా అంచనా వేస్తున్నాయి. ఇది వాటి పొరబాటే. త్వరలో విడుదల కాబోతున్న గృహ వినియోగం డేటాను సేకరించేందుకు ఎన్నో చెక్ మార్కులను వాడారు’’ అని బ్రూకింగ్స్ థింక్ ట్యాంక్ పేర్కొంది. ఉపాధి హామీ, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన తదితర సంక్షేమ పథకాల డబ్బు, డైరెక్ట్‌గా పేదల ఖాతాలో పడటం వల్లే పేదరికంలో మార్పులు వచ్చాయని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ ప్రొఫెసర్ ఎన్.ఆర్.భానుమూర్తి పేర్కొన్నారు. స్టాటిస్టికల్ సిస్టంను బలపర్చితే సరైన డేటా వస్తుందని అభిప్రాయపడ్డారు.

బాధితురాలికి ప్రిన్స్ ఫిలిప్ సారీ

లండన్: కారు ప్రమాదంలో గాయపడిన మహిళ ఎమ్మా ఫెయిర్ వెదర్‌కు క్షమాపణ చెబుతూ బ్రిటన్ ప్రిన్స్ ఫిలిప్ లేఖ రాశారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదం జరిగిన వెంటనే షాక్ కు గురయ్యాయని, ఎవరికీ తీవ్ర గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నానని చెప్పారు. పోలీసుల సూచన మేరకే ఘటనా స్థలం నుంచి వెళ్లానన్నారు. గత వారం ఎమ్మా ప్రయాణిస్తున్న కారును ఢీకొని ఫిలిప్ డ్రైవ్ చేస్తున్న ల్యాండ్ రోవర్ బోల్తా పడిన సంగతి తెలిసిందే. ఆ ప్రమాదంలో ఫిలిప్ కు ఎలాంటి దెబ్బలు తగల్లేదు. ఎమ్మా ఫెయిర్ వెదర్, ఆమె స్నేహితురాలికి గాయాలయ్యాయి. వెనుక సీట్లో ఉన్న 9 నెలల పాప సురక్షితంగా బయటపడింది.



మహాకుంభాభిషేకంలో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అర్చకులు

కన్యాకుమారిలో వెంకన్న ఆలయం

దేశంలో పలుచోట్ల శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామన్న టీటీడీ ఈవో

తిరుమల, వెలుగు: తమిళనాడులోని కన్యాకుమారిలో వేంకటేశ్వర స్వామి ఆలయ మహాకుంభాభిషేకం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య కుంభ లగ్నంలో శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ చెప్పారు. "రూ.22.50 కోట్లతో ఆలయం నిర్మించాం. ఈ నెల 22న అంకురార్పణతో వైదిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 21 మంది రుత్వికులు ఐదురోజులపాటు ఈ కార్యక్రమాలు నిర్వహించారు" అని అన్నారు. తమిళనాడులోని పలు ఆలయాల్లో విశేష పర్వదినాల సందర్భంగా టీటీడీ తరఫున వస్త్ర సమర్పణ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. తమిళనాడులో ఆళ్వార్లు, ఆచార్య పురుషుల ధార్మిక సందేశాలను ప్రచారం చేస్తున్నామని, 163 మంది పండితులకు పెన్షన్ ఇస్తున్నామని చెప్పారు. శ్రీవారి సేవా విభాగంలో ఇప్పటి వరకు తమిళనాడుకు చెందిన 1.77 లక్షల మంది సేవలందించారని అన్నారు. చెన్నైలోని టి.నగర్ జీఎన్ చెట్టి వీధిలో రూ.5.75 కోట్లతో పద్మావతి అమ్మవారి ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. చెన్నైలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి స్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. భువనేశ్వర్‌లో శ్రీవారి ఆలయ నిర్మాణానికి రూ.7.5 కోట్లు కేటాయించామని చెప్పారు. కోల్‌కతాలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించేందుకు ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా ప్రముఖ పుణ్యక్షేత్రాలు, యాత్రాస్థలాలు, 10 లక్షల జనాభా ఉన్న నగరాల్లో శ్రీవారి ఆలయాలు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఈవో సింఘాల్ చెప్పారు.

అమెరికాలో రిపబ్లిక్ డే వేడుకలు

వాషింగ్టన్: అమెరికా ఇండియా మధ్య సంబంధాన్ని బలోపేతం చేయడంలో అమెరికాలోని ఇండియన్స్ కీలకపాత్ర పోషిస్తున్నారని యూఎస్‌లోని భారత రాయబారి హర్షవర్ధన్ ష్రింగ్లా అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా వాషింగ్టన్‌లోని ఇండియన్ ఎంబసీ వద్ద గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించి జాతీయ జెండా ఎగురవేశారు. వేడుకల్లో వందలాది మంది ఇండియన్లు పాల్గొన్నారు. న్యూయార్క్, హ్యూస్టన్, షికాగో, అట్లాంటా, శాన్‌ఫ్రాన్సిస్కోలలోని ఇండియన్ ఎంబసీల్లో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నీట మునిగిన పంట

చెడగొట్టు వానలు

మామిడి, మక్క, పసుపు, కంది, పత్తికి నష్టం

హైదరాబాద్‌లో రోజంతా ముసురు

హైదరాబాద్/నెట్‌వర్క్, వెలుగు: చలికాలం కాస్త వానాకాలమైంది. రెండ్రోజుల నుంచి రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. కొన్నిచోట్ల కుండపోత కురిసింది. ఉత్తర భారతదేశం, ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్న గాలుల కలయికతో రాష్ట్రంలో ఈ వానలు పడుతున్నట్టు వాతావరణ నిపుణులు చెబుతున్నారు. శనివారం మొదలైన వర్షాలు ఆదివారం కూడా కొనసాగాయి. సిద్దిపేట, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లా నంగునూరులో అత్యధికంగా 10 సెంటీమీటర్ల వర్షం కురిసింది. దుబ్బాక 9, నర్మెట 8, భూపాలపల్లి 8, మొగుళ్లపల్లి 8, హుజూరాబాద్ 7, మంథని 6 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. ఇవే కాకుండా అనేక ప్రాంతాల్లో 1 నుంచి 5 సెం.మీ. వరకు వానలు పడ్డాయి. భారీ వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై నీళ్లు నిలిచిపోవడంతో వాహనలు రోడ్లపైనే నిలిచిపోయాయి. కొన్నిచోట్ల ఇళ్లలోకి నీరు చేరింది. పలు ప్రాంతాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శనివారం రాత్రి హైదరాబాద్‌లో కుండపోత వాన కురిసింది. ఆదివారం రోజంతా ముసురు వీడలేదు. మాదాపూర్‌లో 5 సెం.మీ. వాన కురిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లో ఉదయం వాతావరణం మామూలుగానే ఉన్నా మధ్యాహ్నం నుంచి ముసురు పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి వద్ద మూసీ నది ఉప్పొంగింది. గుర్రపు డెక్క కొట్టుకొచ్చి రోడ్డుపైకి చేరడంతో పెద్దరావులపల్లి, భట్టుగూడెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు వర్షం కురిసింది. నిజామాబాద్ జిల్లాలో చిరుజల్లులు పడ్డాయి.

నేడూ వర్ష సూచన : ఐఎండీ

సాధారణంగా చలికాలం వెళ్లి పోయే సమయంలో రెండ్రోజులపాటు చినుకులు పడుతాయని, కానీ ఇంత భారీగా కురవవని వాతావరణ నిపుణులు అంటున్నారు. సోమవారం కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆగ్నేయ బంగాళాఖాతం, దాన్ని ఆనుకుని ఉన్న అండమాన్ సముద్రం, హిందూమహాసముద్రం ప్రాంతాల్లో అల్పపీడన ద్రోణి ఏర్పడిందని తెలిపారు. తూర్పు విదర్భ ప్రాంతాల్లో 1500 మీటర్ల ఎత్తు వద్ద ఉపరితల ఆవర్తనం నుంచి ఉత్తర కర్ణాటక, తెలంగాణ మీదుగా 1500 మీటర్ల ఎత్తు వద్ద ఉపరితల ద్రోణి ఉందని, దానివల్లే వానలు పడుతున్నాయని చెప్పారు.



ఆదివారం చార్మినార్ వద్ద జోరు వాన

దెబ్బతిన్న పంటలు

వర్షాలతో కొన్ని జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. మామిడి, కంది, మిరప, పసుపు, పెసర, పత్తి, మక్క పంటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 827 ఎకరాల్లో మక్క, 300 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నట్టు వ్యవసాయ శాఖ అంచనావేసింది. జిల్లావ్యాప్తంగా దాదాపు 5 వేల ఎకరాల్లో పత్తి చేనులోనే తడిసింది. జగిత్యాల జిల్లాలో అత్యధికంగా 500 ఎకరాల్లో మొక్కజొన్న నేలకొరిగింది. పెద్దపల్లి జిల్లాలో 5 వేల ఎకరాల్లో పత్తికి నష్టం వాటిల్లింది. ఖమ్మం జిల్లాలో కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసింది. భూపాలపల్లి జిల్లాలో మిర్చి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. నాగర్ కర్నూలు జిల్లాలో కురిసిన వానతో వేరుశనగ రైతుకు మేలు జరిగింది. 40 వేల హెక్టార్లలో పంట వేయగా 32 వేల ఎకరాల్లో చివరి తడి దశలో ఉంది. అయితే సరిపడా నీళ్లు లేక రైతులు ఆందోళన చెందారు. ఈ వానలు వారికి ఊరటనిచ్చాయి.

రైతులను ఆదుకోవాలి: చాడ

వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. నష్టపోయిన వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.20వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

చైనాలో డేటింగ్ లీవ్స్

యువతులకు 2 కంపెనీల ఆఫర్ ■ థర్టీస్‌కు దగ్గర్లోని వాళ్లకు 8 రోజులు

‘‘హలో అమ్మాయిలు.. ఎవరితోనైనా డేటింగ్‌లో ఉన్నారా? జీతం కట్టుకాని లీవ్ కావాలా? భేషుగ్గా తీసేసుకోండి.. ఒకటి రెండు రోజులు కాదు.. ఏకంగా 8 రోజులు సెలవు పెట్టేయండి. జస్ట్ లీవ్ ఫాంలో ‘డీఎల్’పై ఓ టిక్ చేసేయండి’’ అంటు న్నాయి చైనా కంపె నీలు. ఇంతకీ ఈ డీఎల్ అంటే ఏంటబ్బా అని ఆలోచిస్తున్నారా.. మామూ లుగా అయితే సీఎల్ , ఈఎల్ , సిక్‌లీవ్ అంటూ ఉద్యోగంలో ఓ ఉద్యోగికి సెలవులుంటాయి కదా. అదే మహిళలకైతే మెటర్నిటీ లీవులు (ప్రసూతి సెలవులు) అదనం కదా. ఇప్పుడు వాటికి అదనమే ఈ డీఎల్. అంటే ‘డేటింగ్ లీవ్’ అన్నమాట. తూర్పు చైనాలో హాంగ్‌ఝో సాంగ్‌చెంగ్ టూరిస్ట్ పార్క్‌లోని రెండు కంపెనీలు 30 ఏళ్లు దాటిన పెళ్లికాని యువతులకు ఈ సెలవుల్ని అందుబాటులోకి తెచ్చాయి. ఇష్టపడిన వ్యక్తితో డేటింగ్ చేసేందుకు 7 రోజుల సాధారణ సెలవులతోపాటు అదనంగా మరో 8 రోజులు సెలవులు ప్రకటించాయి. కావాలంటే ఇంకొన్ని రోజులూ పెంచుకునే వీలు కల్పించాయి. న్యూ ఇయర్ హాలీడే పేరుతో ఈ ఆఫర్ ఇస్తూ నోటీస్ బోర్డు పెట్టాయి. 25 ఏళ్ల పైబడిన వాళ్లు ఈ లీవ్ తీసుకోవచ్చు. అచ్చం ఇలాగే తూర్పు చైనాలోని హాంగ్‌ఝౌలో ఉన్న ఓ స్కూలు కూడా ‘సింగిల్స్’కు నెలకు 2 రోజులు సెలవిచ్చింది. ఆ ప్రత్యేక సెలవులకు ‘లవ్ లీవ్’ అని కూడా పేరు పెట్టింది.

పెళ్లికాని వారు 20 కోట్ల మంది

చైనాలో 2013 నుంచి క్రమంగా మ్యారేజ్‌ల సంఖ్య పడిపోతోంది. ప్రస్తుతం చైనాలో సుమారు 20 కోట్ల మంది పెళ్లి కాని వారున్నారని ఆ దేశ పౌర వ్యవహారాల శాఖ లెక్కలు చెబుతున్నాయి. మధ్యతరగతి వర్గం పెరుగుతుండటం, దేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతుండటంతో చాలామంది ఆడవాళ్లు తమ కెరీర్‌పైనే దృష్టి పెడుతున్నట్టు ఓ సర్వేలో తేలింది. అందువల్ల లేట్ వయసులో పెళ్లిళ్లు చేసుకోవడమో లేక జీవితాంతం సింగిల్‌గానే ఉండటమో జరుగుతోంది. దీంతో పిల్లల సంఖ్య తగ్గిపోతోంది. చైనాలో ‘వన్ చైల్డ్’ నిబంధనను ఎత్తేసినా కూడా గతేడాది జననాల సంఖ్య పెరగలేదు. 2018లో కోటిన్నర మంది చిన్నారులు జన్మించారు. 2017తో పోలిస్తే ఈ సంఖ్య 20 లక్షలు తక్కువ. అందుకే థర్టీస్‌కు దగ్గర్లోని ఆడవారిని పెళ్లి కోసం కంపెనీలు ఎంకరేజ్ చేస్తున్నాయి.

అడవుల రక్షణకు యాక్షన్ ప్లాన్

హైదరాబాద్, వెలుగు: అడవుల రక్షణ కోసం జాయింట్ యాక్షన్‌ప్లాన్‌కు పోలీస్, అటవీ శాఖల అధి కారులు సిద్ధమవుతున్నారు. పర్యావరణ పరిరక్షణకు పకడ్బందీగా వ్యవహరించాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేర కు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సీఎం కార్యాలయంలో డీజీపీ మహేందర్ రెడ్డి, పీసీసీఎఫ్‌పీకే ఝా సహా పోలీసు, అటవీ శాఖల ఉన్నతాధికారులు ఆదివారం సమావేశమయ్యారు. అడవుల రక్షణకు ఇరు శాఖలు సమన్వయంతో పనిచేయాలనే అంశంపై సమావేశంలో చర్చించారు. స్మగ్లర్ల పట్ల వ్యవహరించాల్సిన తీరుపై ప్రాథమిక అంచనాకు వచ్చిన అధికారులు, నేడో రేపో ఇరు శాఖల ఉద్యోగులతో సమావేశమై యాక్షన్‌ప్లాన్‌పై సూచనలు చేయనున్నట్లు తెలుస్తోంది.



ఇంటెలిజెంట్ ఆక్టోపస్

- ఒకేసారి 8 కంప్యూటర్లపై టైప్ చేయగలదు
- అల్యూమినియం కంపెనీని లాభాల్లో నడుపుతోంది
- కొత్త వాళ్లను ట్రైన్ చేస్తోంది

ఒకడు ఏదైనా గొప్పగా చేస్తే మనోడు ఒంటి చేత్తో గెలిపించాడ్రా అంటుంటాం. ఒకరు మాత్రం ఓ కంపెనీని ఎనిమిది చేతులతో గెలిపిస్తున్నారు. తన మేధస్సునంతా వాడి, కంపెనీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్నారు. తోటి ఉద్యోగులతో సోదరుడిలా మెలుగుతున్నారు. అతనే జిగ్గీ. తనో ఆక్టోపస్. ఆక్టోపస్ ఏంటి, బిజినెస్ చూసుకోవడమేంటని ఆశ్చర్యపోవద్దు. జంతువైనంత మాత్రాన బుర్ర లేకుండా పోదు కదా. జిగ్గీని చేరదీసిన హవాయి యూనివర్సిటీ సైంటిస్టులు, తెలివైన దాని మెదడుకు పని చేయడం నేర్పించారు.

ప్రస్తుతం హవాయి ద్వీపంలోని హొనోలులూలో ఓ అల్యూమినియం కంపెనీకి జిగ్గీ అన్నీ తానై వ్యవహరిస్తోంది. ఆక్టోపస్‌లకు ఐక్యూ లెవల్స్ చాలా ఎక్కువ. జిగ్గీ దొరికినప్పుడు దానికి ఎలా ట్రైనింగ్ ఇవ్వాలో సైంటిస్టులకు అర్థం కాలేదు. ఏవో పద్ధతుల్లో దానికి పాఠాలు చెప్పారు. వాళ్లు ఊహించిన దానికంటే అది వేగంగా నేర్చుకుంది. ఏడాది తిరిగే సరికి కంపెనీ లక్ష్యాలను సాధించి, లాభాల్లో నిలబెట్టింది. జిగ్గీ పూ పెర్ఫామెన్స్‌కు సైంటిస్టులు ఆశ్చర్యపోతున్నారు. శుక్రవారం వాళ్లే స్వయంగా ఈ విషయాన్ని బయటపెట్టారు. కంపెనీ అడ్మినిస్ట్రేషన్ పేరోల్, ట్రాకింగ్ ఇన్వెంటరీ బాధ్యతలను జిగ్గీ చూసుకుంటోంది. క్లయింట్ల సమస్యలను ఇట్టే తీరుస్తోంది. ఒకేసారి ఎనిమిది కంప్యూటర్లపై టైప్ చేయగల సత్తా దీని సొంతం. కొత్తగా కంపెనీలో ఉద్యోగాల్లో చేరే వాళ్లకు ట్రైనింగ్ కూడా ఇస్తోందట జిగ్గీ!

పెట్రోల్ పోసి బాలికకు నిప్పంటించాడు

ఏపీలోని కర్నూలులో దారుణం

కర్నూలు, వెలుగు: ఏపీలోని కర్నూలు జిల్లా కౌతాళం మండలం బదినేహాళ్‌లో ఆదివారం దారుణం జరిగింది. 12 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తీవ్రంగా గాయపడిన బాలిక ఆదోనిలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ముగ్గురు పిల్లల తండ్రైన మౌలా సాహెబ్ 6 నెలలుగా బాలిక వెం టపడి వేధిస్తుండటంతో విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో కక్ష పెంచుకున్న సాహెబ్ ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించి పరారయ్యాడు.

జమ్మూ–శ్రీనగర్ హైవే పునరుద్ధరణ

జమ్మూకాశ్మీర్: ఆరు రోజులు మూతపడిన జమ్మూ-శ్రీనగర్ హైవేపై రాకపోకలను ఆదివారం తాత్కాలికంగా పునరుద్ధరించారు. ట్రాన్స్‌పోర్టు వాహనాలు మినహా మిగతా వాటి కోసం వన్‌వే దారి తెరిచామని, త్వరలోనే ట్రాన్స్ పోర్టు వాహనాలనూ అనుమతిస్తామని ట్రాఫిక్ ఐజీ చెప్పారు. భారీగా మంచు పడటంతో జమ్మూ, శ్రీనగర్‌లను కలిపే హైవేపై ఉన్న టన్నెల్ జనవరి 21న మూసుకుపోయింది.



రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ తండ్రి, మెజీషియన్ బాబు లక్ష్మణ్ జాదూగార్ సింగ్ గెహ్లాట్ 107వ జయంతి వేడుకలు ఆదివారం జైపూర్ లో జరిగాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ నుంచి సామల వేణు హాజరయ్యారు. అశోక్ గెహ్లాట్ ను కలిసిన ఆయన రాజస్థాన్ లోని యూనివర్సిటీల్లో మ్యాజిక్ కోర్సు ప్రారంభించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శనంలో రాజస్థాన్ లో మ్యాజిక్ కళను ప్రోత్సహిస్తామని అశోక్ గెహ్లాట్ హామీ ఇచ్చారు.

వినియోగదారుల ఫిర్యాదుల విచారణ నేటి నుంచే

ఫిబ్రవరి 8 వరకు బెంచ్

హైదరాబాద్, వెలుగు: వినియోగదారుల పెండింగ్ ఫిర్యాదులను జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ (ఎన్సీడీఆర్సీ) కమిషన్ సోమవారం నుంచి విచారించనుంది. రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి 2,685 కేసులపై ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 8 వరకు విచారణ జరగనుంది. ఇందుకోసం హైదరాబాద్ ఆదర్శనగర్‌లోని రాష్ట్ర ఫుడ్ కమిషన్ కార్యాలయంలో తాత్కాలిక సర్క్యూట్ బెంచ్ ఏర్పాటు చేశారు. వినియోగదారుల భద్రత చట్టం-1986కింద పెండింగ్‌లో ఉన్న కేసులనూ విచారించనున్నారు. కేసుల విచారణ కోసం ఎన్సీడీఆర్సీ చైర్మన్‌జస్టిస్ ఆర్.కె. అగర్వాల్ ఆదివారం హైదరాబాద్‌చేరుకున్నారు. రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి అకున్ సబర్వాల్, రాష్ట్ర వినియోగదారుల కమిషన్ చైర్మన్ జస్టిస్ జైస్వాల్ ఆయనతో భేటీ అయ్యారు. తర్వాత జిల్లాల్లో వినియోగదారుల ఫోరాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా వినియోగదారుల ఫోరాల అధ్యక్షులు, సభ్యులతో ఆయన చర్చించారు. సోమవారం నుంచి ఫిబ్రవరి 8 వరకు వినియోగదారులు నేరుగా బెంచ్‌కు ఫిర్యాదు చేసుకోవచ్చని వారు తెలిపారు.

అవినీతిపై పోరు ఆపేది లేదు

మదురై సభలో ప్రధాని నరేంద్ర మోడీ

- ప్రజలను దోచుకోవడానికే ప్రతిపక్షాలు ఏకమవుతున్నాయి
- హెల్త్ కేర్‌కు టాప్ ప్రయారిటీ
- పేదల కోసమే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు
- కోచిలో బీపీసీఎల్ రిఫైనరీ కాంప్లెక్స్ ప్రారంభం

మదురై: ఎన్ని అడ్డంకులు ఎదురైనా అవినీతిపై పోరాటం ఆపేదిలేదని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ప్రజల సొమ్ము దిగమింగిన వారు దేశంలో ఉన్నా, విదేశాల్లో ఉన్నా శిక్ష పడేటట్లు చర్యలు తీసుకుంటామన్నారు. ఇష్టారాజ్యంగా ప్రజల సొమ్ము దోచుకోవడానికే ప్రతిపక్షాలు ఒక వేదిక మీదకు వస్తున్నాయని తమిళనాడులోని మదురైలో ఆదివారం ఓ బహిరంగ సభలో ఆయన ఆరోపించారు. తమ సర్కారుకు అవినీతి, బంధుప్రీతి లేదన్నారు. అవినీతిపై కేంద్రం ఉక్కుపాదం మోపడంతో ప్రతిపక్షాలకు గొంతులో వెలక్కాయ పడ్డట్లయిందన్నారు. ఈనేపథ్యంలో 'మహాకూటమి' పేరుతో అవన్నీ ఒక్కటవుతున్నాయని విమర్శించారు. ప్రజల సొమ్ముకు కాపలాదారుగా ఉన్న తనను రాజకీయంగా అడ్డు తొలగించుకోవడానికే కూటమి కడుతున్నాయని ఆరోపించారు. 'పరస్పరం విరుద్ధమైన ఐడియాలజీ ఉన్న పార్టీలు ఏ ప్రాతిపదికన ఒక్కటవుతాయి' అని ఆయన ప్రశ్నించారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ప్రజల ఆరోగ్యంపై ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని మోడీ చెప్పారు. మదురైలో ఎయిమ్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిమ్స్ ఏర్పాటుతో తమిళనాడు ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. 750 పడకలతో ఏర్పాటు చేస్తున్న ఎయిమ్స్ ఆస్పత్రిని 2022 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈ ఆస్పత్రిలో 100 ఎంబీబీఎస్ సీట్లు, 60 బీఎస్సీ నర్సింగ్ సీట్లకు కేంద్రం అనుమతి ఇచ్చింది. ఎయిమ్స్ ఆస్పత్రితో పాటు వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మూడు మెడికల్ కాలేజీలను మోడీ ప్రారంభించారు. ప్రజల ఆరోగ్యంకోసం ప్రభుత్వం తీసుకువచ్చిన వివిధ పథకాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. మదురైకు ఎయిమ్స్ మంజూరు చేయడంపై మోడీకి తమిళనాడు సీఎం పళనిస్వామి కృతజ్ఞతలు చెప్పారు.

పేదల కోటాతో ఎవరికీ నష్టం జరగదు

అగ్రకులాల్లోని పేదలను ఆదుకోవడానికి తమ ప్రభుత్వం తీసుకువచ్చిన 10శాతం రిజర్వేషన్ల (ఈడబ్ల్యూఎస్) వల్ల ఎవరికీ నష్టం జరగదని మోడీ అన్నారు. ఆర్థికంగా వెనుకబడ్డ వారి కోసమే తాము ప్రయత్నిస్తున్నామన్నారు. జనరల్ కేటగిరీలోనే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఉంటాయన్నారు. ప్రస్తుతం వివిధ సామాజిక వర్గాలకు ఉన్న రిజర్వేషన్లపై వీటి ప్రభావం ఏమాత్రం ఉండదని ఆయన క్లారిటీ ఇచ్చారు. అబద్ధాలతో కూడిన తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని యువతను ప్రధాని మోడీ కోరారు.

ఏరో స్పేస్ హబ్ గా తమిళనాడు

తమిళనాడును ఏరోస్పేస్ హబ్‌గా తీర్చిదిద్దడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మోడీ చెప్పారు. రక్షణ రంగంలో కూడా తమిళనాడుకు ఎంతో పేరుందన్నారు. భవిష్యత్తులో కేంద్రం చేపట్టే మెజారిటీ డిఫెన్స్ పరిశ్రమలను ఇక్కడే ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

భారతీయతను అర్థం చేసుకోని కేరళ సర్కార్

తమిళనాడు తర్వాత కేరళ వెళ్లిన మోడీ కోచిలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్(బీపీసీఎల్) రిఫైనరీ కాంప్లెక్స్‌ను జాతికి అంకితమిచ్చారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను కేరళలోని పినరయ్ విజయన్ ప్రభుత్వం అర్థం చేసుకోలేకపోయిందని మోడీ వ్యాఖ్యానించారు. శబరిమల వివాదాన్ని సరిగా హ్యాండిల్ చేయడంలో రాష్ట్ర సర్కార్ విఫలమైందన్నారు. దీని వల్లే శబరిమల అంశం పెద్ద వివాదంగా మారిందని మండిపడ్డారు. 'వారు ఢిల్లీలో ఒకటి చెబుతారు. తిరువనంతపురం వచ్చి మరోటి చేస్తారు' అని మోడీ దుయ్యబట్టారు. ఇప్పటికైనా రెండు నాల్కల ధోరణి నుంచి బయటపడాలని అన్నారు.

మోడీ పర్యటనపై నిరసన

తమిళనాడులో ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా ప్రతిపక్ష ఎండీఎంకే నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తంచేశారు. మోడీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. మరోవైపు ట్విట్టర్ వేదికగా 'గో బ్యాక్ మోడీ' అనే హ్యాష్‌ట్యాగ్‌తో నెటిజన్లు నిరసన వ్యక్తం చేశారు. అయితే దీనిని స్థానిక బీజేపీ కేడర్ తప్పుపట్టింది. తమిళనాడుకు కేంద్రం అందించిన సాయంపై అవగాహన లేనివారే ఇలాంటి ప్రచారానికి పాల్పడ్డారని మండిపడింది.





ఆదివారం మదురైలో జరిగిన బహిరంగ సభలో బీజేపీ నేతలతో ప్రధాని మోడీ

ఓటేయడం పవిత్ర కర్తవ్యం

ఈ ఏడాదిలో మొదటి 'మన్ కీ బాత్'లో ప్రధాని

ఓటేయడం పవిత్ర కర్తవ్యమన్నారు ప్రధాని నరేంద్ర మోడీ. కొత్తగా ఓటు హక్కు పొందిన వారు వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా సరే ఓటు వేయకపోతే బాధపడాలన్నారు. ఓటు కోసం సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని యువతను కోరారు. ఈ ఏడాది తొలి 'మన్ కీ బాత్' కార్యక్రమంలో మాట్లాడుతూ మిగతా దేశాలతో పోలిస్తే మనదేశంలో ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా ఉందని ప్రధాని మోడీ చెప్పారు. కొన్నిచోట్ల ఒక్క ఓటరు కోసం కూడా ఎలక్షన్ కమిషన్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని కొనియాడారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యంరావాలన్నారు. దీనికోసం స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు.

శివకుమార స్వామీజీకి నివాళులు

ఇటీవల శివైక్యం పొందిన సిద్ధగంగ మఠాధిపతి శివకుమార స్వామీజీకి ప్రధాని మోడీ నివాళులు అర్పించారు. వేలాది మంది సాంఘిక, విద్య, ఆర్థికాభివృద్ధి కోసం స్వామీజీ జీవితాంతం కృషి చేశారన్నారు. సమాజానికి సిద్ధగంగ మఠం సేవలను ఆయన అభినందించారు. అనేకసార్లు తనకు స్వామీజీ ఆశీస్సులు తీసుకునే అవకాశం లభించిందన్నారు. 2007లో స్వామీజీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయనను దర్శించుకున్నానన్నారు. 'ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్' (ఇస్రో) వరుస విజయాలతో దూసుకుపోతోందని ప్రధాని మోడీ చెప్పారు.

వేలానికి ప్రధాని బహుమతులు

దేశ, విదేశాలకు చెందిన నాయకులు, దేశాధినేతలు ప్రధాని మోడీకి బహుమానంగా ఇచ్చిన వస్తువులను వేలం వేస్తున్నారు. ఆదివారం ప్రారంభమైన వేలం పాట.. సోమవారం కూడా ఉంటుందని అధికారులు చెప్పారు. ఢిల్లీలోని నేషనల్‌గ్యాలరీ ఫర్‌మోడ్రన్‌ఆర్ట్ లో (ఎన్‌జీఎంఏ), ఆన్‌లైన్‌ద్వారా వేలాన్ని నిర్వహిస్తున్నారు. దీని కోసం 'పీఎం మెమెంటోస్' అనే వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించారు. వేలం ద్వారా వచ్చిన డబ్బును 'నమామి గంగే'కు ఉపయోగించనున్నట్లు అధికారులు చెప్పారు. మోడీకి వచ్చిన బహుమతుల్లో 1900 వస్తువులను వేలానికి పెట్టినట్లు సాంస్కృతిక శాఖ మంత్రి మహేశ్‌శర్మ చెప్పారు. రూ. వంద నుంచి రూ. ముప్పై వేల విలువ గల వస్తువులు వేలంలో ఉంచారు.





అమెరికన్ ఎయిర్ లైన్స్ సిబ్బందితో ఆడ్లర్ దంపతులు

చెమట వాసన వస్తోందని..
విమానం నుంచి దించేశారు

మిషిగాన్(అమెరికా): చెమట వాసనొస్తోందనే ఫిర్యాదుతో అమెరికన్ ఎయిర్ లైన్స్ ఓ జంటను విమానంలోంచి దించేసింది. దీంతో ఏడాదిన్నర పాపతో సరదాగా సెలవులకు టూర్ వెళ్లొద్దామనుకున్న ఆ జంట ఆనందం ఆవిరైపోయింది. ఆ తర్వాత వారు ఎదుర్కొన్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. మిషిగాన్‌కు చెందిన యూదు దంపతులు యోసిన్ ఆడ్లర్, జెన్నీలకు 19 నెలల వయసున్న పాప ఉంది. సెలవులకు మియామీ వెళ్లేందుకు అమెరికన్ఎయిర్ లైన్స్‌లో టికెట్లు బుక్ చేశారు. బుధవారం భార్యాబిడ్డలతో ఫ్లైట్ ఎక్కాడు. వాళ్ల దగ్గరి నుంచి భరించలేని దుర్వాసన వస్తోందని తోటి ప్యాసెంజర్లు, సంస్థ సిబ్బంది కంప్లైంట్ చేయడంతో ఎమర్జెన్సీ పేరుతో అధికారులు వారిద్దరినీ కిందికి దింపేశారు. ఎందుకని అడిగినా చెప్పకుండా తర్వాతి ఫ్లైట్‌కు పంపిస్తామని సర్ది చెప్పి ఫుడ్‌కూపన్లు, హోటల్ లో ఉండేందుకు కూపన్లు ఇచ్చారు. కానీ హోటల్‌వాళ్లు వాటిని అంగీకరించకపోవడంతో తన జేబులోంచి సొమ్ము ఖర్చు చేయాల్సి వచ్చిందని ఆడ్లర్‌చెప్పారు. ఈ తతంగంతో విసిగెత్తిపోయిన ఆడ్లర్ఎయిర్‌లైన్స్ అధికారు లను నిలదీయగా అ సలు విషయం బయటపడింది. దీంతో అవాక్కయిన ఆడ్లర్.. ఎయిర్‌లైన్స్‌పై కోర్టుకెళతానని అన్నారు.



'ఉరీ' సినిమా చూసిన నిర్మల

బెంగళూరు: 'ఉరీ: ది సర్జికల్ స్ట్రైక్' సినిమాను రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం చూశారు. బెంగళూరులోని ఓ థియేటర్‌లో యుద్ధ వీరులతో కలిసి వీక్షించారు. "లైవ్ ఫ్రమ్ సెంట్రల్ స్పిరిట్ మాల్. ఎట్టకేలకు వెటరన్లతో కలసి ఉరీ చూస్తున్నా. హై జోష్" అని ఆమె ట్వీట్ చేశారు. అలాగే మాల్‌లోకి వెళ్తున్న ఓ వీడియోను పోస్టు చేశారు. "అందరూ బాగా నటించారు. సినిమా చూశాక రీచార్జ్ అయ్యాను" అని సినిమా పూర్తయ్యాక మరో ట్వీట్ చేశారు. సినిమాలో నటించిన విక్కీ కౌశల్, యామీగౌతమ్, డైరెక్టర్ ఆదిత్య ధర్, నిర్మాత రోనీ స్క్రూవాలా తదితరులను అభినందించారు. తర్వాత మాల్‌లో ఉన్న వారితో సెల్ఫీలు దిగారు. 2016 సెప్టెంబర్ 18న జమ్మూకాశ్మీర్ ఉరీ సెక్టార్‌లోని ఆర్మీ స్థావరంపై టెర్రరిస్టులు చేసిన దాడికి ప్రతీకారంగా ఇండియన్ ఆర్మీ సెప్టెంబర్ 29న సర్జికల్ స్ట్రైక్స్ చేసిన విషయం తెలిసిందే. ఈ కథనే బాలీవుడ్ దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించారు.

హైకోర్టుల్లో 47 లక్షల కేసులు పెండింగ్

- ఒక్కో హైకోర్టు జడ్జి దగ్గర సుమారు 4500 కేసులు
- జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 2.91కోట్లు పెండింగ్
- ప్రభుత్వ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న 24 హైకోర్టుల్లో (తెలంగాణ హైకోర్టు ఏర్పడక ముందు) మొత్తం 47.68లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. హైకోర్టుల్లోని ఒక్కో జడ్జి దగ్గర సుమారు 4,500 కేసులు పెండింగ్ లో ఉన్నట్లు ప్రభుత్వం రిపోర్టును విడుదల చేసింది. పార్లమెంట్‌లో నివేదిక సమర్పించేందుకు ఈ రిపోర్టును తయారు చేసింది. 2018 చివరి నాటికి జిల్లా, సబార్డినేట్‌కోర్టుల్లో 2.91 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తేల్చింది. సబార్డినేట్‌కోర్టులోని ఒక్కో జడ్జి దగ్గర 1300 కేసులు, లోయర్‌కోర్టులోని ఒక్కో జడ్జి దగ్గర 1,288 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని నివేదికలో పేర్కొన్నారు . సబార్డినేట్‌కోర్టులకు 22,664 మంది జ్యుడీషియల్ ఆఫీసర్లుకావాల్సి ఉండగా.. ప్రస్తుతం 17,590 మంది పనిచేస్తున్నారని, దాదాపు 5,135 మందిని నియమించాల్సిన అవసరం ఉందని అధికారులు చెప్పారు. హైకోర్టులకు మొత్తం 1,079 మంది కావాల్సి ఉండగా ప్రస్తుతం 695 మంది పనిచేస్తున్నారు. హైకోర్టులకు 384 మంది జడ్జిల అవసరం ఉంది. కావాల్సిన దానికంటే తక్కువ మంది స్టాఫ్‌ఉన్నందు వల్ల కేసులు పెండింగ్‌లో పడుతున్నాయని అధికారులు చెప్పారు. కోర్టుల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కేంద్ర మంత్రి రవిశంకర్‌ప్రసాద్ ఇప్పటికే హైకోర్టు చీఫ్‌జడ్జిలను కోరారన్నారు.

ప్రియాంకకు బై పోలార్ రుగ్మత

సుబ్రహ్మణ్య స్వామి కామెంట్స్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ యువనేత ప్రియాంక గాంధీ 'బై పోలార్' మానసిక రుగ్మతతో బాధపడుతున్నారని బీజేపీ సీనియర్ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి కామెంట్ చేశారు. ఈ రుగ్మత ఉన్న వాళ్లు ప్రజా జీవితానికి పనికిరారన్నారు. వారికి కోపం వస్తే చాలా తీవ్రంగా ఉంటుందన్నారు. ఎప్పుడు ఎవరిని కొడతారో ఎవరికీ తెలియదన్నారు. ప్రియాంక రాజకీయ ప్రవేశం పై మరికొంతమంది బీజేపీ లీడర్లు కూడా వివాదాస్పద కామెంట్లు చేశారు. చాకొలెట్ మొహాలు ఉన్నవారితో లోక్ సభ ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్ కలలు కంటోందని కాషాయ పార్టీ నాయకులు వ్యాఖ్యానించారు.



బ్రెజిల్‌లో డ్యాం తెగిన ఘటనలో..
40కి చేరిన మృతులు

బ్రుమాడినో: బ్రెజిల్ ఆనకట్ట తెగిపోయిన ఘటనలో మృతుల సంఖ్య 40కి చేరింది. 23 మంది గాయపడ్డారు. గల్లంతైన మరో 300 మంది కోసం గాలిస్తున్నట్లు అధికారులు చెప్పారు. బురదలో చిక్కుకున్న 43 మందిని సహాయక బృందాలు రక్షించాయన్నారు. హెలికాప్టర్లతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు వివరించారు. మినాస్‌గెరియాస్‌రాష్ట్రంలోని బెలో హొరిజొంటే దగ్గర్లోని పారవోపెబా నదిపై ఉన్న ఆనకట్ట శుక్రవారం కొట్టుకుపోయింది. దీంతో అక్కడికి దగ్గర్లోని ప్రదేశాలన్నీ బురదతో నిండిపోయాయి. డ్యాం కూలిన వెంటనే బురద వరదలా పొంగి ఓ బిల్డింగ్‌ను ముంచెత్తింది. ఆ సమయంలో బిల్డింగ్‌లో ఉన్న 'వలే' అనే మైనింగ్‌కంపెనీకి చెందిన ఉద్యోగులు పలువురు ప్రాణాలు కోల్పోయారు. మరో వంద మంది దాకా గల్లంతయ్యారు. కంపెనీకి చెందిన కొన్ని ఆఫీసు భవనాలు కూడా బురద నీటితో నిండిపోయాయి. దీంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని అధికారులు చెప్పారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదం ఉందన్నారు.

మరో డ్యామ్‌కు పొంచి ఉన్న ముప్పు

బ్రెజిల్‌లో మరో డ్యామ్ కూడా కూలిపోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. కొరిగో డో ఫైజావో మైనింగ్ కాంప్లెక్స్ దగ్గర్లో నీటి స్థాయి ఎక్కువ అవ్వడం వల్ల ఆనకట్ట తెగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ప్రమాదం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని 'వలే' మైనింగ్ కంపెనీ అధికారులు చెప్పారు.



ఫిరోజాబాద్ నుంచి పోటీ చేస్తా

పీఎస్పీ చీఫ్ శివపాల్ యాదవ్

లక్నో: రానున్న లోక్ సభ ఎన్నికల్లో యూపీలోని ఫిరోజాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని 'ప్రగతిశీల సమాజ్ వాదీ పార్టీ(పీఎస్పీ) అధినేత శివపాల్ యాదవ్ చెప్పారు. ఆయన దగ్గరి బంధువు, ఎస్పీ నేత రామ్ గోపాల్ యాదవ్ కుమారుడు అక్షయ్ యాదవ్ ప్రస్తుతం ఈ సెగ్మెంట్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. చాలా ఏళ్ల పాటు ఎస్పీలో కొనసాగిన శివపాల్, అఖిలేశ్ తో వచ్చిన గొడవల కారణంగా పార్టీకి గుడ్ బై కొట్టి సొంత పార్టీ పెట్టుకున్నారు. ఏ ఇతర పార్టీతోనూ పొత్తు కుదరకపోతే రాష్ట్రంలోని మొత్తం 80 సెగ్మెంట్లలో పోటీ చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో రోజురోజుకూ తమ బలం పెరుగుతోందన్నారు. ఎస్పీ అంటే పడనివారంతా తమవైపు వస్తున్నారని ఆయన చెప్పారు.

చర్చిలో బాంబు పేలుళ్లు



- ఫిలిప్పీన్స్‌లో ఉగ్రదాడి.. 27 మంది మృతి
- చర్చిలో నిమిషాల వ్యవధిలో జంట పేలుళ్లు
- 77 మందికి గాయాలు.. కొందరి పరిస్థితి విషమం

జోలో (ఫిలిప్పీన్స్): ఫిలిప్పీన్స్‌లో టెర్రరిస్టులు రెచ్చిపోయారు. నిమిషాల వ్యవధిలోనే జంట బాంబు పేలుళ్లకు పాల్పడ్డారు. చర్చిలో ప్రార్థనలు జరుగుతున్న సమయంలో దాడి జరగడంతో 27 మంది చనిపోయారు. మరో 77 మందికిపైగా గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉంది. గతంలో ఉగ్రదాడులకు గురైన 'కాథడ్రల్ ఆఫ్ అవర్ లేడీ మౌంట్ కార్మెల్' చర్చి.. తాజా పేలుళ్లకు మరోసారి ధ్వంసమైంది.

ప్రార్థనలు జరుగుతుండగా..

ఆదివారం దక్షిణ ఫిలిప్పీన్స్‌లోని జోలో ఐల్యాండ్‌లో రోమన్‌క్యాథలిక్‌క్యాథడ్రల్ చర్చిలో ప్రార్థనలు జరుగుతున్నాయి. ఈ సమయంలో తొలి బాంబు పేలింది. దీంతో లోపల ఉన్న వారందరూ చెల్లాచెదురుగా ఎగిరిపడ్డారు. నిమిషం వ్యవధిలోనే ప్రధాన గేటు వద్ద రెండో బాంబు పేలింది. బయట మోహరించిన ఆర్మీ దళాలు, పోలీసులు పేలుడు శబ్దం విని వెంటనే లోపలికి వచ్చారు. "మొదటి బాంబు పేలుడు ధాటికి చర్చిలోని కిటికీలు, తలుపులు, అద్దాలు ధ్వంసమయ్యాయి. ఎటుచూసినా రక్తపు మరకలు, మాంసపు ముద్దలు. చర్చి కూడలి వరకు మానవ అవశేషాలు ఎగిరిపడ్డాయి'' అని ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు.

తరచూ దాడులు..

గేట్ వద్ద పార్క్ చేసిన మోటార్‌సైకిల్ లేదా కారులో బాంబును అమర్చినట్లు అనుమానించిన మిలటరీ అధికారులు, ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు. చనిపోయిన వారిలో 20 మంది పౌరులు కాగా, ఏడుగురు పోలీసులు ఉన్నారు. గాయపడిన వారిలో 61 మంది సివిలియన్లు, 14 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. ఈ దాడికి ఉగ్రవాద సంస్థలేవీ బాధ్యత వహించలేదు. ముస్లిం ఉగ్రవాదుల ప్రభావం ఎక్కువగా ఉన్న జోలో ఐల్యాండ్‌లో అబు సయ్యఫ్ గ్రూప్ మిలిటెంట్లు యాక్టివ్‌గా ఉన్నారు. తరచూ బాంబు దాడులు, కిడ్నాపులు, హత్యలు చేస్తున్నారు. ఫిలిప్పీన్స్, అమెరికా దేశాలు ఈ గ్రూప్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాయి.

బాంబుల్లో ఐఈడీ

బాంబు దాడుల తర్వాత అక్కడ కొన్ని గంటల పాటు సెల్‌ఫోన్ సిగ్నల్స్ నిలిపివేశారు. గాయపడిన వారిని, మృతదేహాలను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న వారిని హెలికాప్టర్ల ద్వారా జాంబోవంగా సిటీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. టెర్రరిస్టులు బాంబు దాడులకు ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైసెస్(ఐఈడీ)ను వాడినట్లు ఆర్మీ ఓ ప్రకటనలో వెల్లడించింది.



పాటీదార్ ఉద్యమ నేత హార్దిక్ పటేల్ పెళ్లి కొడుకయ్యాడు. చిన్ననాటి స్నేహితురాలు కింజల్ పారిఖ్‌ను పెళ్లి చేసుకున్నాడు. గుజరాత్‌లోని దిగ్సార్ గ్రామంలోని హార్దిక్ ఇంటి దైవం మేల్డీమాత గుడిలో ఆదివారం నిరాడంబరంగా వివాహం జరిగింది.

రాహుల్ మంచి ప్రధాని అవుతారు

ఆర్జేడీ అధినేత తేజస్వి యాదవ్

పాట్నా: మంచి ప్రధాని కాదగ్గ అన్ని అర్హతలు కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీకి ఉన్నాయని రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) సీనియర్ నేత తేజస్వి యాదవ్ అన్నారు. లోక్ సభ ఎన్నికల తర్వాతే మహాకూటమి తరఫున ప్రధాని ఎవరన్న అంశంపై మిత్రపక్షాలతో చర్చించి నిర్ణయిస్తామన్నారు. రాహుల్ ఇమేజ్‌ను డ్యామేజ్ చేయడానికి ప్రయత్నిస్తోందని బీజేపీపై ఆయన మండిపడ్డారు. వారు ఎంతగా వ్యతిరేక ప్రచారం చేసినా తన మంచితనంతో రాహుల్ ప్రజల మనసు గెలుచుకున్నారని తేజస్వి చెప్పారు. రాహుల్ నాయకత్వ లక్షణాలపై ఎవరికీ అనుమానాలు లేవన్నారు. మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను గెలిపించి రాహుల్ సత్తా చాటుకున్నారని తేజస్వి కొనియాడారు.





కొమురవెల్లిలో లష్కర్ బోనాలు

- కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- దర్శనానికి మూడు గంటల సమయం

సిద్దిపేట, వెలుగు : కొమురవెల్లి మల్లన్న లష్కర్ వారం సందర్భంగా ఆదివారం కొమురవెల్లి ఆలయ పరిసరాలు లష్కర్ బోనాలు, భక్తులతో కిటకిటలాడాయి. సికింద్రాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఎక్కువగా కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వస్తారు. లష్కర్ వారాన్ని పురస్కరించుకుని దాదాపు యాభై వేలకు పైగా భక్తులు కొమురవెల్లి మల్లన్న దర్శనం చేసుకున్నారు. ఉదయమే పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్నకు, ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించి దర్శనాలు చేసుకున్నారు. మల్లన్న ఆలయ ముఖ మండపం, గంగరేణి చెట్టు ప్రాంతాల్లో భక్తులు పట్నాలు వేసి మొక్కులు సమర్పించుకోగా ఎల్లమ్మ తల్లికి ఒడి బియ్యాలు సమర్పించారు. పొగ మంచు కమ్ముకోవడం, సరైన విధంగా వసతి సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన

అద్భుతం.. నృత్యరూపకం

- 400 మంది చిన్నారులతో ప్రదర్శన



చిన్నారులతో ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలం, వెలుగు : 'ఇదిగో భద్రాద్రి...అదిగో గౌతమి..', 'తక్కువేమి మనకూ.. రాముండొక్కడుండు వరకు' అంటూ భక్తరామదాసు రాసిన కీర్తనలపై సుమారు 400 మంది చిన్నారులు ఆదివారం సాయంత్రం వైకుంఠ ద్వారదర్శనం వేదిక వద్ద చేసిన కూచిపూడి నృత్యరూపకం ఆకట్టుకుంది. కర్నాటక, తమిళనాడు, తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన చిన్నారులంతా ఒకే వేదికపై ఒకే సంకీర్తనకు ఒకే సమయంలో చేసిన నృత్యం అబ్బురపరిచింది. ఎమ్మెల్యే పొదెం వీరయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పాకాల దుర్గాప్రసాద్, ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాధేశ్యాం మాట్లాడుతూ భద్రాద్రి రాముని సన్నిధిలో రామదాసు కీర్తనలకు కూచిపూడి బృంద నృత్యం చేయడం కనుల విందు చేసిందన్నారు. నిర్వాహకులు చల్లా కొండలరావు, గోళ్ల భూపతి రావు, కదాలి నాగరాజును వారు అభినందించారు.



'దివ్య'మైన సంబురం

భద్రాద్రికొత్తగూడెం, వెలుగు : కొత్తగూడెం క్లబ్‌లో దివ్యాంగుల సాంస్కృతికోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. బాలోత్సవ్ చిల్డ్రన్స్ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రమేశ్‌బాబు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు సాగాయి. వాసిరెడ్డితో పాటు డీఎస్పీ ఎస్ఎం అలీ మాట్లాడారు. పట్టుదల ఉంటే ఎవరైనా ఏదైనా సాధించవచ్చన్నారు. భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన పలువురు దివ్యాంగులు తమ ప్రదర్శనలతో అబ్బురపరిచారు. కార్యక్రమంలో డీపీఆర్వో శ్రీనివాస్‌రావు, ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపల్ శైలజ, డాక్టర్ విజయేందర్‌రావు పాల్గొన్నారు.

యాదాద్రి కిటకిట



యాదాద్రి, వెలుగు: యాదాద్రి శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శని, ఆదివారాలు రెండు రోజులు సెలవులు కావడంతో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో ఆలయ ఆవరణ, క్యూ లైన్లు భక్తులతో నిండిపోయాయి. స్వామి వారి దర్శనానికి రెండు గంటలకు పైగా సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఈ ఒక్క రోజే 20 వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు.

సర్పంచ్ అభ్యర్థిని ఆత్మహత్యా యత్నం

జమ్మికుంట, వెలుగు: సర్పంచ్‌గా పోటీ చేస్తున్న ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం హిమ్మత్‌నగర్ పంచాయతీ ఎస్టీ మహిళకు రిజర్వ్ అయింది. గ్రామస్తులంతా ఏకమై అంగడి రాధ బరిలో నిలబడితే ఏకగ్రీవం చేస్తామని హామీ ఇవ్వడంతో నామినేషన్ వేసింది. ఆ తరువాత మరో ఐదుగురు నామినేషన్లు వేసి నలుగురు విత్ డ్రా చేస్తున్నారు. మిగిలిన అభ్యర్థికి గ్రామంలోని ఓ వర్గం పూర్తిగా సపోర్టు చేస్తున్నారు. డబ్బు, మద్యం విచ్చలవిడిగా పంచుతున్నారు. తనను కావాలనే సర్పంచిగా నామినేషన్ వేయించి మరొకరికి మద్దతు తెలుపుతున్నారని మనస్తాపం చెందిన రాధ ఆదివారం ఇంట్లో కలుపు మందు తాగారు.



ఉప్పొంగిన మూసీ

హైదరాబాద్‌లో శనివారం కురిసిన వర్షానికి మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీగా వచ్చిన వరదతో భూదాన్ పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి వద్ద రోడ్డుపైకి నీటితో పాటు, గుర్రపుడెక్క వచ్చిచేరింది. దీంతో పెద్దరావులపల్లి భట్టుగూడెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. యాదాద్రి, వెలుగు

ఎందుకీ శిక్షణ

'ఎలక్షన్లు ఎన్ని విడతల్లో నిర్వహించినా ఉద్యోగులకు గదే డ్యూటీ ఉంటది.. ఒకే డ్యూటీకి మళ్లమళ్ల ట్రైనింగ్ ఎందుకు.. చెప్పిందే ఎన్నిసార్లని చెప్తరు? వినీ.. వినీ యాష్టకొస్తుంది.. ఎలక్షన్ డ్యూటీ ఏమన్న దగ్గర ఏస్తున్నరా.. అదీ లేదు.. సుమారు వంద కిలోమీటర్ల దూరం వెళ్లి రావల్నాయె.. ఇట్లొచ్చినమో లేదో మళ్ల ట్రైనింగ్‌కు రమ్మని ఆర్డరేస్తున్నరు. గదే వర్క్‌పై ఎన్నిసార్లు ట్రైనింగ్ తీసుకోవాలె. ఇది ఎన్నికల శిక్షణలా లేదు. మాకో శిక్షలా ఉంది' అని ఎలక్షన్ ట్రైనింగ్, డ్యూటీలకు పోతున్న ఉద్యోగులు యాష్టపడుతున్నారు.

భద్రాద్రికొత్తగూడెం, వెలుగు :



- వరుస ప్రయాణాలు, డ్యూటీలతో ఉద్యోగుల అవస్థలు
- ఒకే వర్క్‌పై ఎన్నిసార్లు ట్రైనింగ్ అని ఆవేదన

అవే ఎన్నికలు.. అదే విధానం.. అయినా శిక్షణల పేరిట ఉద్యోగులకు తప్పని తిప్పలు.. పంచాయతీ ఎన్నికలను జిల్లాలో మూడు విడతల్లో ప్రభుత్వం నిర్వహిస్తోంది. మొదటి విడతలో ఎన్నికల డ్యూటీ చేసిన పలువురికి రెండో విడతలోనూ డ్యూటీ పడింది. మొదటి విడతలో ఎన్నికల శిక్షణ తీసుకున్నా, రెండో విడత ఎన్నికలకు సంబంధించి శిక్షణలకూ హాజరు కావాల్సిందే. మొదటి, రెండు విడతల్లో డ్యూటీ చేసిన పలువురికి మూడో విడతలోనూ డ్యూటీలు పడ్డాయి. రెండు విడతల్లో శిక్షణ పొందిన వారు మూడో విడత ఎన్నికల్లో భాగంగా తిరిగి శిక్షణలకు హాజరు కావాలని ఆదేశాలుండడంతో ఉద్యోగులు ఆఫీసర్ల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఏమిటీ శిక్ష అని వాపోతున్నారు. అవే ఎన్నికలు, అవే విధులు, శిక్షణలలోనూ అవే మాటలు వినివిని చికాకు లేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల పేరుతో తమను ఆఫీసర్లు అవస్థలకు గురిచేస్తున్నారని వారు వాపోతున్నారు. పంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎన్నికలకు ముందే ఆయా మండలాల పరిధిలో శిక్షణ ఇచ్చారు. జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు జరుగనున్న క్రమంలో ఒక్కో విడత ఎన్నికల సందర్భంగా రెండు రోజుల పాటు శిక్షణలకు హాజరు కావాలని ఆదేశాలున్నాయి. మొదటి విడత ఎన్నికలు నిర్వహించిన ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు. తిరిగి రెండో విడతలో మరోసారి శిక్షణ ఇచ్చారు. ఈ నెల 30వ తేదీన జరుగనున్న మూడో విడత ఎన్నికల్లో భాగంగా పీవో, ఏపీవోలు మళ్లీ శిక్షణలకు హాజరు కావాలని ఆదేశాలు రావడంతో ఏందీ శిక్షణలంటూ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాము డ్యూటీ చేసేది ఓ మండలంలో, ఎన్నికల డ్యూటీ ఎక్కడో దూరంగా ఉన్న మండలంలో వేస్తుండడంతో ఇబ్బందవుతోందని అంటున్నారు. రెండు విడతల్లో శిక్షణకు హాజరైన వారు మళ్లీ శిక్షణకు హాజరుకావాలని ఆదేశాలుండడంతో తలలు పట్టుకుంటున్నారు.

మొదటి విడతలో భాగంగాఈ నెల 21న ఎన్నికల డ్యూటీ చేశారు. ఏ అర్ధరాత్రి సమయంలోనో వారంతా ఇళ్లకు చేరుకున్నారు. ఇంటికి చేరుకునే సమయంలోనే రెండో విడత ఎన్నికల్లో భాగంగా 22వ తేదీన నిర్వహించే శిక్షణకు హాజరు కావాలని మెస్సేజ్ రావడంతో తప్పని పరిస్థితుల్లో తిరిగి శిక్షణకు హాజరయ్యారు. తిరిగి ఇళ్లకు వెళ్లి 24వ తేదీన డ్యూటీలో చేరారు. 25న రెండో విడత ఎన్నికల్లో డ్యూటీలు నిర్వహించారు. మొదటి, రెండో విడతల్లో డ్యూటీ చేసిన పలువురికి మూడో విడత ఎన్నికల్లో డ్యూటీలు పడడంతో దూర ప్రాంతాల నుంచి శిక్షణలకు హాజరు కావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మహిళా ఉద్యోగులు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. పలు పోలింగ్ కేంద్రాల్లో అరకొర సౌకర్యాలతో అవస్థలు పడుతుంటే శిక్షణల పేర మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు వాపోతున్నారు. జిల్లాలోని గుండాల మండలానికి చెందిన వారు కొత్తగూడెం నియోజకవర్గంలో డ్యూటీ చేయాలంటే దాదాపు వంద కిలోమీటర్లు ప్రయాణించాల్సిందే. అంతే కాకుండా మొదటి విడత ఎన్నికల విధులు నిర్వహించిన తెల్లవారే రెండో విడత ఎన్నికల శిక్షణకు హాజరు కావాలంటే ఎంతో ఇబ్బంది. ఈ విషయం ఉన్నతాధికారులకు అర్థం కావడం లేదని మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల శిక్షణలు, డ్యూటీలకు హాజరయ్యేందుకు ప్రయాణాలతో ఒళ్లంతా హూనం అవుతుందని వారు అంటున్నారు.

చెడ్డీగ్యాంగ్‌ను పట్టుకున్నరు



ముఠాసభ్యులతో డీఎస్పీ షాకీర్ హుసేన్

గద్వాల, వెలుగు : ఈ నెల 4, 5 తేదీల్లో గద్వాలలో దొంగతనాలకు ప్రయత్నించిన చెడ్డీగ్యాంగ్ ముఠాలోని ఇద్దరు సభ్యులను గుజరాత్ రాష్ట్రంలో గద్వాల పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని జిల్లాకు తీసుకొచ్చి ఆదివారం గద్వాల విలేకరుల సమావేశంలో డీఎస్పీ షాకీర్ హుసేన్ వివరాలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గద్వాల పట్టణంలోని వేణు అపార్ట్‌మెంట్‌లో ఈ నెల 4న అర్ధరాత్రి దొంగతనానికి ప్రయత్నించారన్నారు. అపార్ట్‌మెంట్‌లో ఎవరు తలుపులు తీయకపోవడంతో ముఠా వెనుతిరిగి వెళ్లిందన్నారు. ఈ విజువల్స్ అక్కడున్న సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయన్నారు. వాటి ఆధారంగా దర్యాప్తు కోసం గద్వాల సీఐ హన్మంతు, ఎస్ఐ సత్యనారాయణతో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందం సైబరాబాద్ పోలీసుల సహకారంతో చెడ్డీ గ్యాంగ్ ముఠా గుజరాత్‌లో ఉన్నట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి గుజరాత్ రాష్ట్రంలోని దోహద్ జిల్లా మాలిఫాలియా తాలూకా దస్లా గ్రామానికి చెందిన సంగడ వీర్ సింగ్ భాయ్, మఖోడియా ఖనీష్ భాయ్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి వెండి కడియాలు, ఒక బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నామన్నారు. చెడ్డీగ్యాంగ్ ముఠా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు, కర్ణాటక, ఏపీ రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడ్డారన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అయోధ్య

కిడ్నాపైన బాలిక దొరికింది

- 24 గంటల్లోనే నిందితుల అరెస్టు

తుంగతుర్తి, వెలుగు : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలంలో కలకలం రేపిన బాలిక కిడ్నాప్ కేసును పోలీసులు 24 గంటల్లోనే పరిష్కరించారు. తుంగతుర్తి సీఐ అయోధ్య, ఎస్ఐ వీరబాబు వివరాల ప్రకారం.. మామిళ్ల మడమ గ్రామానికి చెందిన ధారావత్ వీరన్న, రవి, శాంతి ఓటు వేయడానికి సొంతూరుకు వచ్చారు. చిన్ననేమిల గ్రామానికి చెందిన లింగాల వెంకన్న, పద్మ కూతురు కీర్తన(6) ఆ రోజు తన బాబాయి ఇంట్లో ఆడుకుంటోంది. వీరు ముగ్గురు ఓటేసి వెళ్తుండగా పాప దగ్గర ఎవరూ లేకపోవడంతో బిస్కట్లు ఇచ్చి హైదరాబాద్ తీసుకువెళ్లారు. పాపకోసం తల్లిదండ్రులు ఎంత వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో నూతన్ కల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. స్థానికుల సమాచారం మేరకు పాప హైదరాబాద్ ఎల్బీనగర్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను అరెస్టు చేసి పాపను తల్లిదండ్రులకు అప్పగించారు.

గల్ఫ్ బంధువుకు ప్రశంసలు

పాట్కూరి బసంత్ రెడ్డికి అరుదైన గౌరవం



పాట్కూరి బసంత్ రెడ్డి

నిజామాబాద్, వెలుగు: నకిలీ ఏజెంట్ల మోసాలు, ఇతర ఏ కారణాలతోనైనా గల్ఫ్ దేశంలో ఇబ్బందులు పడే బాధితులకు గుర్తుకొచ్చే పేరు ఒకటే అదే పాట్కూరి బసంత్ రెడ్డి. నిజామాబాద్ జిల్లా జక్రంపల్లి మండలం మనోహరాబాద్‌కు చెందిన బసంత్‌రెడ్డి గతంలో గల్ఫ్ వెళ్లి వచ్చారు. అప్పటినుంచి అక్కడ కష్టాల్లో ఉన్నవారి ని ఆదుకోవడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో తనవంతు కృషి చేస్తున్నారు. ఇప్పటికే వందలాది మంది గల్ఫ్ బాధితులకు నిస్వార్థంగా చేయూతనందించి ఆదుకున్నారు. ఆయన సేవలను కొనియాడుతూ ఎర్బిల్ (ఇరాక్) లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయం కాన్సులర్ ఎంపీ రాజ్ ప్రశంసాపత్రాన్ని విడుదల చేశారు. ఇటీవల ఇరాక్ దేశంలో ఏజెంట్ల మోసానికి బలై 14 మంది జిల్లా వాసులు చీకటి గదిలో బందీ అయి దుర్భర జీవితం గడుపుతూ బసంత్ రెడ్డిని వాట్సప్ ద్వారా సాయం కోరారు. స్పందించిన బసంత్ రెడ్డి ఇరాక్ లోని తన ప్రతినిధులతో మాట్లాడారు. బాధితుల అడ్రస్ తెలుసుకుని వారికి విముక్తి కల్పించడమే గాక వారి పాస్ పోర్టులను అక్కడి పోలీస్ స్టేషన్ నుంచి విడిపించి ఇప్పించగలిగారు. 14 మంది బాధితులను సురక్షిత ప్రాంతంలో ఉంచి ఇండియాకు రప్పించేందుకు చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నారు. నేడో రేపో బాధితులు ఇండియాకు రానున్నారు. ఈ సందర్భంగా బసంత్ రెడ్డి స్పందిస్తూ.. బాధల నుంచి విముక్తి అయినపుడు వారి కళ్లల్లో కనిపించే సంతోషమే తనకు వెయ్యి ఏనుగుల బలాన్నిస్తుందని, ఆ బలమే తనను ముందుకు నడిపిస్తోందన్నారు.

బైకును ఢీకొన్న ఆటో

- తండ్రీకొడుకుల దుర్మరణం

యాదాద్రి, వెలుగు: యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం కూనూరు సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు మృతిచెందారు. జనగాం జిల్లా గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన బుర్ర దశరథ(47)తన కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌లో నివాసం ఉంటున్నారు. యాదాద్రి భువగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) లో తన బంధువుల ఇంటికి శుభకార్యానికి ఆదివారం తన కుమారుడు బుర్ర అనిల్‌కుమార్(25)తో కలిసి బైక్‌పై వచ్చారు. ఆదివారం సాయంత్రం తిరిగి ఈసీఐఎల్‌కు బయల్దేరారు. భువనగిరి మండలం కూనూరు సమీపంలో ఎదురుగా వేగంగా వచ్చిన ఆటో వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో దశరథ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడ్డ అనిల్‌కుమార్‌ను భువనగిరిలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో క్వశ్చన్ పేపర్

పరీక్షకు అరగంట ముందే డౌన్‌లోడ్‌కు చాన్స్

హైదరాబాద్, వెలుగు:

ఇంటర్ పరీక్షల్లో అక్రమాలకు చెక్‌పెట్టేందుకు క్వశ్చన్ పేపర్‌లను ఆన్‌లైన్‌లో ఇవ్వాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. అది కూడా పరీక్ష జరిగే అరగంట ముందు మాత్రమే ఆన్‌లైన్‌లో పెట్టనున్నారు. సోమవారం జరిగే ఇంటర్ ఫస్టియర్ ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ (నైతికత, మానవ విలువలు), 31న జరిగే పర్యావరణ విద్య పరీక్షలకు ఆ పద్ధతిలోనే ప్రశ్నపత్రాలను ఇచ్చేందుకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేసింది. నాలుగున్నర లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. సుమారు 1600 పరీక్షా కేంద్రాలు (దాదాపు అన్నీ సెల్ఫ్ సెంటర్లే) ఏర్పాటు చేశారు. నిజానికి ఇప్పటిదాకా ఆయా పరీక్షలకు ఇంటర్ బోర్డు తేదీలు ప్రకటిస్తే.. కాలేజీలే క్వశ్చన్ పేపర్లు తయారు చేసుకునేవి. దీంతో కాలేజీలే ఇష్టారాజ్యంగా మార్కులు వేసేవి. స్క్వాడ్స్ కఠినంగా ఉంటారని భావించే కొన్ని కాలేజీలైతే ముందుగానే పేపర్‌ను విద్యార్థులకు చెప్పేసేవి. ఈ అవకతవకలకు చెక్‌పెట్టేందుకే ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది.

పరీక్ష ప్రారంభానికి అరగంట ముందు ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో పెడతారు. ఆ పేపర్‌ను కాలేజీలు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష నిర్వహించాల్సి ఉంటుంది. అన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లకు దీనిపై ఆదేశాలిచ్చారు. మార్కులను అదే రోజు సాయంత్రం లేదా సమస్య ఉందనుకుంటే మరుసటి రోజు ఉదయం ఇంటర్ బోర్డుకు ఆన్‌లైన్‌లో పంపించాల్సి ఉంటుంది. ఎన్విరాన్మెంటల్ పేపర్‌లో మార్పులు నైతికత, మానవ విలువల పేపర్‌ను యథాతథంగా ఉంచినప్పటికీ ఎన్విరాన్మెంటల్ సైన్సెస్ పేపర్‌ను మాత్రం ఇంటర్ బోర్డు మార్చింది. సిలబస్‌లోనూ మార్పులు చేసింది. ఇప్పటిదాకా 4 విభాగాల్లో 8 ప్రశ్నలిచ్చి.. 4 ప్రశ్నలు రాసేలా ఆప్షన్ ఇచ్చేది. ఒక్కో ప్రశ్నకు 15 మార్కుల చొప్పున 60 మార్కులుండేవి. ఎథిక్స్ పరీక్షకు అదే విధానం కొనసాగినా.. ఎన్విరాన్మెంటల్‌లో మాత్రం ప్రశ్నలను 8 విభాగాలుగా విభజించారు. కొన్ని విభాగాల్లో రెండు, మరికొన్ని విభాగాల్లో 3 ప్రశ్నలుంటాయి. మొత్తం ప్రశ్నల్లో 12 ప్రశ్నలకు జవాబులు రాయాలి. ఒక్కో ప్రశ్నకు ఐదు మార్కుల చొప్పున మొత్తం 60 మార్కులు. హాల్‌టికెట్లను కూడా ఇంటర్‌బోర్డే ఇస్తోంది. ఈ పరీక్షల్లో పాస్ అయితేనే ఇంటర్ పరీక్షల్లో పాస్ అయినట్టు గుర్తిస్తారు. దీంతో ఈ పరీక్షలూ ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.





- ఎథిక్స్, ఎన్విరాన్మెంటల్ పరీక్షలపై ఇంటర్ బోర్డు నిర్ణయం
- పేపర్‌లోనూ మార్పులు.. అవకతవకలకు చెక్‌పెట్టేందుకే



కేక్ కట్ చేస్తున్న బి. వెంకట్రావ్, రాజిరెడ్డి

టీబీజీకేఎస్ ఆవిర్భావ సంబురాలు

కొత్తగూడెం, వెలుగు : టీబీజీకేఎస్ ఆవిర్భావ వేడుకలను సింగరేణి వ్యాప్తంగా యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి ప్రధాన కేంద్రమైన కొత్తగూడెంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీ వెంకట్రావ్, మిర్యాల రాజిరెడ్డి పాల్గొని మాట్లాడారు. కార్మికుల సంక్షేమమే తమ సంఘం లక్ష్యమని అన్నారు. సీఎం కేసీఆర్ సింగరేణి అభివృద్ధితో పాటు కార్మిక సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కవిత కృషితో కంపెనీలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ స్కీంను కారుణ్య నియామకాల పేర ఇప్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సోమిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మోహన్, శ్రీనివాస్, రబ్బాని, రఘు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లో యూనియన్ నాయకులు యూనియన్ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమాల్లో ఇల్లెందు ఏరియా వైస్ ప్రెసిడెంట్ గడ్డం వెంకటేశ్వర్లు, కనగాల పేరయ్య పాల్గొన్నారు.

‘బ్యాడ్జి’ అవసరం లేదు సారూ!

సుప్రీం చెప్పినా..‘బ్యాడ్జ్’ వదలడం లేదు

హైదరాబాద్, వెలుగు:

కార్లు, మినీ వ్యాన్లు, ఆటోలు వంటి లైట్ మోటార్ వెహికిల్స్ (ఎల్ఎంవీ)ను వాణిజ్యపరంగా నడిపేందుకు ప్రత్యేకంగా ట్రాన్స్‌పోర్టు లైసెన్స్ (బ్యాడ్జి) అవసరం లేదని సుప్రీంకోర్టు తీర్పు ఉంది. అయినా రవాణా, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదు. లైసెన్స్ కార్డు వెనకాల బ్యాడ్జి నంబర్ లేకుంటే విత్‌ఔట్ లైసెన్స్‌గా పరిగణిస్తూ చలానాలు రాస్తున్నారు. బ్యాడ్జి నంబర్ అవసరం లేదని క్యాబ్‌లు, వ్యాన్ల డ్రైవర్లు చెబుతున్నా.. తమకెలాంటి ఆదేశాలూ లేవంటున్నారు. దీంతో డ్రైవర్లు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా రవాణాశాఖ ఈ విషయంగా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సుప్రీంకోర్టుకు ఫిర్యాదుతో..

ట్రాన్స్‌పోర్ట్ లైసెన్స్ (బ్యాడ్జి) నంబర్ కావాలంటే కనీసం 8వ తరగతి పాసై, డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఏడాది గడిచిపోయి ఉండాలి. ఇలాంటి వారు బ్యాడ్జి నంబర్ కోసం దరఖాస్తు చేసుకుంటే.. అధికారులు పరిశీలన జరిపి జారీ చేసేవారు. కొన్నిసార్లు లైట్ మోటార్ వెహికిల్స్ ప్రమాదానికి గురైన సమయంలో వాటి డ్రైవర్లకు బ్యాడ్జి నంబర్ లేదన్న సాకుతో ఇన్సూరెన్స్ కంపెనీలు బీమాను నిరాకరించాయి. దీనిపై కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అసలు ఎల్ఎంవీ డ్రైవర్లకు బ్యాడ్జి డ్రైవింగ్ లైసెన్స్ అవసరం లేదని విన్నవించుకున్నారు. వారి వాదనలతో సుప్రీంకోర్టు ఏకీభవించింది. క్యాబ్‌లు వంటి ఎల్ఎంవీల డ్రైవర్లకు ట్రాన్స్‌పోర్టు లైసెన్స్ అవసరం లేదని, ఎల్ఎంవీ లైసెన్స్‌తో నడిపినా చెల్లుతుందని స్పష్టం చేసింది. దేశంలోని అన్నిరాష్ట్రాలు దీనిని పాటించాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేయగా.. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా 2018 మార్చి 24న జీవో ఇచ్చింది. కానీ ఈ వెసులుబాటు అమలు కావడం లేదు.



- లైట్ మోటార్ వెహికిల్ డ్రైవర్లకు ట్రాన్స్‌పోర్ట్ లైసెన్స్(బ్యాడ్జి) అవసరం లేదన్న కోర్టు
- అయినా పట్టించుకోని రవాణా, పోలీసుశాఖల అధికారులు
- బ్యాడ్జి నంబర్ లేదంటూ క్యాబ్‌లు, ఆటో డ్రైవర్లకు చలానాలు

ఏవి ఎల్ఎంవీలు..

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ట్రాన్స్‌పోర్టు లైసెన్స్ నుంచి ఆటోలు, క్యాబ్‌లతోపాటు మినీ వ్యాన్లను మినహాయించారు. 7,500 కిలోలలోపు బరువుండే వాహనాలకు ఇది వర్తిస్తుంది. అంతకు మించిన బరువుతో ఉండే వాహనాలు నడిపేందుకు బ్యాడ్జి నంబర్ తీసుకోవాల్సి ఉంటుంది. కానీ రాష్ట్రంలో పోలీసులు, ఆర్టీఏ అధికారులు లైట్ మోటార్ వెహికిల్స్ డ్రైవర్లకు బ్యాడ్జి నంబర్ లేదంటూ చలానాలు రాస్తున్నారు. దీంతో అనవసరంగా డబ్బులు కట్టాల్సి వస్తోందని డ్రైవర్లు వాపోతున్నారు. మరోవైపు ప్రైవేటు కంపెనీలు కూడా తమ వద్ద డ్రైవర్లుగా పనిచేసేందుకు వచ్చే వారికి బ్యాడ్జి నంబర్ ఉండాలని పట్టుపడుతుండటం గమనార్హం. లేకుంటే ఉద్యోగమివ్వడం లేదు.

ప్రత్యేకంగా ఉత్తర్వులు ఇవ్వాలి

“లైట్ మోటార్ వెహికిల్స్ (ఎల్ఎంవీ)కు బ్యాడ్జి నంబర్ అవసరం లేదని 2017 జులై 3నసుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు లేఖలు రాసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2018 మార్చి 24న జీవో కూడా జారీ చేసింది. కానీ అధికారులు ఎల్ఎంవీలకూ బ్యాడ్జి లైసెన్స్ కావాలంటున్నారు. సుప్రీం ఉత్తర్వులు ఉన్నాయని చెప్పినా.. తమకెలాంటి ఆదేశాలు రాలేదంటున్నారు. విత్‌ఔట్ లైసెన్స్ పేరుతో చలాన్లు రాస్తున్నారు. దీనివల్ల డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. రవాణా శాఖ కమిషనర్ స్పందించి ప్రత్యేకంగా మరోసారి అన్ని కార్యాలయాలకు ఈ అంశంపై ఉత్తర్వులు ఇవ్వాలి.”

– ఎ. సత్తిరెడ్డి, తెలంగాణ ఆటో యూనియన్ సమాఖ్య ప్రధాన కార్యదర్శి

రెడ్లు సాయంజేస్తరు.. ఆశించరు

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, వెలుగు: రెడ్డి సామాజికవర్గంలో ఉన్న సేవాగుణం వల్లే వారిలో చాలామంది ప్రజా ప్రతినిధులుగా ఎన్నికవుతున్నారని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అందరికీ సహాయం చేసే రెడ్లు, ఎవరి దగ్గర సాయం ఆశించరన్నారు. రెడ్డి జనసంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రెడ్డిహాస్టల్‌లో ఆదివారం విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేసి మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా, మానవతా దృక్పథంతో ఉపకార వేతనాలకు విరాళాలివ్వడం గొప్ప విషయమన్నారు. వ్యవసాయ, వ్యాపార, సేవ, సామాజిక రంగాల్లో రెడ్లు ప్రత్యేకత చాటుకుంటున్నారని ప్రశంసించారు. రాష్ట్ర తొలి ప్రభుత్వంలో వ్యవసాయ మంత్రిగా తాను ఎన్నో మంచిపనులు చేశానని, సీఎం కేసీఆర్ ఆశిస్సులతో వ్యవసాయ రంగాన్ని దేశంలోనే ఆదర్శంగా నిలిపానని చెప్పారు. రైతులు ఏడాదికి రూ.1.25 లక్షల కోట్ల విలువజేసే పంటలు పండిస్తున్నారని, పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తయితే పంట దిగుబడి మరింత పెరుగుతుందన్నారు. ఇంత సేవచేసి లక్ష్మీపుత్రుడిగా పేరొందిన తన వద్ద డబ్బులు లేవని ఆయన వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతా.. కాంగి‘రేసు’లునోళ్లే!

ఖమ్మం, వెలుగు:

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో కాంగ్రెస్ వర్గపోరుతో సతమతమవుతోంది. డీసీసీ అధ్యక్షుడి నియామకం మరింత ఆలస్యమవుతోంది. డీసీసీ చీఫ్‌గా ఉన్న అయిత సత్యం చనిపోయిన తర్వాత దాదాపు ఏడాది నుంచి సారథి లేకుండానే కాంగ్రెస్ నడుస్తోంది. కీలకమైన అసెంబ్లీ, పంచాయతీ ఎన్నికల్లో కూడా డీసీసీ ప్రెసిడెంట్ లేకుండానే పోటీకి దిగింది. జిల్లా నుంచి రాష్ట్ర పార్టీలో కీలకంగా ఉన్న ముగ్గురు నేతల మధ్య ఆధిపత్య పోరుతోనే డీసీసీ నియామకం ఆలస్యమవుతోందని సమాచారం. జిల్లా నుంచి మల్లు భట్టి విక్రమార్క ప్రస్తుతం సీఎల్పీ నేతగా కీలక స్థాయిలో ఉన్నారు. అంతకు ముందు కూడా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రచార సారథిగా, పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, డిప్యూటీ స్పీకర్‌గా, చీఫ్ విప్‌గా పలు బాధ్యతలు నిర్వర్తించారు. ఈయన జిల్లాలో ప్రత్యేక వర్గాన్ని కలిగి ఉండగా, ఫైర్ బ్రాండ్‌గా పేరున్న రేణుకా చౌదరి కూడా జిల్లాలో ప్రత్యేకవర్గాన్ని నడిపిస్తున్నారు. ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి ఇంకో వర్గం కలిగి ఉన్నారు. ఒకరు సూచించిన అభ్యర్థిని మరొకరు వ్యతిరేకిస్తుండడంతో సుమారు ఏడాది నుంచి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని నడిపించేవారు లేకుండా పోయారు. అసెంబ్లీ టికెట్ల కేటాయింపు దగ్గర నుంచి రేణుకా వర్గాన్ని కాంగ్రెస్ హైకమాండ్ లైట్ తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యే టికెట్లు తాను చెప్పిన వారికి ఇవ్వలేదని రేణుకా ఆగ్రహంతో ఉన్నారు. డీసీసీ పదవుల విషయంలో అయినా తన వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. అయితే ఇటీవల సీఎల్పీ నేతగా ఎంపికైన భట్టి విక్రమార్క కూడా తన వర్గానికి చెందిన వారికే జిల్లా కాంగ్రెస్ పగ్గాలు అప్పగించాలని కోరుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు తాను ప్రచార కమిటీ బాధ్యతలు తీసుకున్న తర్వాత భట్టి తన వర్గానికి చెందిన జిల్లా నేత కుసుమకుమార్‌కు రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇప్పించుకున్నారు. తాను సీఎల్పీ నేతగా ఉండడంతో, జిల్లా పార్టీ కూడా తన చేతుల్లోనే ఉండాలని భట్టి భావిస్తున్నట్లు తెలుస్తోంది. వెంటనే డీసీసీ అధ్యక్షులను నియమించాలని ఇటీవల కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆదేశించడంతో మళ్లీ ఆశావహులు తమ గాడ్ ఫాదర్ల ద్వారా పైరవీలు మొదలు పెట్టారు.

- ఖమ్మం డీసీసీ చీఫ్ పదవిపై కాంగ్రెస్ వర్గాలు
- వర్గపోరుతో నియామకం ఆలస్యం
- నాయకుడు లేకుండానే ఎన్నికలకు
- ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో ఇదీ పార్టీ పరిస్థితి



ప్రైవేటు ఉద్యోగులకు అండగా ఉంటాం: హరీశ్

హైదరాబాద్, వెలుగు: ప్రైవేటు ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆదివారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం డైరీని ఆయన విడుదల చేశారు. రాష్ట్ర సాధనలో ప్రైవేటు ఉద్యోగుల పాత్ర మరువలేనిదని అన్నారు. ఉమ్మడి ఏపీలో ప్రైవేట్ ఉద్యోగులను ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ప్రైవేటు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములు పాల్గొన్నారు.

కవిత సాయంతో గల్ఫ్‌నుంచి వచ్చా

ఆర్మూర్, వెలుగు : ఆరు నెలల క్రితం మలేషియా వెళ్లి ఏజెంట్ చేతిలో మోసపోయిన తాను ఎంపీ కల్వకుంట్ల కవిత సహకారంతో తిరిగి ఆర్మూర్‌కు వచ్చానని పట్టణానికి చెందిన బ్రహ్మణపల్లి నరేష్ తెలిపారు. ఆదివారం ఆర్మూర్‌కు తిరిగి వచ్చిన నరేష్ టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కలిగోట గంగాధర్‌తో కలిసి మాట్లాడారు. శ్రీకాంత్ అనే ఏజెంట్ మలేషియా పంపించాడని, అక్కడ వెళ్ళిన తర్వాత వర్క్ వీసా మీద పని ఇప్పిస్తానని మోసం చేశాడని నరేష్ వాపోయాడు. వీసా టైం అయిపోవడంతో అక్కడి పోలీసులు పట్టుకోవడంతో కుటుంబీకులకు సమాచారం ఇచ్చానని విషయాన్ని వారు టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కలిగోట గంగాధర్కు తెలిపారని చెప్పారు. సమస్యను ఆయన ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడుకు వివరించారన్నారు. సమస్యను తెలుసుకున్న ఎంపీ కవిత, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి ప్రత్యేక శ్రద్ధ చూపి తెలంగాణ ఎన్ఆర్ఐ సెల్ ద్వారా ఎంబసీకి లేఖ పంపించారని తెలిపారు. వెంటనే వారే డబ్బులు చెల్లించి తనకు టికెట్ బుక్ చేయించి తను ఇండియాకు వచ్చేలా సహకరించారన్నారు.

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలుండాలె

- వ్యవసాయశాఖ సీఎస్ పార్థసారథి

హైదరాబాద్, వెలుగు: భూపాలపల్లి జిల్లా ములుగులో తెలంగాణ ఉద్యానవన యూనివర్సిటీ భవన నిర్మాణ పనులను రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి ఆదివారం సందర్శించారు. మార్చి నెలాఖరుకు ప్రయోగశాలలు, వ్యవసాయ క్షేత్రాల పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రయోగశాలల్లో అంతర్జాతీయ నాణ్యతతో కూడిన పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం హర్యానా ‘నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్’ ను సందర్శించి నివేదికివ్వాలన్నారు. సదస్సులు నిర్వహించేలా కాన్ఫరెన్స్ హాల్, విద్యుత్‌కోసం సోలార్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. రాజేంద్రనగర్‌నుంచి వర్సిటీ ప్రధాన కార్యాలయాన్ని ములుగుకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఎస్టేట్ ఆఫీసర్‌ను ఆదేశించారు. విద్యార్థులు రూపొందించిన ఆర్నమెంటల్ గార్డెన్‌కు శంకుస్థాపన చేసి, వర్సిటీకి ఆనుకుని ఉన్న 50 ఎకరాల్లో ‘సెంటర్‌ఆఫ్ఎక్సలెన్స్’ కూడా వర్సిటీకి అనుబంధంగానే పనిచేస్తుందని చెప్పారు.

జోషికి హోంమంత్రి అభినందనలు

హైదరాబాద్, వెలుగు: అర్జెంటీనాలో అత్యంత ఎత్తైన అకాంగువా మంచు పర్వతాన్ని ఈమధ్యే అధిరోహించిన హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ జాయింట్ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషికి ఆదివారం రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అభినందనలు తెలిపారు. తరుణ్‌జోషి సాధించిన ఈ విజయం రాష్ట్ర పోలీసులకు గర్వకారణమని ఆయన కొనియాడారు.



ఇప్పుడే ఇట్లా.. సమ్మర్‌లో ఎట్లా?

భద్రాచలం, వెలుగు :

- ఎండిన గోదావరి
- ఇన్‌టేక్ వెల్‌వద్ద కనిష్ఠ స్థాయిలో ప్రవాహం
- నిలిచిన నీటి సరఫరా
- భద్రాద్రికి తాగునీటి కష్టాలు

వేసవికి ముందే భద్రాచలం పట్టణానికి ఎన్నడూ లేని విధంగా తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గోదావరి ఎండి పిల్ల కాల్వను తలపిస్తుండడంతో ప్రజారోగ్యశాఖ మంచినీటి పథకానికి సంబంధించి ఇన్‌టేక్ వెల్ వద్ద ప్రవాహం కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దీంతో భద్రాచలం పట్టణానికి మూడు రోజుల పాటు తాగునీరు అందించలేమని ఆఫీసర్లు చేతులెత్తేశారు. రామయ్య దర్శనానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. అంతేకాకుండా పట్టణంలోని 70వేల జనాభాకు కూడా తాగునీటి కొరత ఏర్పడింది. రోజు విడిచి రోజు 10లక్షల గ్యాలన్ల గోదావరి నీటిని ప్రజారోగ్యశాఖ అందిస్తోంది. ప్రస్తుతం గోదావరి ఎండిపోవడంతో సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజారోగ్యశాఖ ఏఈ సత్యతో పాటు స్థానిక సీఐ సత్యనారాయణరెడ్డి ఆదివారం హుటాహుటిన ఇన్‌టేక్ వెల్ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఇసుక బస్తాలతో ప్రవాహానికి అడ్డుకట్ట వేసి ఇన్‌టేక్ వెల్ వద్దకు నీటిని మళ్లిస్తున్నారు. ఈ ప్రాసెస్ ఇంకా మూడు రోజులు పడుతుందని ఆఫీసర్లు అంటున్నారు. కాగా ప్రస్తుతం గోదావరి నీటిమట్టం భద్రాచలం వద్ద 6.2 అడుగులు ఉంది. ఇన్‌టేక్ వెల్ సమీపంలో భారీగా ఇసుక మేటలు వేసిన కారణంగా ఇన్‌టేక్ వెల్ వద్దకు నీరు రావడం లేదు. ఈ క్రమంలో ఇసుక బస్తాలతో తాత్కాలికంగా కట్టను ఏర్పాటు చేసి నీటిని ఇన్‌టేక్ వెల్‌కు మళ్లించేందుకు ఆఫీసర్లు శ్రమిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ రాలేదని ఏఈ సత్య చెబుతున్నారు. జనవరిలోనే గోదావరి పిల్ల కాల్వగా మారితే ముందు వేసవిలో భద్రాద్రి వాసుల పరిస్థితి ఏంటి..? అనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.



రామా కనవేమిరా!

భద్రాచలంలో గోదావరిపై రామవారధి నిర్మించి అర్ధశతాబ్దం పూర్తయింది. దీంతో పక్కనే మరో వంతెన నిర్మాణానికి 2014లో ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2016లో పనులు పూర్తి కావాల్సి ఉంది. కానీ ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉన్నాయి. నాలుగేళ్లు పూర్తయినా పనులు నత్తను తలదన్నేలా కొనసాగుతూనే ఉన్నాయి. ఇంకెన్నాళ్లకు పూర్తవుతుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భద్రాచలం, వెలుగు :

- గోదావరిపై వంతెన నిర్మాణంలో అలసత్వం
- గడువు పొడిగించినా పనులు పూర్తిచేయని కాంట్రాక్టర్
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

భద్రాచలంలో ప్రస్తుతం ఉన్న రామవారధికి సమాంతరంగా నదిలో అంతే పొడవున 36 పిల్లర్లతో వంతెన పనులు జరుగుతున్నాయి. 2014 అక్టోబరులో పనులు మొదలయ్యాయి. ఇప్పటి వరకు 29 పిల్లర్లు మాత్రమే నిర్మించారు. ఇంకా 7 పిల్లర్లను నిర్మించాల్సి ఉంది. వాస్తవానికి 2016లోనే పనులు పూర్తి చేసేలా కాంట్రాక్టర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాడు. అయితే గడువు మరో ఏడాది పొడిగించాలంటూ అభ్యర్థించడంతో ఏడాది పొడిగించారు. అయినా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. బూర్గంపాడు వైపు నుంచి ఆరు పిల్లర్ల పైనే బెడ్లు వేశారు. ఇంకా 30 పిల్లర్లకు వేయాల్సి ఉంది. సారపాక వైపు 600 మీటర్ల అప్రోచ్ రోడ్, భద్రాచలం వైపు 600 మీటర్ల అప్రోచ్ రోడ్ పనులు కూడా చేపట్టాలి. మొత్తం ఈ వంతెన నిర్మాణానికి రూ.90 కోట్ల వ్యయం అవుతుండగా, టెండర్లలో ఓ నిర్మాణ సంస్థ రూ.65 కోట్లకే నిర్మాణానికి ముందుకొచ్చింది. 2019 నాటికి పూర్తి చేస్తామని గుత్తేదారులు చెబుతున్నా ప్రస్తుత పనులను చూస్తే నమ్మశక్యంగా లేదు. ఇప్పటికే మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పనుల తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేసి తీవ్రంగా మందలించారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. మరోవైపు నేషనల్ హైవే అధికారుల పర్యవేక్షణ లేక నిర్మాణాలు పడకేశాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. వంతెన నిర్మాణాల వద్ద ఇంజినీరింగ్ అధికారులు లేకపోవడంతో కాంట్రాక్టర్ ఆడిందే ఆటగా సాగుతోంది.

రెండో వారధికి అదనపు సౌకర్యాలు


1960-65 మధ్యకాలంలో ప్రస్తుతం ఉన్న రామవారధిని ముంబైకి చెందిన పటేల్ ఇంజినీరింగ్ కంపెనీ చేపట్టింది. అప్పట్లో నిర్మాణానికి రూ.70లక్షల వ్యయం అయ్యింది. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి 1960 డిసెంబర్ 16న శంకుస్థాన చేయగా, 1965 జూలై 13న నాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ రామవారధిని ప్రారంభించారు. అర్ధశతాబ్దం పూర్తి కావడంతో నూతన వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ రెండో వారధిలో అదనపు సౌకర్యాలు ఉన్నాయి. ప్రస్తుత వారధికి సమాంతరంగా 10 అడుగుల దూరంలోనే దీన్ని నిర్మిస్తున్నారు. ఎక్కువ వెడల్పు కలిగి రెండు వైపులా 4 అడుగుల ఫుట్‌పాత్ నిర్మిస్తున్నారు. 12 మీటర్ల వెడల్పుతో బ్రిడ్జి విశాలంగా ఉండి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా నిర్మిస్తున్నారు. రెండు వైపులా లైట్లు ఏర్పాటు చేయనున్నారు.

త్వరలో పనులు పూర్తి చేస్తాం

త్వరలోనే పనులు పూర్తి చేస్తాం. గోదావరి వరదల కారణంగా పిల్లర్ల నిర్మాణం ఆలస్యమైంది. ప్రస్తుతం వేగంగా పనులు జరుగుతున్నాయి. నిత్యం పనులను పర్యవేక్షిస్తున్నాం.

- పద్మనాభరావు ఎన్‌హెచ్ ఈఈ

ఏమన్నారంటే



రాహుల్ పట్టుదల మనిషి

రాహుల్ గాంధీలో పట్టుదల, విశాల హృదయం ఉన్నాయి. ఆయన లీడర్‌షిప్‌ని ప్రశ్నించాల్సిన అవసరం లేదు. ఎంపీగా 15 ఏళ్లఅనుభవం ఉంది.

– తేజస్వీ యాదవ్, ఆర్జేడీ నేత



సంఘ్ సిఫారసులు

శివకుమార స్వామీజీని కేంద్రం గుర్తించలేదు. ఆర్ఎస్ఎస్ సిఫారసు చేసిన వారికే భారతరత్నలు ఇచ్చారు. లక్షలాది వీరశైవ లింగాయత్‌లను ఇది చాలా బాధించింది.

– మాతే మహాదేవి, బసవదళ పీఠాధిపతి



చాక్లెట్ ఫేస్‌తో ఎన్నికలకు!

కాంగ్రెస్‌లో అందరూ అసమర్థులే. అందుకే ప్రియాంకకు పదవులిచ్చారు. చాక్లెట్ ఫేస్‌లతో లోక్‌సభ ఎన్నికలకు వెళ్లాలని, కాంగ్రెస్ నేతలు కలలు కంటున్నారు.

– కైలాష్ విజయ్ వర్గియా, బీజేపీ నేత




టీచింగ్‌లో కోటా మస్ట్

ఉన్నత విద్యాసంస్థల్లో టీచింగ్‌కి ఎస్సీ, ఎస్టీలను తీసుకోవాల్సిందే. దీనికోసం ఆర్డినెన్స్ జారీ చేయాలి. వచ్చే బడ్జెట్ సెషన్‌లోనే ఈ పని పూర్తి చేయాలి.

– ప్రొఫెసర్ మనోజ్ ఝా, రాజ్యసభ ఎంపీ

కన్యాకుమారిలో కలియుగ దైవం




మూడు సముద్రాల సంగమంతో ప్రసిద్ధి చెందిన కన్యాకుమారిలో ఇటీవల కట్టిన వేంకటేశ్వర స్వామి ఆలయమిది. బంగాళాఖాతం, అరేబియా, హిందూ మహా సముద్రాలు కలిసే చోట ఈ గుడిని టీటీడీ నిర్మించింది.

మీరూ రాయొచ్చు!

సమాజాన్ని ప్రభావితం చేసే వేర్వేరు అంశాలమీద మీ అభిప్రాయాలను ఆర్టికల్ రూపంలో పంపవచ్చు. openpage@v6velugu.com

పక్షి కన్ను సరే.. పంజరం మాటేంటి?




'ఐసీఐసీఐ–వీడియోకాన్ లోన్ ఫ్రాడ్' కేసులో అరుణ్ జైట్లీ వ్యాఖ్యలు సీబీఐ ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నాయి. కేంద్ర మంత్రిగా ఉండి జాతీయ సంస్థపై దుమ్మెత్తిపోయడం ఆయనకే చెల్లింది. అర్జునుడు పక్షి కన్నుకు గురిపెట్టినంత సూటిగా ఇన్వెస్టిగేషన్లు జరగాలంటున్న జైట్లీ.. సీబీఐ 'పంజరంలో చిలుక' అన్న వాస్తవాన్ని ఉద్దేశంగా మర్చిపోయినట్లున్నారు.

బ్యాంక్ ఫ్రాడ్ కేసులో సీబీఐ తీరును కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ తప్పుపట్టడం అందరినీ విస్మయానికి గురి చేసింది. స్వతంత్ర దర్యాప్తు సంస్థలపై ప్రభుత్వ పెద్దల ప్రభావం మనకు తెలియనిది కాదు. మరి, బాధ్యతల రీత్యా సెంట్రల్ గవర్నమెంట్‌లో టాప్-5 పొజిషన్స్‌లో ఒకడిగా ఉండిన జైట్లీ... ఇంత బాహాటంగా అసంతృప్తిని బయటపెట్టడమేంటి? జైట్లీ ఇండియాలో లేకుండా పోయి నెల రోజులు కావస్తోంది. ఉన్నట్లుండి ఈ కేసులో మాత్రమే ఉలిక్కిపడ్డారాయన. శుక్రవారం తన ఫేస్‌బుక్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. 'ప్రస్తుతం ఇండియాకి వేల మైళ్ల దూరంలో ఉన్న నన్ను... 'ఐసీఐసీఐ-వీడియోకాన్' కేసులో సీబీఐ చార్జిషీట్ షాక్‌కు గురి చేసింది' అన్నారు. సీబీఐ అధికారులు ఇన్వెస్టిగేటివ్ అడ్వెంచరిజం (సాహసోపేత పరిశోధన) మానుకోవాలని, ప్రొఫెషనల్ ఇన్వెస్టిగేషన్ మాత్రమే చేయాలని సూచించారు. మహాభారతంలో అర్జునుడు 'పక్షి కన్ను'కు మాత్రమే గురిపెట్టిన విధంగా సీబీఐ 'అవినీతిపరులను' మాత్రమే టార్గెట్ చేయాలనికూడా హితోపదేశం చేశారు. జైట్లీ ఆగ్రహ ప్రకటన వెనకున్న ఉద్దేశాన్ని అర్థం చేసుకునే ముందు అసలా కేసు పూర్వాపరాలేంటో చూద్దాం.

క్విడ్‌ప్రోకో?

2012లో ప్రఖ్యాత వీడియోకాన్ సంస్థ 20 బ్యాంకుల కన్సార్టియం నుంచి రూ.40 వేల కోట్ల రుణాన్ని పొందింది. ఎస్‌బీఐ లీడ్ బ్యాంక్‌గా వ్యవహరించింది. సదరు బ్యాంకుల కన్సార్టియంలో భాగమైన ఐసీఐసీఐ తన వంతుగా వీడియోకాన్‌కు రూ.3,250 కోట్ల రుణం మంజూరు చేసింది. ఈ వ్యవహారంలో ఐసీఐసీఐ సీఈవో చందా కొచర్, వీడియోకాన్ చీఫ్ వేణుగోపాల్ ధూత్‌ల మధ్య క్విడ్‌ప్రోకో జరిగినట్లు ఆరోపణలొచ్చాయి. ధూత్ నుంచి కొచర్ కుటుంబం ఏ విధంగా లబ్ది పొందిందనే వివరాలను అరవింద్ గుప్తా అనే విజిల్‌బ్లోయర్ బయటపెట్టడంతో ఆరోపణలకు మరింత బలం చేకూరినట్లైంది. వీటిపై 2017లో ఇన్వెస్టిగేషన్ ప్రారంభించిన సీబీఐ... ఈ కేసులో మొత్తం రూ.1,875 కోట్ల మేర అవినీతి జరిగినట్లు నిర్ధారించింది. ఆరోపణల నేపథ్యంలో చందా కొచర్... 2018 అక్టోబర్‌లోనే ఐసీఐసీఐ సీఈవో పదవి నుంచి తప్పుకున్నారు. ఇన్వెస్టిగేషన్ చేపట్టిన రెండేళ్ల తర్వాత 2019 జనవరి 22న సీబీఐ తొలి చార్జిషీటును కోర్టులో దాఖలు చేసింది. దీనిలో చందాతోపాటు ఆమె భర్త దీపక్ కొచర్, వీడియోకాన్ వేణుగోపాల్ ధూత్‌లను ప్రధాన ముద్దాయిలుగా పేర్కొని, అప్పట్లో లోన్ క్లియరెన్స్ కమిటీలో సభ్యులుగా ఉన్న సందీప్ భక్షి, కేవీ కామత్, హోమీ ఖుస్రోఖాన్, రాజీవ్ సబర్వాల్, సంజయ్ ఛటర్జీ, జరీన్ దారూవాలాలను కూడా విచారించాల్సిన అవసరముందని పేర్కొంది. ఇదిగో, ఈ 'విచారించాల్సిన జాబితా'పైనే మన మాజీ ఆర్థిక మంత్రి షాక్‌కు గురయి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మర్నాడే ఆఫీసర్‌పై వేటు

నిజమే, సీబీఐ జాబితాలోని పెద్దొళ్లను ప్రశ్నిస్తే మరిన్ని ఆధారాలు దొరుకుతాయని ఆఫీసర్లు భావించి ఉండొచ్చు. అది దర్యాప్తులో ఒక భాగం. పిలిచినంత మాత్రానికే పాపం అంటగట్టినట్లు కాదని జైట్లీకీ తెలుసు. అన్నింటికన్నా పెద్ద ట్విస్ట్ 'ఐసీఐసీఐ-వీడియోకాన్ లోన్ ఫ్రాడ్' కేసును లీడ్ చేస్తోన్న ఎస్పీ స్థాయి అధికారి సుధాంశ్‌దార్ మిశ్రా బదిలీ. చార్జిషీట్ వేసిన మర్నాడే ప్రభుత్వం ఆయనను ట్రాన్స్‌ఫర్ చేసింది. వరుస పరిణామాల ద్వారా జనాలకు సీబీఐపై అదుపు ఎవరిదో బాగా తెలిసొచ్చింది. ఇప్పటికే సీబీఐ పంజరంలో చిలుకగా మారిపోయిందన్న భావన బలంగా ఉండగా, మరి జైట్లీగారి 'పక్షి కన్ను' సూచన ఎవరికోసం? ఎందుకోసం? ఇదే 'ఐసీఐసీఐ-వీడియోకాన్' లాంటి వ్యవహారమే ఏ పబ్లిక్ సెక్టార్ బ్యాంకులోనో జరిగితే ఈ పాటికి ఎంత మందిపై కేసులు, బదిలీ వేటులు పడేవోకదా! చట్టం, న్యాయం అందరికీ సమానంగా వర్తించాలి కదా!

పిలిస్తే పరువు పోతుందా?

సీబీఐ లక్ష్యంగా చేసుకున్న జాబితా చూసినప్పుడు... ఇన్వెస్టిగేషన్ లక్ష్యం దారి తప్పినట్లుగా అనిపించిందని జైట్లీ అభిప్రాయపడ్డారు. ఏ కేసులోనైనాసరే దర్యాప్తు సంస్థలు దుస్సాహసాలకు పోతేనే ఇలాంటివి జరుగుతాయని, ఊహాత్మక అంచనాలే తప్ప సరైన సాక్ష్యాలు లేకుండా జాబితాల్లో పేర్లను చేర్చడం వల్ల ఆయా వ్యక్తులకు తీరని నష్టం వాటిల్లుతుందని జైట్లీ మండిపడ్డారు. దర్యాప్తు సంస్థల అతి వల్లే ఇండియాలో కన్విక్షన్ రేటు (శిక్షలు పడ్డ కేసులు) తక్కువగా ఉందని, అలా జరగొద్దంటే సీబీఐ లాంటి దర్యాప్తు సంస్థలు అర్జునుడి మాదిరిగా 'పక్షి కన్ను'ను మాత్రమే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచనలిచ్చారు.

జైట్లీ పోస్టుపై హాట్ హాట్‌గా చర్చ జరుగుతున్న సమయంలోనే, ఆయనను సమర్థిస్తున్నట్లుగా కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్‌గోయల్‌లు ఆ పోస్టుని షేర్ చేశారు. సీబీఐ ప్రశ్నించాలనుకుంటోన్న జాబితాలో ఉన్న కేవీ కామత్ నిజానికి చాలా పెద్ద పేరే. ఒకప్పుడు ఐసీఐసీఐని అన్నీ తానై నడిపించిన కామత్... ప్రస్తుతం బ్రిక్స్ దేశాలు ఏర్పాటు చేసిన 'న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్'కు చీఫ్‌గా పనిచేస్తున్నారు. అలాంటి వ్యక్తిని ఎలాంటి ఆధారాలు లేకుండా బ్యాంక్ ఫ్రాడ్ కేసులోకి ఎలా లాగుతారనే ప్రశ్నలు తలెత్తడం సహజం. జాబితాలోని మరోపేరు సందీప్ భక్షిది. ప్రస్తుత ఐసీఐసీఐ సీఈవో ఈయనే. జైట్లీ వాదన ప్రకారం.. 'చార్జిషీట్‌లో పెద్దవాళ్లను చేర్చడం వల్ల కేసుకు పాపులారిటీ వస్తుందే తప్ప ఏమీ ఒరగదు. ఆయా సంస్థల్లో టాప్ పొజిషన్లలో ఉన్నవాళ్లను విచారణ పేరుతో ఇబ్బందులు పెడితే వాళ్ల రెప్యుటేషన్ దెబ్బ తింటుంది'. జనరల్ ఎలక్షన్ దగ్గర పడుతున్న సమయంలో, మోడీ సర్కార్ పనిగట్టుకొని మరీ ప్రతిపక్ష నేతలపై సీబీఐ దాడులు చేయిస్తున్న ప్రస్తుత సందర్భంలో, దేశ ప్రజలకు జైట్లీ వాదన కాస్త వింతగా అనిపించక మానదు.

ఆదివాసీల భాష.. అందరిదీ కావాలి..





ఆదిమ జాతుల భాషా జ్ఞానాన్ని రక్షించుకోవటం ప్రపంచ సమాజ బాధ్యత. ఆయా జాతుల భాషను కాపాడుకోవటం అంటే మన సాంస్కృతిక వారసత్వ జ్ఞాన మూలాలను భద్రపరచుకోవటంగా భావించాలి. ఆదివాసీల భాష అందరిదీ కావాలి.

యూనివర్సిటీలు లాంగ్వేజ్ స్టడీల పేరుతో ఇతిహాసాలకు, రాతప్రతులకే పరిమితమవుతున్నాయి. మూల భాషా అన్వేషణను ఇకనైనా మొదలుపెట్టాలి. అధ్యయనాలు అలంకారప్రాయాలుగా, అనుకరణలుగా ఉండకూడదు. చారిత్రక నిజాలను నిర్ధారణ చేయాలి. ఆదిమ జాతుల భాషా పరిరక్షణకు యునెస్కో గతంలో కూడా ప్రయత్నం చేసింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ), సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (సీఐఐఎల్)తో కలిసి 2005లో మైసూర్‌లో సెమినార్ నిర్వహించింది. ఆదివాసీ సమాజంలో భాషా పరిరక్షణ, విద్యావకాశాలు, విద్యలో వెనకబాటుతనానికి గల కారణాలను సమీక్షించింది. భాషావరోధాన్ని పెద్ద సమస్యగా గుర్తించింది. దాన్ని అధిగమించటానికి 2006లో దేశవ్యాప్తంగా మల్టీ లింగ్వల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం(ఎంఎల్‌ఈ)ని చేపట్టింది. ప్రాథమిక విద్యా బోధన మాతృ భాషలోనే జరిగేలా చర్యలు తీసుకుంది. ఫలితంగా డ్రాపౌట్స్‌ని తగ్గించాలనే లక్ష్యమూ నెరవేరింది.

ప్రత్యేక మాతృ భాషలు గల ఆదివాసీ సమాజం ఉన్న రాష్ట్రాలను ఎంఎల్‌ఈ కోసం సెలెక్ట్ చేసుకుంది. అందులో ఉమ్మడి ఏపీ నుంచి గోండి (గోండి భారతి), కోయ (కోయ భారతి), సవర (సవర భారతి) ఉన్నాయి. ఆదిమ జాతుల విద్యార్థులకు వాళ్ల మాతృ భాషలో కాకుండా వేరే లాంగ్వేజ్‌లో పాఠాలు చెబుతుండటంతో అర్థమయ్యేవికావు. బోధనా భాష.. వారికి భూతంలా అనిపించేది. దానికి సెకండ్, థర్డ్ లాంగ్వేజ్‌లు కలవటంతో మరింత భయపడిపోయారు.


ఇలా తెలియని భాషల కారణంగా వాళ్లు చివరికి అజ్ఞానులుగా, అనాగరికులుగా ముద్ర పడాల్సి వచ్చింది. ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్ల ఎంఎల్‌ఈ కూడా మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఈ నేపథ్యంలో ఆదిమ జాతుల భాషలు, సంస్కృతులు అంతరించే ప్రమాదం ఏర్పడింది. పాఠ్యాంశాల్లో ఆయా జాతుల కల్చర్‌కి సంబంధించిన విషయాలు లేకపోవటం, కనీసం వాటిపై అవగాహన కల్పించకపోవటంతో సాంస్కృతిక వారసత్వం మరుగున పడిపోయే పరిస్థితి నెలకొంది.

భాష బతకడానికి, కొనసాగడానికి సామాజిక ఆదరణ, ఆచరణ, ప్రభుత్వ తోడ్పాటు చాలా అవసరం. కొన్ని ఆదిమ జాతులు, వారి భాషలు కొన్ని వేల ఏళ్లుగా మనుగడలో ఉన్నాయంటే సామాజిక, సాంస్కృతిక ఆమోదమే కారణం తప్ప పాలకుల తోడ్పాటు కానేకాదు. లిపి లేకనే ఆదివాసీల భాషలు అంతరిస్తున్నాయనే వాదన విచిత్రమైంది, అపరిపక్వమైంది. విశ్వ జ్ఞాన మూలాల ఆధారాలను అన్వేషించటం, అధ్యయనం చేయటం మాని ఆదిమ జాతుల భాషలకు అక్షరాలను వెతకటం సరికాదు.

ఆదిమ జాతుల భాషా వారసులు, విద్యావంతులు, పెద్దలు, ఆయా భాషల్లో సాహిత్యాన్ని, రచనలను ఎక్కువగా అందుబాటులోకి తేవటం తక్షణావసరం. భాషంటే సామాజిక సమాచార మాధ్యమమో, సాంస్కృతిక జీవాధారమో, గుర్తింపో మాత్రమే కాదు. భాషంటే జ్ఞానం. పాలకులు, మేధావులు, సమాజం ఆదిమ జాతుల భాషా పరిరక్షణను ఆదివాసుల కోసమే అనే చిన్నచూపుతోనో సానుభూతితోనో కాకుండా సామాజిక బాధ్యతతో, జ్ఞాన దృష్టితో చూడాలి.

('2019.. ప్రపంచ ఆదివాసీ భాషా సంవత్సరం'గా ఇవాళ ప్యారిస్‌లో యునెస్కో ప్రకటన)

– మడివి నెహ్రూ (కోయ ఆదివాసి)
ఆదివాసీ సంక్షేమ పరిషత్ సమన్వయకర్త



తెలుగులో దాదాపు 20 శాతం, తమిళంలో 30 శాతం, కన్నడంలో 80 శాతం కోయ భాషా పదాలే ఉన్నాయి. ఆదిమ జాతుల భాషలను చిన్న చూపు చూడటం సమాజానికి చిన్నచూపే తప్ప ఆ భాషలది కాదు. సాంకేతిక పదజాలంలో ఆదిమ జాతుల భాషలు వెనకబడి ఉండొచ్చు. కానీ, సామాజిక పదజాలంలో అన్ని భాషలకూ ఆదిమ జాతుల భాషలే మూలమని మరవకూడదు. అందుకే ఆయా జాతుల నాగరికత, సంస్కృతితో పాటు భాషలను గౌరవించి, కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.



జింబాబ్వేకి ఇం'ధనం' మంట



ఇప్పటికే కరెన్సీ కొరతతో ఆర్థికంగా చిక్కిన జింబాబ్వేపై మరో సమస్య వచ్చిపడింది. డీజిల్, పెట్రో ధరలు పెంచడంతో ప్రజలు హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారు. వాటి నివారణకు తక్షణం చర్యలు తీసుకోకపోతే పరిస్థితి తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉంది. పదేళ్ల కిందటి మాదిరిగా అధికార, ప్రతిపక్ష పార్టీలు కలిసి ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తే తప్ప సమస్య పరిష్కారం కాదు.

జింబాబ్వేలో ఇంధన ధరలను భారీగా పెంచటంతో ప్రజలు పెద్దఎత్తున నిరసనలకు దిగారు. వారిని కంట్రోల్ చేసేందుకు పోలీసులను, ఆర్మీని రంగంలోకి దింపాల్సి వచ్చింది. ఆందోళకారులకు, సెక్యూరిటీ ఫోర్సెస్‌కి మధ్య జరిగిన ఘర్షణల్లో ఇప్పటివరకు 12 మంది చనిపోగా వేల సంఖ్యలో జనం గాయపడ్డారు. అర్బన్ ఏరియాలు చాలా వరకు మిలటరీ ముట్టడిలో ఉన్నాయి.

వీటికితోడు ప్రభుత్వం వాట్సాప్, ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను షట్‌డౌన్ చేసింది. ప్రతిపక్షం, సివిల్ సొసైటీ సంస్థలు అల్లరిమూకలను రెచ్చగొడుతున్నాయనే సాకుతో ఆ మాధ్యమాలను అందుబాటులో లేకుండా చేసింది. కొన్నిసార్లు ఇంటర్నెట్ సర్వీసును కూడా నిలిపేసింది. ఫ్యూయెల్ రేట్లను అమాంతం పెంచుతూ జింబాబ్వే ప్రెసిడెంట్ ఎమ్మర్‌సన్ నంగాగ్వా ఈ నెల 9న అర్ధరాత్రి నిర్ణయం తీసుకున్నారు.

నంగాగ్వా పాలనలో పెట్రోల్ ధరలు 150 శాతం పెరిగాయి. అన్ని దేశాలతో పోల్చితే జింబాబ్వేలోనే ఇంధనం ఖరీదైపోయింది. ఈ నేపథ్యంలో దేశంలోని అతి పెద్ద కార్మిక సంఘం 'జింబాబ్వే కాంగ్రెస్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్'తోపాటు క్రైసిస్ కొయిలేషన్ వంటి సివిల్ సొసైటీ సంఘాలు మూడు రోజులు సమ్మెకు దిగాయి. దీంతో జన జీవనం స్థంభించింది. నిత్యవసర సరుకుల రవాణా ఆగింది. పెట్రోల్ బంక్‌ల వద్ద వాహనాలు మీటర్ల పొడవున బారులు తీరాయి. వాటర్, పవర్ కట్‌ల గురించి ఇక చెప్పాల్సిన పనే లేకుండా పోయింది.

అయినా, ప్రభుత్వం స్పందించలేదు. ప్రజలు పడుతున్న ఈ ఇబ్బందులకు కరెన్సీ కొరత కూడా తోడైంది. జింబాబ్వేలో కొన్ని నెలలుగా నగదు దొరక్క ఆర్థిక వ్యవస్థ అధ్వాన్నంగా తయారైంది. 2018 సెప్టెంబర్‌లో ప్రొఫెసర్ ఎంతులి ఎన్‌క్యూబ్‌ని ఫైనాన్స్ మినిస్టర్‌గా నియమించారు. దేశంలో 'బాండ్ నోట్' అనే క్వాసీ కరెన్సీ చెలామణిలో ఉంది. దీన్ని మార్కెట్‌లో ముద్దుగా 'బొల్లార్స్' అని పిలుచుకుంటున్నారు. అమెరికా డాలర్ల లోటును భర్తీ చేయటానికి కొందరు ఈ పాక్షిక డబ్బును ఉపయోగిస్తున్నారు.

అయితే, ఈ బాండ్ నోట్.. బ్లాక్ మార్కెట్‌ను ప్రమోట్ చేస్తోందనే ఉద్దేశంతో దానికి స్వస్తి పలకాలని మంత్రి కంకణం కట్టుకున్నారు. దేశానికి సొంత కరెన్సీ ఉండాలని, దానికి చట్టబద్ధత కల్పించాలనీ చెబుతున్నారు. బాండ్ నోట్‌ని తొలిసారిగా 2016 సెకండ్‌లో ప్రవేశపెట్టారు. అప్పటికే దేశంలో ఒకటికిమించి కరెన్సీలతో లావాదేవీలు నడుస్తున్నాయి. వాటిలో యూఎస్ డాలర్‌దే పైచేయి. కానీ, జింబాబ్వేకి పెట్టుబడులు రాకపోవటం, ఎగుమతులు జరక్కపోవటంతో మార్కెట్‌లో యూఎస్ డాలర్ కంటికి కనిపించని పరిస్థితి.

వేరే కరెన్సీ ఏదీ ప్రజల చేతుల్లో లేకపోవటంతో రిటైలర్లు గూడ్స్, సర్వీస్‌ల రేట్లను పెంచేశారు. డాక్టర్లు, టీచర్లు, సివిల్ సర్వెంట్లేమో తమకు డాలర్ల రూపంలోనే పేమెంట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో జింబాబ్వేలో గందరగోళం నెలకొంది.

ఏం చేయాలి?: ప్రభుత్వం దిగొచ్చి ఆందోళనకారులతో, ప్రతిపక్ష పార్టీలతో చర్చలు జరపాలి. నిరసనకారులపై దాడుల నిలిపివేతకు తక్షణం ఆదేశించాలి. అపొజిషన్ పార్టీ 'మూమెంట్ ఫర్ డెమొక్రటిక్ ఛేంజ్ అలయెన్స్'(ఎండీసీ-అలయెన్స్)తో కలిసి 'గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ యూనిటీ' ఏర్పాటుకు చర్యలు ప్రారంభించాలి. ఈ ప్రయత్నం గతంలో ఫలితాన్నిచ్చింది. 2008లో ఎన్నికలు వయొలెంట్‌గా మారటంతో ఈ తరహా సర్కారుకు రూపకల్పన చేశారు.

2009-13 మధ్య కాలంలో పాలన సాగించిన 'గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ యూనిటీ'.. జింబాబ్వే ఎకానమీని స్టెబిలైజ్ చేయగలిగింది. దీంతో దేశంలో శాంతియుత పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం నేషనల్ యూనిటీ గవర్నమెంట్ ఏర్పాటుతోపాటు హింసకు ఊతమందించే ప్రయత్నాలను ఎండీసీ-అలయెన్స్ మానుకోవాలి. ఎండీసీ-అలయెన్స్ లీడర్ మోర్గాన్ స్వంగిరాయ్ 2018 ఫిబ్రవరిలో చనిపోయిన తర్వాత వయొలెన్స్ అనేది ఆ పార్టీకి హాల్‌మార్క్‌గా మారింది. జింబాబ్వేకి సొంత కరెన్సీని ప్రవేశపెట్టడం కూడా మంచి పరిష్కార మార్గమే.

– 'ది వైర్' సౌజన్యంతో



మళ్లీ చీకటి రోజుల్లోకి..

జింబాబ్వేలో 2008 నాటి చీకటి రోజులు (హైపర్ ఇన్‌ఫ్లేషన్ పరిస్థితులు) మళ్లీ నెలకొన్నాయి. డీలర్లు, ప్రభుత్వ పెద్దాఫీసర్లు యూఎస్ డాలర్లకు బదులు క్వాసీ కరెన్సీని వాడుతున్నారు. బాండ్ నోట్.. యూఎస్ డాలర్‌తో సమానమని ప్రభుత్వం చెబుతోంది. కానీ, మార్కెట్ వాదన వేరేలా ఉంది. ఎక్కువ మంది రిటైలర్లు త్రీ-టయర్ ప్రైసింగ్ సిస్టం(యూఎస్ డాలర్లు, బాండ్ నోట్లు లేదా ఇకో క్యాష్)ను అనుసరిస్తున్నారని తెలిపింది. పేపాల్ వంటి సర్వీసులు ఈ కరెన్సీలతో ట్రాన్సాక్షన్లు చేస్తున్నాయని వెల్లడించింది. యూఎస్ డాలర్లు, బాండ్ నోట్‌ల షార్టేజీ వల్ల ఇకో క్యాష్, పేపాల్ వంటి సర్వీసు ఆప్షన్లను అందుబాటులోకి తెచ్చామని వివరిస్తోంది. నిజం చెప్పాలంటే.. యూఎస్ డాలర్లు, బాండ్ నోట్లు కరెన్సీ స్పెక్యులేటర్ల చేతుల్లో బంధీ కావటం వల్లే ఈ పరిస్థితి తలెత్తింది.



టాకీస్

ప్రభాత **వెలుగు** 09

సోమవారం | హైదరాబాద్

28.01.2019

www.v6velugu.com

Follow: v6velugu

నచ్చకపోతే నాకేంటి ?


సినిమా వారి విషయాలపై అందరికీ ఆసక్తి ఎక్కువ. అయితే పరిధిని దాటి వారి విషయాల్లో కల్పించుకోవడం మాత్రం ఇబ్బందిగానే ఉంటుంది. మొన్నటికి మొన్న ఒక నెటిజన్ రకుల్ గురించి తప్పుగా కామెంట్ చేశాడు. ఆమె గట్టిగానే జవాబు చెప్పింది. ఇప్పుడు మరో వ్యక్తి రశ్మికను ఇన్‌సల్ట్ చేశాడు. ఈమె కూడా స్ట్రాంగ్‌గానే రియాక్టయ్యింది. రీసెంట్‌గా లంగా ఓణీ వేసుకున్న ఫొటో పోస్ట్ చేసింది రశ్మిక. దాన్ని చూసిన ఓ వ్యక్తి... రశ్మిక కన్నడ సినిమా పాటల వ్యూస్ రికార్డులు యూట్యూబ్ నిర్వాహకులు చూస్తే నవ్వుకుంటారు అంటూ సంబంధం లేని కామెంట్ చేశాడు. దాంతో రశ్మిక... 'ప్రతి దానికీ లిమిట్ ఉంటుంది, మేం చేసేవి నచ్చకపోతే చూడకండి, అంతేకానీ ఇలాంటి పిచ్చి కామెంట్లు చేసి టైమ్ వేస్ట్ చేసుకోకండి' అంటూ కడిగేసింది. కెరీర్ ప్రారంభం నుంచీ రశ్మికకి ట్రోలింగ్ తప్పడం లేదు పాపం.





వాల్మీకి వస్తున్నాడు

మెగా హీరోలందరిలో వరుణ్ తేజ్ దారి కాస్త వేరు. వైవిధ్యంగా ఉండే కథలకు మాత్రమే ఓటేస్తుంటాడు. ఒక సినిమాకీ మరో సినిమాకీ సంబంధం లేకుండా వెరైటీ చూపిస్తూ ఉంటాడు. 'తొలిప్రేమ'లో ప్రేమికుడిగా మెప్పించాడు. 'అంతరిక్షం'లో ఆస్ట్రోనాట్‌గా కనిపించాడు. 'ఎఫ్ 2'లో కామెడీని పండించాడు. ఇప్పుడు 'వాల్మీకి'గా వచ్చేందుకు సిద్ధపడుతున్నాడు. 14 రీల్స్ ప్లస్ పతాకంపై హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ చిత్రం ఆదివారం రామానాయుడు స్టూడియోలో ప్రారంభమైంది. వరుణ్ తేజ్‌పై చిత్రీకరించిన మొదటి షాట్‌కు ఆయన చెల్లెలు నీహారిక క్లాప్ కొట్టింది. వీవీ వినాయక్ డైరెక్ట్ చేశారు. సుకుమార్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించే ఈ చిత్రాన్ని రామ్ ఆచంట, గోపీనాథ్ ఆచంట నిర్మిస్తున్నారు.



డిస్కో రాజా ముసలోడా?

రవితేజ హీరోగా, వి ఐ.ఆనంద్ దర్శకత్వంలో 'డిస్కో రాజా' సినిమా తెరకెక్కుతోంది. ఈ మూవీకి సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయం వినిపిస్తోంది. ఇందులో రవితేజ ఒక ముసలోడి పాత్రలో కనిపిస్తాడట. ఆ ముసలతను ఉన్నట్టుండి అదృశ్యమై, మళ్లీ కుర్రాడిలా వచ్చి పగ తీర్చుకుంటాడట. సమంత ప్రధాన పాత్రలో నందినీరెడ్డి రూపొందిస్తోన్న 'మిస్ గ్రానీ' రీమేక్ కథ కూడా ఇంచుమించు ఇలాంటిదే. అందులో కూడా ఒక వృద్ధురాలు యువతి శరీరంలోకి ప్రవేశించడమన్నదే మెయిన్ పాయింట్. రవితేజ సినిమా కథ కూడా దీన్ని పోలివుండటం ఊహించని విషయం. కథ ఇది అని ఇంతవరకూ 'డిస్కో రాజా' టీమ్ అయితే ఏమీ చెప్పలేదు. కాకపోతే రవితేజ ముసలి పాత్రలో కనిపించబోతున్నాడనే వార్త మాత్రం చాలా స్ట్రాంగ్‌గా వినిపిస్తోంది. అది కాస్తా యూనిట్ చెవిన కూడా పడితే ఈ విషయంలో క్లారిటీ ఇవ్వొచ్చు. వేచి చూద్దాం.

విమర్శల్ని పాజిటివ్‌గా తీసుకుంటా

అఖిల్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన 'మిస్టర్ మజ్ను' శుక్రవారం విడుదలయింది. ప్రేక్షకుల స్పందనపై తన మనోభావాల్ని దర్శకుడు వెంకీ ఇలా పంచుకున్నారు.

> నేను యాక్టర్‌గా కన్నా డైరెక్టర్‌గానే కంఫర్ట్ ఫీలయ్యాను. నా చుట్టూ ఉన్నవాళ్లు ట్రై చెయ్యమంటే యాక్టర్ అయ్యాను. నటిస్తూనే స్క్రిప్ట్ రాయడం మొదలుపెట్టాను. ఎన్ని వెర్షన్స్ రాసినా అలసట అనిపించలేదు. కానీ షూట్‌లో రెండో టేక్‌కి వెళ్లాలంటేనే తలనొప్పి వచ్చేసేది. రైటింగ్‌ని ఎంజాయ్ చేయడం మొదలుపెట్టాను. దర్శకుడినయ్యాను.

- నేను 'తొలిప్రేమ'తో బిజీగా ఉండడం, అదే టైమ్‌లో అఖిల్ రెండో సినిమా పూర్తి కావాల్సి ఉండటం వల్ల కొంత వెయిట్ చేయాల్సి వచ్చింది. ఎట్టకేలకి ఇద్దరికీ కుదిరింది. ఈ సినిమా పట్టాలెక్కింది.
- నాగార్జునగారు ఈ సినిమాకి మొదటి ప్రేక్షకుడు. ఆయన ఒక్క సీన్‌లో తప్ప ఇంకెక్కడా కరెక్షన్ చెప్పలేదు. దాంతో భరోసా వచ్చింది. సహజంగా దర్శకులకి రెండో సినిమా ఇబ్బంది అనే సెంటిమెంట్ ఒకటుంది. దాన్ని అధిగమించాననే అనుకుంటున్నాను.
- అఖిల్ చేసిన విక్కీ పాత్ర చార్మింగ్‌గా, నాటీగా ఉంటుంది. అందుకే మజ్నుకి ముందు మిస్టర్ పెట్టాం. ఈ కథకి విషాదకరమైన ముగింపు మాత్రం ఉండదు.
- షూట్‌లో నేనెప్పుడూ ఇలా చెయ్యి, అలా చెయ్యి అని అఖిల్‌కి చెప్పలేదు. ఈ సీన్‌లో ఎమోషన్ ఏంటి అనడిగేవాడు. తను చేసిందెప్పుడూ నా ఊహ కన్నా ఎక్కువగానే ఉండేది.
- నిధితో కూడా భాషాపరంగా నేనేమీ ఇబ్బంది పడలేదు. ఆమెకు తెలుగు మీద గ్రిప్ ఉంది. 'సవ్యసాచి' చేసి ఉండడంతో ఆమె కూడా ఇబ్బంది పడలేదు. ఏ రోజూ డైలాగ్ మీద ఫోకస్ పెట్టి ఎక్స్‌ప్రెషన్స్ మిస్ చేయలేదు.
- సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్‌ని, సుబ్బరాజు, కొండబాబు, హైపర్ ఆది కామెడీని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. కామన్ ఆడియెన్స్ దగ్గరనుంచి పెద్దగా విమర్శలు రాలేదు. మీడియా విమర్శలను పాజిటివ్‌గానే స్వీకరిస్తా. ఏదయినా కొందరికి నచ్చుతుంది, కొందరికి నచ్చదు. అది సహజమే.
- త్రివిక్రమ్, మణిరత్నం నాకు స్ఫూర్తి. మణిరత్నం గారి సినిమాలు సింపుల్‌గా ఉంటాయి. నేనూ అదే ఫాలో అవుతాను. త్రివిక్రమ్ గారి డైలాగులూ అంతే. అవి చూసే నేనిలా రాయగలుగుతున్నాను.
- ఒక సినిమా హిట్టయ్యింది కదాని రిలాక్స్‌గా ఉండలేం. నెక్స్ట్ సబ్జెక్ట్ కోసం మళ్లీ కష్టపడాల్సిందే. ఒక సక్సెస్ వల్ల వచ్చే గుడ్ విల్ ఇండస్ట్రీ వాళ్ళ దగ్గరే గాని ప్రేక్షకుల దగ్గర కాదు.
- ఎవరి దగ్గరా అడ్వాన్స్ తీసుకోలేదు. రెండు పెద్ద బ్యానర్స్‌తో కమిట్మెంట్స్ ఉన్నాయి. వాటి వివరాలు ఇప్పుడే చెప్పలేను.



ట్విటర్ టాక్



'థాకరే' సినిమాలో తన నటనకు ప్రశంసలు లభిస్తోన్న సందర్భంగా నవాజుద్దీన్ సిద్దిఖీ ఇలా ట్వీట్ చేశాడు.

"ఒక నటుడికి అనిర్వచనీయమైన ఆనందం ఎప్పుడు కలుగుతుందో తెలుసా? తాను పోషించిన పాత్ర ప్రేక్షకుల్ని అలరించినప్పుడు. దాన్ని వాళ్లు ఇష్టపడి ప్రశంసలు కురిపించినప్పుడు. మన మీద ప్రేమతో సినిమాని మళ్లీ మళ్లీ చూసి సపోర్ట్ చేసినప్పుడు. ఇప్పుడు నేను ఆ ఆనందంలోనే ఉన్నాను."

ఫస్ట్ లుక్



హీరోగా వరుస సినిమాలు చేసుకుంటూ పోతున్నాడు సప్తగిరి. త్వరలో 'వజ్ర కవచధర గోవింద'గా రానున్నాడు. ఈ చిత్ర ఫస్ట్ లుక్ తాజాగా విడుదలైంది. స్వామీజీ గెటప్‌లో ఫన్నీగా కనిపిస్తున్నాడు సప్తగిరి. ఈ సినిమాలో తన పాత్ర కూడా ఫన్నీగానే ఉంటుందట. ఒక దొంగ పాత్ర పోషిస్తున్నాడట. తనకో లక్ష్యముంటుందని, అదేంటో తెలుసుకోవాలంటే సినిమా చూడాలని అంటున్నాడు. అరుణ్ పవార్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని జీవీఎన్ రెడ్డి నిర్మిస్తున్నారు. సప్తగిరి, తాను కలిసి చేసిన 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్'లాగే ఈ సినిమా కూడా మంచి సక్సెస్ అవుతుందని నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నాడు దర్శకుడు. షూటింగ్ ఎనభై శాతం పూర్తయిందని, మిగిలిన సన్నివేశాలను కర్ణాటకలోని ఒక గుడిలో తెరకెక్కిస్తామని చెప్పారు నిర్మాత. ఈ హిలేరియస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో వైభవీ జోషీ కథానాయిక.



రిషీకి క్యాన్సర్

బాలీవుడ్ వారిని క్యాన్సర్ భూతం భయపెడుతోంది. మనీషా కొయిరాలా సురక్షితంగా బయటపడిందన్న సంతోషం నుంచి తేరుకోకముందే సోనాలీ బెంద్రే విషయం తెలిసింది. ఇర్ఫాన్ ఖాన్, ఆయుష్మాన్ ఖురానా భార్య, రాకేష్ రోషన్... ఇలా వరుసగా ఎవరో ఒకరి మీద ఆ వ్యాధి దాడి చేస్తూనే ఉంది. ఇప్పుడు రిషీ కపూర్ కూడా క్యాన్సర్‌తో బాధపడుతున్నారని తెలిసింది. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో అమెరికాలో చికిత్స పొందుతున్నారు రిషీ. సమస్యేంటో తెలీక రకరకాల రూమర్స్ పుట్టడంతో స్వయంగా ఆయనే క్లారిటీ ఇచ్చారు. ఈ మధ్యనే తనకి క్యాన్సర్ ఉన్న సంగతి తెలిసిందని, త్వరలోనే కోలుకుంటాననీ అన్నారు. ఆ మాటే నిజమవ్వాలని ప్రార్థిద్దాం.

ఇది రెండు మనసుల కథ

రవిచందర్, సుమయ ముఖ్య పాత్రల్లో చంద్రశేఖర్ ఎస్. నిర్మించిన చిత్రం 'ఈ 2 మనసులు'. ఆది పిని శెట్టి దర్శకుడు. రంగి, మహేష్, కాందంబరి కిరణ్, తిరుపతి, జావెద్, సతీశ్, కిరణ్, మౌనిక, జనతా సురేష్, పూజానాయుడు తదితరులు నటించారు. డెబ్బై శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వేసవిలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఫిల్మ్ చాంబర్‌లో టీజర్, పాటల్ని విడుదల చేశారు. అనంతరం దర్శకుడు మాట్లాడుతూ... ఇది మంచి ప్రేమ కథ అని, అందరికీ తప్పకుండా నచ్చుతుందని అన్నారు. ప్రొడ్యూసర్ మాట్లాడుతూ... 'నటీనటులు, టెక్నీషియన్లు అందరూ కొత్తవాళ్లయినా కూడా సినిమా చాలా బాగా వచ్చింది. స్టోరీ రెడీ అయ్యాక మేం చాలామంది పెద్ద హీరోల్ని సంప్రదించాం. ఎవరూ డేట్స్ ఇవ్వలేదు. దాంతో కొత్తవాళ్లనే తీసుకున్నాం. మాలాంటి చిన్న ప్రొడ్యూసర్లను ఎంకరేజ్ చేస్తే మంచి కథలతో మీ ముందుకు రాగలం' అన్నారు. ఈ మధ్య వచ్చిన లవ్‌స్టోరీస్‌కి ఈ సినిమా చాలా భిన్నంగా ఉంటుందని, మంచి హిట్ అవుతుందని నమ్ముతున్నామని చెప్పాడు హీరో.



ఆన్ లొకేషన్



రవితేజ, అల్లరి నరేశ్, శివబాలాజీ ముఖ్య పాత్రల్లో తెరకెక్కిన 'శంభో శివ శంభో'... 'నాడోడిగళ్' అనే తమిళ చిత్రం ఆధారంగా తెరకెక్కింది. ఇప్పుడు దానికి సీక్వెల్‌గా 'నాడోడిగళ్2' రూపొందుతోంది. శశికుమార్, అంజలి, సముతిర ఖని ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఫిబ్రవరిలో రిలీజ్ కానున్న ఈ సినిమా షూటింగ్ లొకేషన్లో ఆ ముగ్గురూ.

గప్‌చుప్



చిరంజీవితో కొరటాల శివ తీయబోయే సినిమా గురించి అందరిలోనూ క్యూరియాసిటీ ఉంది. ముఖ్యంగా చిరు సరసన ఏ హీరోయిన్ కనిపించబోతుంది అంటూ చర్చలు సాగుతున్నాయి. ఆల్రెడీ నయనతార పేరు వినిపిస్తోంది. ఆమెతో పాటు ఇందులో మరో హీరోయిన్ కూడా ఉంటుందని, ఆ పాత్రకు తమన్నాని తీసుకుంటున్నారని టాలీవుడ్ టాక్. నయనతార ఇంకా ఓకే అనలేదు కానీ తమన్నా మాత్రం రెడీగా ఉందని కూడా అంటున్నారు. మరి ఇందులో ఎంత నిజముందో.

మళ్లీ వివాదాల్లోకి..

మొదట బాలీవుడ్ వారికి బాగా చేరువైన సన్నీ లియోన్... కరెంటు తీగ, గరుడవేగ చిత్రాల ద్వారా తెలుగువారికీ దగ్గరయ్యింది. ఇతర భాషల వారికీ దగ్గరయ్యే ప్రయత్నంలో ఉంది. ప్రస్తుతం కన్నడలో 'వీరమహాదేవి' బయోపిక్ చేస్తోంది. మలయాళంలో మోహన్ లాల్ సినిమాలో కనిపించనుంది. టెంపర్ తమిళ రీమేక్‌లో స్పెషల్ సాంగ్ చేస్తోంది. ఇలా ప్రతి భాషలోనూ అవకాశాలు సంపాదిస్తోంది. అయితే అంతా బాగుంది అనుకున్న సమయంలో ఓ వివాదంలో చిక్కుకుంది. సన్నీ తనను మోసం చేసిందంటూ బాలీవుడ్ నిర్మాత భరత్ పటేల్ కంప్లయింట్ చేశాడు. అతని సినిమాలో ఐటెమ్ సాంగ్ కోసం నలభై లక్షలకు అగ్రిమెంట్ కుదుర్చుకుందట సన్నీ. ఐదు లక్షలు అడ్వాన్సు తీసుకుందట కానీ సాంగ్ చేయలేదట. అడ్వాన్స్ తిరిగివ్వమంటే కూడా ఇవ్వనంటోందంటూ వాపోతున్నాడా ప్రొడ్యూసర్. తాను ఇచ్చిన డేట్స్ అతనే వేస్ట్ చేసుకున్నాడని, ఇందులో తన తప్పేమీ లేదనేది సన్నీ వాదన. కేసు కోర్టు వరకూ వెళ్లింది. మరి చివరికి ఎవరు గెలుస్తారో.



కొడుకు కోసం ఎదురీత

శ్రవణ్ రాఘవేంద్ర, లియోనా లిషోయ్ జంటగా బాలమురుగన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎదురీత'. శ్రీ భాగ్యలక్ష్మి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై బోగారి లక్ష్మీనారాయణ నిర్మించారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్లను విడుదల చేశారు. కొడుకు ఎంతగానో ప్రేమించే ఓ తండ్రి కథ ఇది. తన కొడుకు ఏది కోరినా తీర్చే ఓ మధ్యతరగతి తండ్రి ప్రేమ... చివరికి అతడికి ఎన్ని సమస్యలు తీసుకొచ్చింది అనే కథాంశంతో ఈ సినిమాని రూపొందించామని చెప్పారు దర్శకుడు బాలమురుగన్. నిర్మాత మాట్లాడుతూ 'కుమారుడి కోసం కన్నతండ్రి సాగించిన ఎదురీత ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంటుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. మార్చి నెలలో సినిమాని విడుదల చేయనున్నాం' అని చెప్పారు. జియా శర్మ, నోయెల్ సేన్, 30 ఇయర్స్ పృథ్వీ, 'రంగస్థలం' మహేష్, కాశీ విశ్వనాథ్, రవిప్రకాష్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్నారు.



ఫొటో ఫీస్ట్



సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఆండ్రియా పెదవులపై మాత్రం అందమైన నవ్వు ఉదయించింది. ఆమెకు ప్రకృతి అంటే ఇష్టం. సాయంకాలపు వెలుగులో ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించడం మరీ ఇష్టం. అది ఆ నవ్వులోనే తెలుస్తోంది కదూ!



నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.402	రూ.4.60
వరంగల్	రూ.404	రూ.4.60

రూ.177 కోట్ల జీఎస్టీ స్కామ్

గుజరాత్‌వాసి అరెస్టు

అహ్మదాబాద్: నకిలీ ఇన్‌వాయిస్‌లతో రూ.177 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్లు సంపాదించేందుకు ప్రయత్నించిన గుజరాత్‌వాసిని అరెస్టు చేశామని సెంట్రల్ జీఎస్టీ డిపార్ట్‌మెంట్ ఆదివారం ప్రకటించింది. నిందితుణ్ని వదోదరకు చెందిన ఎహసాన్ అలీ సయ్యద్‌గా గుర్తించారు. ఇతడు నకిలీ పత్రాలతో 66 నకిలీ కంపెనీలను సృష్టించి ట్యాక్స్ ఇన్‌వాయిస్‌లు పంపించాడు. ఇందుకోసం డమ్మీ ఓనర్ల పేరిట జీఎస్టీ రిజిస్ట్రేషన్, జీఎస్టీ ఐడెంటిటీ కార్డులు, లాగిన్, పాస్‌వర్డ్‌లు, సిమ్‌కార్డులు, బ్యాంకు అకౌంట్లు సంపాదించాడు. రూ.177 కోట్ల ట్యాక్స్ క్రెడిట్ల కోసం రూ.1,210 కోట్ల విలువైన ఇన్‌వాయిస్‌లు జారీ చేశాడు. సయ్యద్‌ను సీజీఎస్టీ చట్టం కింద అరెస్టు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని గాంధీ నగర్‌లోని సెంట్రల్ ఎక్సైజ్ కమిషనరేట్ ప్రకటించింది. ఉత్పత్తిదారులు తాము కొన్ని వస్తువులపై చెల్లించిన జీఎస్టీని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ల రూపంలో పొందుతారు.

మార్కెట్‌కు ఎఫ్‌పీఐల షాక్

రూ.6వేల కోట్ల విలువైన షేర్ల అమ్మకం

న్యూఢిల్లీ: ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) ఈ నెలలో దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి రూ.6,000 కోట్ల విలువైన నిధులను ఉపసంహరించుకున్నారు. ఇక ముందు కూడా ఈ పోకడ కొనసాగుతుందని నిపుణులు అంటున్నారు. 2018 నవంబరు నుంచి డిసెంబరులో వీళ్లు రూ.8,584 కోట్లు మదుపు చేశారు. అయితే అక్టోబరులోనూ రూ.28,900 కోట్ల విలువైన షేర్లను అమ్మేశారు. ఇదేకాలంలో డెట్ మార్కెట్లో రూ.163 కోట్లు పెట్టుబడులుగా పెట్టారు. త్వరలో పార్లమెంటు ఎన్నికల వస్తుండటం, అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితి ఉండటంతో ఎఫ్‌పీఐలు దేశీయ మార్కెట్లను వదిలేస్తున్నారని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అన్నారు. వీళ్లు ప్రస్తుతం వేచిచూసే ధోరణితో ఉన్నారని తెలిపారు.

ఆ మూడే కీలకం

- బడ్జెట్, క్వార్టర్ ఫలితాలు, ఫెడ్ రేట్లపైనే దృష్టి

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం మరో రెండు రోజుల్లో ప్రవేశపెట్టబోతున్న బడ్జెట్, బ్లూచిప్ కంపెనీల క్వార్టర్ ఫలితాలు, యూఎస్ ఫెడ్ రేటు నిర్ణయం... ఈ మూడే ఈ వారం ట్రేడింగ్‌కు కీలకం కాబోతున్నాయి. ఈ మూడు అంశాలే ఈ వారం మార్కెట్‌ను నిర్దేశించబోతున్నాయని విశ్లేషకులు చెప్పారు. ఈ వారం పలు కీలకమైన ఈవెంట్లు ఉన్నాయని ఎపిక్ రీసెర్చ్‌సీఈవో ముస్తఫా నదీమ్ అన్నారు. కేంద్ర బడ్జెట్, ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ మీటింగ్‌తో పాటు యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, ఐటీసీ, హెచ్‌సీఎల్ ఫలితాలు విడుదల అవుతున్నాయని చెప్పారు.

త్వరలో సీ ప్లేన్ తెస్తాం

స్పైస్‌జెట్ అధిపతి అజయ్ సింగ్



దావోస్: భారీ సంఖ్యలో విమానాలు ప్రవేశపెట్టడం, కొత్త రూట్లకు విస్తరించడం ద్వారా తమ కంపెనీ మరింత వృద్ధి సాధిస్తుందని స్పైస్‌జెట్ చైర్మన్ అజయ్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు. ఉడాన్ పథకం కింద త్వరలో సీప్లేన్ సేవలనూ అందిస్తామని వెల్లడించారు. ఖర్చులు తగ్గించుకొని లాభదాయకత పెంచుకోవడంపై శ్రద్ధ చూపుతున్నామని చెప్పారు. స్విట్జర్లాండ్ నగరం దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం వార్షిక సమావేశం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ "పరిస్థితులు మెరుగుపడుతున్నాయి. గత కొన్ని నెలల్లో చాలా కొత్త సర్వీసులు ప్రవేశపెట్టాం. రాబోయే ఏళ్లలో 200 విమానాలను ప్రవేశపెడతాం. ఇవి 2024కల్లా డెలివరీ అవుతాయి. మొదటి పది విమానాలు గత డిసెంబరులో వచ్చాయి. ఉడాన్ మార్గాల్లో తిప్పడానికి 50 చిన్న ప్రొపెల్లర్ విమానాలకు ఆర్డర్ ఇచ్చాం. ఇటీవల రవాణా విమాన సేవలను సైతం ప్రారంభించాం. సంస్థ వృద్ధికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం'' అని వివరించారు.

మళ్లీ లాభాల్లోకి వచ్చేస్తాం

''లాభదాయకతను పెంచుకోవడానికి ఖర్చులను అదుపులో ఉంచుకుంటున్నాం కాబట్టి లాభాల లక్ష్యాన్ని చేరుకుంటామన్న నమ్మకం ఉంది. వరుసగా 15 క్వార్టర్లలో లాభాలు సంపాదించాం. గత రెండుమూడు క్వార్టర్ల నుంచే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చమురు ధరలు పెరగడమే ఇందుకు కారణం. ఇవి తగ్గిస్తే పరిస్థితులు చక్కబడతాయి. ఏటీఎఫ్ బిల్లు భారం తగ్గించుకోవడానికి కొత్త టెక్నాలజీ వాడుతున్నాం. దీనిని ప్రవేశపెట్టాక ఇంధన వినియోగం 20 శాతం వరకు తగ్గుతుంది. మళ్లీ లాభాల్లోకి వస్తాం'' అని వివరించారు. సీప్లేన్ సేవల కోసం ప్రభుత్వం నిబంధనలను ఖరారు చేసింది కాబట్టి ఇక నుంచి వీటి సేవలూ అందిస్తామని సింగ్ వెల్లడించారు. ఉడాన్ పథకంలో భాగంగా కొన్ని సీప్లేన్ రూట్ల కోసం బిడ్స్ వేశామని, త్వరలోనే సేవలను ఆరంభిస్తామన్నారు.

ట్రబుల్ షూటింగ్‌లో నిపుణుడు

అందుబాటు ధరల్లో విమానయానాన్ని అందించాలనే లక్ష్యంతో అజయ్ సింగ్ 2005లో స్పైస్‌జెట్‌ను ప్రారంభించారు. 2010లో ఈ కంపెనీ నుంచి వైదొలిగారు. 2015లో స్పైస్‌జెట్ మూతపడే సమయంలో తిరిగి దీనిని కొన్నారు. అప్పటి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. వరుసగా 14 క్వార్టర్లలో లాభాలు సంపాదించారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశంలో ఈయన ఏవియేషన్, ట్రావెల్, టూరిజం గవర్నర్ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ ఘనత సంపాదించిన మొదటి భారతీయుడే అజయ్ సింగే కావడం విశేషం. ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్, దూరదర్శన్‌ను కూడా నష్టాల నుంచి గట్టెక్కించిన వ్యక్తిగా మన్ననలు అందుకున్న సింగ్, ఢిల్లీ ఐఐటీలో ఇంజనీరింగ్ చదివారు. అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీలో ఎంబీఏ పట్టా పొందారు.

అగ్రికి అధిక నిధులు

బ్యాంక్ చీఫ్‌లతో మంత్రి ప్రిబడ్జెట్ భేటీ నేడు

ఆర్బీఐ కొత్త గవర్నర్ ఎస్‌కే దాస్ హాజరు



న్యూఢిల్లీ : మరో రెండు రోజుల్లో ఎన్డీయే ప్రభుత్వ చివరి బడ్జెట్ ప్రజల ముందుకు వస్తున్న క్రమంలో, ఆర్థిక మంత్రిగా అదనపు బాధ్యతలు చేపట్టిన పీయూష్ గోయల్, ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల అధిపతులతో భేటీ అవుతున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల సీఈవోలతో నేడు పీయూష్ గోయల్ సమావేశం కాబోతున్నట్టు కేంద్ర వర్గాలు చెప్పాయి. ఈ భేటీలో బ్యాంకింగ్ రంగాన్ని ఎలా మెరుగుపరచాలో చర్చించనున్నారు. ఫిబ్రవరి 1న 2019 20కు సంబంధించిన బడ్జెట్‌ను కేంద్రం ప్రజల ముందు ప్రవేశపెడుతోన్న క్రమంలో ఈ మీటింగ్ నిర్వహించడం విశేషం. రోజంతా నిర్వహించబోయే మీటింగ్‌లో రిజర్వు బ్యాంక్ కొత్త గవర్నర్ శక్తికాంత్ దాస్(ఎస్‌కే దాస్) కూడా హాజరవుతున్నారు. ఆర్‌బీఐ గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత శక్తికాంత్ దాస్ తన తొలి మానిటరీ పాలసీని వచ్చే నెల 7న ప్రకటించబోతున్నారు. బడ్జెట్ తర్వాత ఈ పాలసీ ప్రకటన ఉండబోతుండటంతో, అది కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. బ్యాంక్‌ల్లో మొండి బకాయిలు, చిన్న, మధ్యతరహా సంస్థలకు, వ్యవసాయం, రిటైల్ రంగాలకు అధిక నిధులు వంటి పలు కీలక విషయాలను ఈ భేటీలో చర్చించనున్నట్టు సమాచారం. 2018 డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో బ్యాంక్‌ల ఆర్థిక పనితీరు ఎలా ఉంది అనే విషయంపై కూడా సమీక్షించనున్నారు.

4వేల కోట్లు అడుగుతున్న ఇన్సూరెన్స్ కంపెనీలు

ప్రభుత్వ రంగ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీల క్యాపిటల్‌ను పెంచేందుకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.4000 కోట్లను అందించబోతుంది. బడ్జెట్‌లో నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ, ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలకు రూ.4000 కోట్ల ఫండ్‌ను ఇవ్వాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్సియల్ సర్వీసెస్ కోరుతోంది. ఇన్సూరెన్స్ కంపెనీలను ఆర్థికంగా పటిష్టం చేసేందుకే ఈ నిధులు అందించనున్నారు. జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రస్తుతం ఒత్తిడిలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2018 19 బడ్జెట్‌లోనే నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీని, ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీని, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీలను కలిపేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అరుణ్ జైట్లీ కిందటేడాది బడ్జెట్ ప్రసంగంలోనే ఈ మూడు కంపెనీలను కలిపి ఒకే సంస్థగా ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించారు . ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ విలీన ప్రక్రియ పూర్తి కానుంది. మూడు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రీమియం: రూ.41,461 కోట్లు, మార్కెట్ షేరు : 35 శాతం, మూడు కంపెనీల నికర విలువ రూ.9,243 కోట్లు ఆఫీసులు : 6వేలకు పైగా, ఉద్యోగులు: 44 వేల మంది, ఈ మూడు కంపెనీలకు కలిపి 200కి పైగా ఇన్సూరెన్స్ ప్రొడక్టులున్నాయి. వీటి ప్రీమియం మొత్తం రూ.41,461 కోట్లు. మార్కెట్ షేరు 35 శాతముంది. ఈ మూడు కంపెనీల నికర విలువ రూ.9,243 కోట్లు. 6వేలకు పైగా ఆఫీసుల్లో 44వేల మంది పనిచేస్తున్నారు.

సెటాప్ బాక్స్‌కూ పోర్టబులిటీ



ఈ ఏడాది చివరి నాటికి అమల్లోకి.. ట్రాయ్ చైర్మన్ శర్మ స్పష్టీకరణ

న్యూఢిల్లీ : మీ కేబుల్ ఆపరేటర్ లేదా డీటీహెచ్ కంపెనీతో విసిగిపోతున్నారా..? సర్వీసు ప్రొవైడర్ మార్చుకుందామంటే వీలవడం లేదా..? ఇక దాని గురించి వర్రీ అవ్వాల్సిన పని లేదట. ఈ ఏడాది చివరి నాటికి సెటాప్‌బాక్స్‌ల పోర్టబులిటీని కూడా అమల్లోకి తేవాలని బ్రాడ్‌కాస్ట్ రెగ్యులేటర్ ట్రాయ్ ప్లాన్ చేస్తోంది. మొబైల్ నెంబర్ పోర్టబులిటీ మాదిరి ఇక నుంచి సెటాప్ బాక్స్‌ల పోర్టబులిటీ పెట్టుకోవచ్చు. దీనికి ఎలాంటి ఖర్చు కూడా ఉండదట. ట్రాయ్ తీసుకున్న ఈ నిర్ణయంతో కోట్ల మంది కస్టమర్లు స్వేచ్ఛగా తమ ఆపరేటర్‌ను మార్చుకునే అవకాశం దక్కుతుంది. బ్రాడ్‌కాస్ట్ సెక్టార్‌లో ఇంటర్ ఆపరబులిటీని ప్రవేశపెట్టే యోచన ఉందా..? అనే ప్రశ్నకు సమాధానంగా తాము దీనిపై పనిచేస్తున్నామని, త్వరలోనే ఇది అమల్లోకి వస్తుందని ట్రాయ్ చైర్మన్ ఆర్‌ఎస్‌శర్మ ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

అయితే డీటీహెచ్ ఆపరేటర్లు, కేబుల్ సర్వీసు ప్రొవైడర్ల నుంచి పెద్ద ఎత్తున్న నిరసన వెల్లువెత్తుతుండటంతో, ఇంటర్ ఆపరబులిటీని అమల్లోకి తేవడం కష్టతరమని మరోవైపు నుంచి వాదనలు వినిపిస్తున్నాయి. కంటెంట్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు కూడా ఈ ప్రక్రియ అంత తేలిక కాదని అంటున్నాయి. ప్రతి సెటాప్ బాక్స్ ఎన్‌క్రిప్టెడ్ అని, ఇది బ్రేక్ చేస్తే ప్రైవసీ పరంగా ఇబ్బందులు ఎదురవుతాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ విషయంపై దేశంలోనే అతిపెద్ద డీటీహెచ్ సర్వీసు ప్రొవైడర్లు డిష్‌టీవీ, టాటా స్కైలను సంప్రదించగా.. వారు సమాధానమివ్వలేదు.

ప్రతి సెటాప్ బాక్స్ సాఫ్ట్‌వేర్, కాన్ఫిగరేషన్ భిన్నంగా ఉంటుందని ఇండస్ట్రీ అధికారులు చెప్పారు. వేరే ఏ కంపెనీ ఆ సెటాప్ బాక్స్‌లను వాడుకోలేదని పేర్కొన్నారు. అయితే కొనుగోలు చేసిన తర్వాత సాఫ్ట్‌వేర్‌ను డౌన్‌లోడ్ చేసుకునే విధానాన్ని బాక్స్‌లు కలిగి ఉండాలని శర్మ అన్నారు. ఉదాహరణకు... మార్కెట్ నుంచి న్యూట్రల్ సెటాప్ బాక్స్‌ను మీరు కొనుగోలు చేయొచ్చు. ఇన్‌స్ట్రుమెంట్ స్వతంత్రంగా ఉండాలి. ఇంటర్‌నెట్ కనెక్షన్ కోసం వాడే మోడెమ్‌లలో ఆ స్వేచ్ఛను మనందరం ఇప్పటికే చూశాం కదా...అలాంటి సెటాప్ బాక్స్‌లు తీసుకురావాలనేదే ట్రాయ్ ఉద్దేశం. సెటాప్ బాక్స్‌ల ఇంటర్ ఆపరేబులిటీ కోసం ట్రాయ్ ఇప్పటికే ప్రభుత్వ ఏజెన్సీలు, బయట కన్సల్టెన్సీలతో కలిసి పనిచేస్తోంది. ఈ ప్రక్రియ ఈ ఏడాది చివరి వరకు ముగుస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. 'ముందుగా అనుకున్న మాదిరి కంటే, ఎక్కువ కాలమే పడుతోంది. ఇంకా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఒక్క ఏడాదిలోనే ముగించేటట్టు ప్రయత్నిస్తాం' అని పేర్కొన్నారు.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా 16 కోట్ల చెల్లింపు టీవీ సబ్‌స్క్రైబర్లున్నారు. ఓ కంపెనీ సెటాప్‌బాక్స్‌లు కొన్న తర్వాత, వారు ఆ సర్వీసు ప్రొవైడర్‌కే లాక్ అయిపోతున్నారు. ఇన్ని రోజులు ఇంటర్ ఆపరేబులిటీ లేకపోవడంతో, వారు అదే సర్వీసు ప్రొవైడర్‌ను కొనసాగించడమో లేదా కొత్త దాన్ని మళ్లీ కొనుక్కోవడమో చేస్తున్నారు. అయితే ఇంటర్ ఆపరేబులిటీ అనుమతించిన తర్వాత ప్రస్తుతమున్న సెటాప్ బాక్స్‌ల భవిష్యత్తు ఎలా మారబోతుందోనని ఇండస్ట్రీ నిపుణులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

90 శాతం కస్టమర్లు కొత్త టారిఫ్‌లోకి...

టీడీహెచ్ , కేబుల్ టీవీ ఆపరేటర్ల కోసం ట్రాయ్ అమల్లోకి తీసుకొస్తున్న కొత్త టారిఫ్ విధానంలోకి గడువు లోపల 90 శాతం కస్టమర్లు మారతారని ట్రాయ్ భావిస్తోంది. ఫిబ్రవరి 1 నుంచి ట్రాయ్ కొత్త విధానం అమల్లోకి వస్తున్న క్రమంలో, కస్టమర్లు కొత్త విధానంలోకి మారే ప్రక్రియను వేగవంతమైందని, జనవరి 31 వరకు 90 శాతం కస్టమర్లు నూతన విధానంలోకి వస్తారని ట్రాయ్ చైర్మన్ శర్మ ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం 10 శాతం మాత్రమే, అంటే ప్రయాణాలలో ఉన్న వారు లేదా ఇళ్లలో లేని వారు, ఈ కొత్త విధానంలోకి మారలేకపోవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే 40 శాతం మంది కస్టమర్లు కొత్త విధానంలో ఛానళ్లను ఎంచుకునే ప్రక్రియను చేపట్టినట్టు జనవరి 24న ట్రాయ్ ప్రకటించింది.

నిత్యాంక్‌తో నో లింక్

ఎక్స్ఛేంజీలకు ఎస్సెల్, జీ గ్రూపుల వివరణ

న్యూఢిల్లీ: నోట్లరద్దు సమయంలో పెద్ద ఎత్తున డిపాజిట్లు చేసిన నిత్యాంక్ ఇన్‌ఫ్రాపవర్, మల్టీవెంచర్స్ లిమిటెడ్‌తో తమకు ఎలాంటి సంబంధమూ లేదని సుభాష్ చంద్ర అధీనంలోని ఎస్సెల్‌గ్రూపు సంస్థలు జీ ఎంటర్‌టైన్‌మెంట్, డిష్‌టీవీలు ఆదివారం ప్రకటించాయి. ఈ రెండు కంపెనీలపై తీవ్ర నేరాల దర్యాప్తు కార్యాలయం (ఎస్‌ఎఫ్ఐఓ) దర్యాప్తు జరుగుతున్న విషయం తెలిసిందే. నిత్యాంక్ ఇన్‌ఫ్రాపవర్, మల్టీవెంచర్లు స్వతంత్ర కంపెనీలని, ఎస్సెల్‌తో వీటికి సంబంధం లేదని తెలిపాయి. ఈ వ్యవహారంలో ఎస్సెల్ గ్రూప్ సంస్థలకు ప్రమేయం ఉందంటూ దురుద్దేశంతో ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నాయి. డీమానిటైజేషన్ టైంలో ఈ రెండు కంపెనీలు చేసిన డిపాజిట్లతో తమకు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపాయి. ఈ విషయంలో ఎస్‌ఎఫ్ఐఓ కోరిన సమాచారం అంతా ఇచ్చామని, తదనంతరం ఎలాంటి వివరాలూ అడగలేదని తెలిపింది.

ఆందోళనలో డెట్ ఫండ్స్

ఎస్సెల్ గ్రూపు ఆపదలో ఉందంటూ సుభాష్ చంద్ర ప్రకటించడం, షేర్ల ధరలు పడిపోవడంతో డెట్ ఫండ్ సంస్థలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నాయి. దాదాపు 150 డెట్ మ్యూచువల్ ఫండ్ కంపెనీలకు ఈ గ్రూపు రూ.ఎనిమిది వేల కోట్ల విలువైన బాండ్లు, డిబెంచర్లు జారీ చేసింది. ఆదిత్య బిర్లా మ్యూచువల్ ఫండ్ అత్యధికంగా రూ.2,936 కోట్లు పెట్టుబడి పెట్టింది. హెచ్‌డీఎఫ్‌సీ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, ఎస్‌బీఐ, కోటక్, రిలయన్స్, ఐసీఐసీఐ, కోటక్ వంటి కంపెనీలు రూ.400 కోట్ల నుంచి రూ.వెయ్యి కోట్ల వరకు మదుపు చేశాయి.

గత రెండు రోజులుగా స్టాక్ మార్కెట్ లేకపోవడంతో సుభాష్‌చంద్రకు చెందిన గ్రూప్ కంపెనీల షేర్ల ధరలలో మార్పులేదు. శుక్రవారం నాడు జీ గ్రూప్, ఎస్సెల్ గ్రూప్ కంపెనీల షేర్లు ఘోరమైన పతనాన్ని చూశాయి. ఆ తర్వాత వరుస పరిణామాల నేపథ్యంలో ఈ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగుతుందనే విశ్లేషకుల అంచనాలు నిజమైతే, ఆ కంపెనీల షేర్ల ధరలు సోమవారం మరింత పతనమవుతాయని అంటున్నారు. పెద్ద ఇన్వెస్టర్లు సెల్లింగ్ మొదలెడితే, షేర్ల ధరలు ఎక్కడ ఆగుతాయో కూడా చెప్పడం కష్టమేనని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

వినోదమే డబ్బు

- 2022 నాటికి మీడియా, వినోద పరిశ్రమ... రూ.3.73 లక్షల కోట్లకు పెంపు
- ఏటా 11.7 శాతం వృద్ధి నమోదు
- ఇండియన్ వీడియో ఓటీటీ మార్కెట్ 2022 నాటికి రూ.5,363 కోట్లు
- 2017లో ఓటీటీ మార్కెట్ రూ.1,932 కోట్లు
- మొబైల్ వీడియో అడ్వర్‌టైజింగ్ వార్షికంగా 32.8 శాతం వృద్ధి
- 2022 నాటికి 1,09,65,87,930 లక్షల ఎంబీకి పెంపు

న్యూఢిల్లీ : మనదేశంలో మీడియా, వినోద పరిశ్రమ తిరుగులేకుండా దూసుకుపోతోంది. 2022 నాటికి ఈ పరిశ్రమ రూ.3.73 లక్షల కోట్లను తాకనుందని అసోచామ్, పీడబ్ల్యూసీ సంయుక్త అధ్యయనం వెల్లడించింది. వార్షికంగా ఈ పరిశ్రమ 11.7 శాతం వృద్ధిని నమోదు చేస్తోందని తెలిపింది. 2017లో మీడియా, వినోద పరిశ్రమ సైజు రూ.2.15 లక్షల కోట్లు. ఆదాయాలు, జనాభా పెరుగుదల, అన్ని ఫార్మాట్లలో కంటెంట్ వినియోగం విస్తరించడం ఈ ఇండస్ట్రీ పెంపుదలకు దోహదం చేస్తుందని అధ్యయనం తెలిపింది. టీవీ, సినిమా లాంటి ట్రెడిషనల్ మీడియానే కాక, ఓవర్‌దిటాప్ (ఓటీటీ) లాంటి కొత్త డిజిటల్ సర్వీసులు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంది. 2022 నాటికి ఇండియన్ వీడియో ఓటీటీ మార్కెట్ రూ.5,363 కోట్ల మార్కెట్ సైజుతో గ్లోబల్‌గా టాప్ 10 మార్కెట్లలో ఒకటిగా నిలువనుందని అంచనా వేసింది.

2017 -2022 కాలంలో టీవీ, సినిమా, ఓటీటీలు కలిపి మొత్తం ఎంటర్‌టైన్‌మెంట్, మీడియా పరిశ్రమ వృద్ధిలో 46 శాతంగా ఉండబోతున్నాయి. వచ్చే ఏళ్లలో ఇవి అనూహ్యమైన వృద్ధిని సాధించనున్నట్టు తాజా అధ్యయనం పేర్కొంది. ఓటీటీ సర్వీసుల లాంచ్‌తో వీడియోఆన్‌డిమాండ్‌కు మీడియా ఇండస్ట్రీలో పెను మార్పులే చోటు చేసుకున్నాయి. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్‌లు ట్రెడిషినల్ స్టూడియోలకు బాగా పోటీని ఇస్తున్నాయని పీడబ్ల్యూసీ ఇండియా పార్టనర్, లీడర్(వినోదం, మీడియా రంగం) ఫ్రాంక్ డీ సౌజా తెలిపారు.



అమెరికా, చైనా కంటే చాలా వెనకే....

మొబైల్ వీడియో అడ్వర్‌టైజింగ్ కూడా ఇండియా ఇంటర్నెట్ అడ్వర్‌టైజింగ్ మార్కెట్‌లో వేగవంతంగా అభివృద్ధి చెందుతోన్న సెగ్మెంట్‌గా ఉంది. ఇది వార్షికంగా 32.8 శాతం వృద్ధిని నమోదు చేయబోతుంది. 2022 నాటికి ఇది రూ.2,064 కోట్లకు చేరనుంది. డేటా టారిఫ్ రేట్లు తక్కువగా ఉంటుండటంతో, ఇండియాలో డేటా వినియోగం 2017 -2022 మధ్య కాలంలో 7,16,71,030 లక్షల ఎంబీ నుంచి 1,09,65,87,930 లక్షల ఎంబీకి పెరగనుంది. ఈ పరిణామాలతో వీడియోఆన్ డిమాండ్ మార్కెటే ఎక్కువగా లాభపడనుందని అసోచామ్ పీడబ్ల్యూసీ సర్వే అంచనావేస్తోంది. మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్‌లో దేశీయంగా వెచ్చిస్తోన్న తలసరి వినియోగం 2021 నాటికి 32 డాలర్లు. చైనాలో ఇది 222 డాలర్లుగా ఉంది. యూఎస్ఏలో అత్యధికంగా 2,260 డాలర్లు వెచ్చిస్తున్నారు.



స్థానిక కంటెంట్‌తో సక్సెస్...

టెక్నాలజీ వాడకం ద్వారా స్థానిక, క్వాలిటీ కంటెంట్‌ను యూజర్లకు అందిస్తున్నారు. ఇదే వీడియోఆన్‌డిమాండ్ సర్వీసు ప్రొవైడర్ల సక్సెస్‌కు ప్రధాన కారకంగా నిలుస్తోంది. ఇండియాలో ఓటీటీ మార్కెట్ 2017లో రూ.1,932 కోట్లు ఉంటే, 2022 నాటికి రూ.5,363 కోట్లకు వృద్ధి చెందబోతుంది. ఈ కాలంలో సబ్‌స్క్రిప్షన్ వీడియో ఆన్ డిమాండ్ మెజార్టీ షేరును దక్కించుకోబోతుంది. స్మార్ట్‌ఫోన్ల వాడకం పెరగడం, డేటా టారిఫ్‌లు తక్కువగా ఉంటుండటంతో ఈ వృద్ధిని నమోదు చేయనుందని అధ్యయనం అంచనావేస్తోంది.

చాంపియన్ సైనా

- ఇండోనేసియా మాస్టర్స్ టైటిల్ గెలుచుకున్న స్టార్ షట్లర్
- ఫైనల్లో గాయంతో తప్పుకున్న మరీన్

జకార్తా:

హైదరాబాద్ స్టార్, లండన్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత సైనా నెహ్వాల్‌కు కొత్త ఏడాది కలిసొచ్చింది. ఇండోనేసియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ టైటిల్‌ను స్టార్ షట్లర్ సైనా తొలిసారి గెలుచుకుంది. మూడు సార్లు ప్రపంచ చాంపియన్ కరోలిన్ మరీన్ (స్పెయిన్) కాలిగాయంతో టైటిల్ ఫైట్ మధ్యలో వైదొలగడంతో గేమ్ పూర్తికాకుండానే సైనాను విజయం వరించింది. 2018లో ఇదే టోర్నీ ఫైనల్లో ఓడిపోయిన సైనాకు ఈ ఏడాది ఇది తొలి బీడబ్ల్యూఎఫ్ టైటిల్. 2018 కామన్‌వెల్త్ క్రీడల్లో గోల్డ్‌మెడల్, ఆసియా క్రీడల్లో కాంస్యం పతకం గెలుచుకున్న సైనా డెన్మార్క్, ఇండోనేసియా, మాస్టర్స్, సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీల్లో ఫైనల్స్ దాకా వెళ్లింది. అయితే ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీలో ఆరంభం నుంచి టాప్ ర్యాంక్ ప్లేయర్లను ఓడించిన సైనా మరీన్‌తో జరిగిన మ్యాచ్‌లో దూకుడుగా మొదలుపెట్టింది. కాసేపటికే మరీన్ అద్భుతమైన గేమ్‌ప్లాన్‌తో ఆధిక్యంలోకి దూసుకుపోయింది. 9-3 ఆధిక్యంలో ఉండగా సైనాకు ఓ బలమైన రిటర్న్ ఇచ్చే ప్రయత్నంలో మరీన్ అదుపుతప్పి కిందపడిపోవడంతో కాలు బెణికింది. కాసేపు విరామం తర్వాత ఆట కొనసాగించిన మరీన్ 10-4 ఆధిక్యంలో ఉండగా నొప్పి పెరిగిపోవడంతో మ్యాచ్‌నుంచి తప్పుకుంది. దీంతో నిర్వాహకులు సైనాను విజేతగా ప్రకటించి దాదాపు రెండున్నర కోట్ల ప్రైజ్‌మనీ అందించారు.





గాయంతో కోర్ట్‌లో కుప్పకూలిన మరీన్, భర్త కశ్యప్‌తో టైటిల్ విజేత సైనా



బిగ్ ఫోర్‌లో ఆండీ ముర్రే తొలి రౌండ్‌లోనే ఔటవగా... రోజర్ ఫెడరర్ క్వార్టర్స్‌కు చేరలేకపోయాడు. ఇక మిగిలిన ఇద్దరు మొనగాళ్లు జొకోవిచ్, నడాల్ ఫైనల్ ఫైట్‌కు రాగా... అందులో జొకో జోరు ముందు స్పెయిన్ బుల్ రఫా నిలవలేకపోయాడు. టఫ్ ఫైట్ ఖాయమనుకున్న చోట వన్‌సైడ్ విక్టరీ సొంతం చేసుకున్నాడు. బలమైన బ్యాక్‌హ్యాండ్ గేమ్‌తో పాటు నెట్ దగ్గర చక్కటి 'షో' చేసిన జొకోవిచ్ రికార్డు స్థాయిలో ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా నిలవడంతో పాటు ఆల్‌టైమ్ బెస్ట్ లిస్ట్‌లో పీట్ సంప్రాస్‌ను వెనక్కి నెట్టి టాప్–3లో చేరాడు.


> 'ఏడాదిగా నా జర్నీ గురించి ఆలోచిస్తున్నా. సరిగ్గా పన్నెండు నెలల క్రితం గాయంతో బాధపడుతున్నా. ఇప్పుడు మీ ముందు ఇలా విజేతగా నిలబడ్డా. ఈ అనుభూతి అనిర్వచనీయం. మాటలు రావడం లేదు. ఈ రెండు వారాలు చాలా ఎమోషనల్‌గా గడిచాయి. అనుక్షణం మెరుగవడానికి ప్రయత్నిస్తూనే ఉంటా'
>
> **- జొకోవిచ్, ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత**

నీ దూకుడు సాటెవ్వరూ

ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచిన జొకోవిచ్ ■ ఫైనల్లో ఓడిన నడాల్

మెల్‌బోర్న్:

ప్రపంచ నంబర్‌వన్, నంబర్ టూల మధ్య పోరు అందరూ అనుకున్నట్లు హోరాహోరీగా సాగలేదు. సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్ దూకుడు ముందు స్పెయిన్ బుల్ రఫెల్ నడాల్ నిలవలేకపోయాడు. రఫాను రఫ్ఫాడిస్తూ... జొకో ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ ముద్దాడాడు. గతంలో ఆరు సార్లు విజేతగా నిలిచిన జొకోవిచ్ (2016, 2015, 2013, 2012, 2011, 2008) ఈ సారి కూడా ఎలాంటి పొరపాటు చేయకుండా టైటిల్ గెలిచి కొత్త చరిత్ర రాశాడు. ఇప్పటివరకు రాయ్ ఎమర్సన్ (ఆస్ట్రేలియా), ఫెడరర్ (స్విట్జర్లాండ్)లు ఆరేసి సార్లు మెల్‌బోర్న్ విజేతలుగా నిలవగా... ఇప్పుడు ఆ రికార్డును జొకో బద్దలుకొట్టాడు. ఆదివారం రాడ్ లీవర్ ఎరీనాలో జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ మెన్స్ సింగిల్స్ ఫైనల్లో 31 ఏళ్ల నొవాక్ జొకోవిచ్ 6-3, 6-2, 6-3తో రఫెల్ నడాల్‌పై విజయం సాధించాడు. ఈ టైటిల్‌తో 15 గ్రాండ్‌స్లామ్‌లు సాధించి ఆల్‌టైమ్ బెస్ట్ లిస్ట్‌లో పీట్ సంప్రాస్ (14 గ్రాండ్‌స్లామ్స్)ను దాటి మూడో స్థానానికి చేరాడు. రోజర్ ఫెడరర్ (20 గ్రాండ్‌స్లామ్స్), నడాల్ (17 గ్రాండ్‌స్లామ్స్) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.





మెల్‌బోర్న్‌లో ఆదివారం ఫొటోలకు ఫోజులిస్తున్న ఆస్ట్రేలియన్ విజేత ఒసాక

జొకో జోరు...

2 గంటల 4 నిమిషాల పాటు సాగిన ఫైనల్ ఫైట్‌లో టాప్ సీడ్ జొకో అందుకు తగ్గట్టే ఆకట్టుకోగా... రెండో సీడ్ రఫా తేలిపోయాడు. ప్రపంచ నంబర్‌వన్‌కు ఏ దశలోనూ పోటీనివ్వలేకపోయాడు. టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన 32 ఏళ్ల నడాల్‌కు జొకో చుక్కలు చూపించాడు. వన్‌సైడ్‌గా సాగిన ఈ మ్యాచ్‌లో జొకో 8 ఏస్‌లు సంధించాడు. జొకో 9 అనవసర తప్పిదాలు చేయగా... నడాల్ 28 తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. కచ్చితమైన సర్వీస్‌లు, అంతే సూపర్ రిటర్న్‌లతో పాటు నెట్ పాయింట్స్‌తో జొకో సత్తాచాటాడు. తొలి సెట్‌లో జొకో జోరు ముందు నిలవలేకపోయిన రఫా రెండో సెట్‌లో తేరుకునే యత్నం చేశాడు. ఐదో గేమ్‌లో పుంజుకునేందుకు చూసినా బలమైన ఫోర్ హ్యాండ్ షాట్లతో బదులిచ్చిన జొకో ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. అప్పటికే రెండు సెట్‌లు కోల్పోయి డీలా పడిన నడాల్ మూడో సెట్‌లోనైనా మ్యాజిక్ చేస్తాడనుకుంటే అదీ సాధ్యపడలేదు. విజయం అనంతరం జొకో మోకాళ్లపై కూర్చొని కోర్టును ముద్దాడటం వీక్షకులను ఆకట్టుకుంది. మరోవైపు మెన్స్ డబుల్స్ ఫైనల్లో హెర్బర్ట్-నికోలస్ మహుత్ (ఫ్రాన్స్) జంట 6-4, 7-6 (7/1)తో హెన్రీ కాంటినెన్ (ఫిన్లాండ్)-జాన్ పీర్స్ (ఆస్ట్రేలియా) జోడీపై గెలిచింది. విన్నర్‌కు రూ. 5.31 కోట్లు, రన్నరప్‌కు రూ. 2.65 కోట్లు లభించాయి.

ప్రైజ్‌మనీ (రూపాయల్లో)

జొకోవిచ్	నడాల్
29.06 కోట్లు	14.53 కోట్లు



ఫైనల్ సాగిందిలా..

జొకోవిచ్		నడాల్
8	ఏస్‌లు	3
0	డబుల్‌ఫాల్ట్స్	2
5/8	బ్రేక్‌పాయింట్స్	0/1
16/18	నెట్ పాయింట్స్	7/14
34	విన్నర్స్	21
9	అనవసర తప్పిదాలు	28
89	మొత్తం పాయింట్స్	53







బ్యాటింగ్ చేస్తున్న వరుణ్ సెలెక్షన్స్‌కు హాజరైన క్రికెటర్లతో వరుణ్ తదితరులు

ప్రతిభను 'వెలుగు'లోకి తేవాలని..

- వెలుగు మేనేజ్‌మెంట్ ప్రతినిధి వరుణ్
- ఆర్మూర్, కామారెడ్డిలో క్రికెటర్ల సెలెక్షన్స్

నిజామాబాద్/ సిద్దిపేట/ మహబూబాబాద్, వెలుగు:

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రికెటర్లను 'వెలుగు'లోకి తీసుకురావాలనే ఉద్దేశంతోనే 'వెలుగు, వీ6' మీడియా క్రికెట్ టోర్నీ నిర్వహిస్తుందని మేనేజ్‌మెంట్ ప్రతినిధి వరుణ్ అన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఆదివారం మొదలైన సెలెక్షన్స్ శిబిరాలను ఆయన పరిశీలించారు. ముందుగా కామారెడ్డిలోని ఇందిరా గాంధీ స్టేడియంలో, అనంతరం ఆర్మూర్‌లోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న సెలెక్షన్స్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ ప్రతిభే కొలమానంగా క్రీడాకారుల ఎంపిక ఉంటుందన్నారు. సెలెక్షన్స్ కోసం వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన క్రీడాకారులతో ముచ్చటించారు. టోర్నీ బాగా ఆడి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలన్నారు. కొద్దిసేపు నెట్స్‌లో బ్యాటింగ్ చేసి ప్లేయర్స్‌ను ఉత్సాహపరిచారు. కామారెడ్డిలోని ఇందిరా గాంధీ స్టేడియంలో కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజకవర్గాల జట్లను, ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల జట్లను సెలెక్టర్లు ఎంపిక చేశారు.

సిద్దిపేటలో అనూహ్య స్పందన

సిద్దిపేటలోని మినీ స్టేడియంలో నిర్వహించిన సెలెక్షన్స్‌కు అనూహ్య స్పందన వచ్చింది. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గ జట్ల ఎంపిక కోసం నిర్వహించిన సెలెక్షన్స్ కు మొత్తం 80 మంది క్రీడాకారులు హాజరయ్యారు. 'వెలుగు' మేనేజ్ మెంట్ ప్రతినిధులు మహ్మద్ కలీమొద్దీన్, మహ్మద్ తాహిద్, సాహెర్ పాషా క్రీడాకారుల ప్రతిభాపాటవాలను పరిశీలించారు.

మహబూబాబాద్‌లో ఉత్సాహంగా..

మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంలో నిర్వహించిన సెలెక్షన్స్‌కు 100 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి టీమ్‌లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు చాగంటి శ్రీనివాస్, మహబూబాబాద్ జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు బి. అజయ్‌సారథి, వెలుగు మహబూబాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ చీకటి శ్రీనివాస్, వీ6, వెలుగు ప్రతినిధులు పాల్గొన్నారు.


పాక్ కెప్టెన్‌పై నాలుగు మ్యాచ్‌ల బ్యాన్



దుబాయ్: జాతి వివక్ష వ్యాఖ్యలు చేసినందుకు పాకిస్తాన్ క్రికెట్ టీమ్ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్‌పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) నాలుగు మ్యాచ్‌ల నిషేధం విధించింది. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో ఆ జట్టు ఆల్‌రౌండర్ పెహ్లుక్వాయో పై సర్ఫరాజ్ జాతివివక్ష వ్యాఖ్యలు చేశాడు. ఐసీసీ నిషేధంతో దక్షిణాఫ్రికాతో జరిగే చివరి రెండు వన్డేలతో పాటు టి20 సిరీస్‌లో రెండు మ్యాచ్‌లకు సర్ఫరాజ్ దూరమవుతాడు. ఆటగాళ్ల నియామవళిని స్ట్రిక్ట్‌గా అమలు చేస్తున్నామని ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రిచర్డ్సన్ అన్నాడు. పెహ్లుక్వాయో పై సర్ఫరాజ్ చేసిన వ్యాఖ్యలు స్టంప్స్ మైక్రోఫోన్‌లో రికార్డయ్యాయి. ఆ తర్వాత తాను చేసిన వ్యాఖ్యలపై సర్ఫరాజ్ ట్విట్టర్ ద్వారా క్షమాపణలు చెప్పాడు.



ఐదు మ్యాచుల సిరీస్‌లో 2–0 ఆధిక్యంలో నిలిచి '#టెన్ ఇయర్ చాలెంజ్' గెలవాలని విరాట్ కోహ్లీ నాయకత్వంలోని టీమిండియా మూడో వన్డేకు రెడీ అయింది. పదేళ్లుగా న్యూజిలాండ్ గడ్డపై కలగా మిగిలిన వన్డే సిరీస్ విజయాన్ని సాధించడంతో పాటు 2014లో జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకునేందుకు సై అంటోంది. మౌంట్‌మాంగనీలో కోహ్లీ సేన విక్టరీ కంటే హర్దిక్ పాండ్యా సెలెక్షన్‌పైనే ఇప్పుడు అందరి దృష్టి ఉంది.



టెన్ ఇయర్ చాలెంజ్

- సిరీస్ విక్టరీపై కోహ్లీ సేన గురి
- తుది జట్టులో హార్దిక్ పాండ్యా !
- నేడు ఇండియా, న్యూజిలాండ్ మూడో వన్డే
- ఉదయం 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

మౌంట్‌మాంగనీ:

'#టెన్ ఇయర్ చాలెంజ్' ప్రస్తుతం సోషల్ మీడియాలో మోస్ట్ ట్రెండింగ్‌టాపిక్. పదేళ్ల క్రితం ఎలా ఉన్నాం.. ప్రస్తుతం ఎలా ఉన్నామనేది ఈ చాలెంజ్ కాన్సెప్ట్. ప్రస్తుతం కోహ్లీ సేన ముందు కూడా ఇదే చాలెంజ్ ఉంది. టీమిండియా 2009లో న్యూజిలాండ్ గడ్డపై చివరిసారిగా వన్డే సిరీస్ గెలిచింది. మళ్లీ పదేళ్ల తర్వాత మరోసారి సిరీస్ విక్టరీకి అవకాశం దొరికింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి రెండు వన్డేలను ఏకపక్షంగా గెలిచి ప్రస్తుతం 2-0తో ఆధిక్యంలో ఉన్న కోహ్లీ సేన న్యూజిలాండ్‌తో సోమవారం మూడో వన్డేకు రెడీ అయ్యింది. ఈ మ్యాచ్‌ను గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలనుకుంటున్న కోహ్లీ సేన 2014లో జరిగిన పరాభవానికి కూడా బదులివ్వాలని ఆశిస్తోంది. 2014 న్యూజిలాండ్‌లో టీమిండియా 0-4తో సిరీస్‌ను కోల్పోయింది.

టీమిండియా సూపర్ ఫిట్

ఆస్ట్రేలియాలో సాధించిన విజయంతో ఊపుమీదున్న కోహ్లీ సేన న్యూజిలాండ్‌లోను అదే దూకుడు చూపిస్తోంది. వరల్డ్‌కప్ సన్నాహకాల్లో భాగంగా న్యూజిలాండ్‌తో జరిగే చివరి రెండు వన్డేలతోపాటు టీ20 సిరీస్‌కు టీమిండియా కెప్టెన్ కోహ్లీకి బీసీసీఐ విశ్రాంతినిచ్చింది. అయితే జట్టుకు సిరీస్ విజయాన్నిందించి వెళ్తే.. ఏ ఆందోళన లేకుండా హాలిడేను ఆస్వాదించవచ్చని కోహ్లీ భావిస్తున్నాడు.

పాండ్యా ఇన్ !

టీవీ షో లో నోరుపారేసుకుని సస్పెన్షన్ ఎదుర్కొని, తిరిగి న్యూజిలాండ్ ఫ్లైట్ ఎక్కిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాపైనే ప్రస్తుతం అందరి దృష్టి ఉంది. మూడో వన్డే ఆడే తుది జట్టులో పాండ్యా స్థానం దాదాపు ఖరారైంది. పాండ్యా తుదిజట్టులోకి వస్తే విజయ్ శంకర్ బెంచ్‌కు పరిమితమవుతాడు. అయితే తుది జట్టు ప్రకటించేంత వరకు పాండ్యాపై సస్పెన్స్ తప్పదు. మూడో వన్డేలో టీమిండియాలో ఇంతకంటే మార్పులేమీ ఉండవు. లెగ్ స్పిన్ ద్వయం కుల్దీప్, చహల్ బౌలింగ్‌కు ఇప్పటికీ న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్ దగ్గర బదులులేదు. ఇక పేసర్లు భువనేశ్వర్, మహ్మద్ షమీ కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ జట్టును నడిపిస్తున్నారు. ఓపెనర్లు రోహిత్, ధవన్ రెండో వన్డేలో అదరగొట్టారు. కెప్టెన్ కోహ్లీ తిరుగులేని ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. రెండో వన్డేలో 47 రన్స్ చేసిన అంబటి రాయుడు కూడా టచ్‌లోకి వచ్చాడు. ఇక వెటరన్ మహేంద్రసింగ్ ధోనీ ఫామ్‌లో ఉండడంతో జట్టు మిడిలార్డర్ కోటగోడను తలపిస్తోంది. ధోనీతో కలిసి చివర్లో బ్యాట్‌తో అదరగొడుతున్న కేదార్ జాదవ్ బౌలింగ్‌లోను మాయ చేస్తున్నాడు. చివరి రెండు వన్డేల్లో దినేశ్ కార్తీక్‌కు చాన్స్ దొరకొచ్చు. శుభమన్‌గిల్ కూడా అరంగేట్రం చేసే అవకాశం ఉంది.

> 2013 తర్వాత న్యూజిలాండ్ జట్టు సొంతగడ్డపై ఇప్పటివరకు వరుసగా మూడు వన్డేలు ఓడిపోలేదు. ఆ ఏడాది ఫిబ్రవరిలో ఇంగ్లండ్ చేతిలో రెండు మ్యాచుల్లో ఓడిన కివీస్ జట్టు, ఆ తర్వాత డిసెంబర్‌లో వెస్టిండీస్ చేతిలో ఒక మ్యాచ్‌లో ఓటమిపాలైంది.

భారమంతా కేన్ పైనే..

మరో పక్క న్యూజిలాండ్ పరిస్థితి ఘోరంగా తయారయ్యింది. ఆ జట్టు భారమంతా కెప్టెన్ కేన్ విలియమ్సన్‌పై నే ఉంది. కేన్ మినహా ఆ జట్టులోని బ్యాట్స్‌మన్ అందరూ తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యారు. గప్టిల్, టేలర్, లాథమ్ పెద్ద స్కోర్లు చేయలేకపోతున్నారు. ఆల్‌రౌండర్ బ్రేస్‌వెల్ ఒక్కడే ఫర్వాలేదనిపిస్తున్నాడు. కివీస్ బౌలర్లు సొంతగడ్డపై వికెట్లు తీయడానికి నానా తంటాలు పడుతున్నారు.

తుది జట్లు అంచనా:

ఇండియా: రోహిత్ , ధవన్, కోహ్లీ(కెప్టెన్), రాయుడు, ధోనీ, జాదవ్, శంకర్/ హార్దిక్ పాండ్యా, చహల్, కుల్దీప్ , భువనేశ్వర్, షమీ

న్యూజిలాండ్ : గప్టిల్, మన్రో, విలియమ్సన్(కెప్టెన్), రాస్ టేలర్, లాథమ్, నికోలస్, గ్రాండ్‌హోమ్, బ్రేస్‌వెల్, ఇష్ సోధి, ఫెర్గూసన్, బౌల్ట్.

కోహ్లీసేనతో జాగ్రత్త.. కివీస్ పోలీసు హెచ్చరిక

'క్రికెట్ బ్యాట్, బాల్ లాంటి వస్తువులతో తిరుగుతారెమో జాగ్రత్త..' న్యూజిలాండ్ ప్రజలకు అక్కడి ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ పోలీసు విభాగం జారీ చేసిన హెచ్చరిక ఇది. న్యూజిలాండ్‌లో ఏం జరిగిందో అని ఎక్కువ ఆలోచించకండి. న్యూజిలాండ్‌ను తొలి రెండు వన్డేల్లో చిత్తు చేసి సిరీస్‌లో ఆధిక్యంలో నిలిచిన టీమిండియాను ఈస్టర్న్ డిస్ట్రిక్ పోలీసు శాఖ అభినందించకుండా ఉండలేకపోయింది. ఇందుకోసం ట్విట్టర్‌లో టీమిండియా ఫొటోను పోస్ట్ చేసి తమ ప్రశంసలను వ్యంగ్యంగా రాసుకొచ్చింది." మన దేశంలో పర్యటిస్తున్న ఓ విదేశీ గ్రూప్ అరాచకంగా ప్రవర్తిస్తుంది. దేశ ప్రజలకు ఇదే మా హెచ్చరిక. ప్రస్తుతమున్న సమాచారం మేరకు ఆ గ్రూప్ అమాయకులైన న్యూజిలాండ్ పౌరులుపై నేపియర్‌లోను, మౌంట్‌మాంగనీలో ఘోరంగా దాడి చేసింది. క్రికెట్ బ్యాట్, బాల్ వంటి వస్తువులతో ప్రజలు ఎవరైనా బయటకొస్తే ప్రత్యేక జాగ్రత్తలు తప్పనిసరి, లేదంటే మీకు అవమానం తప్పదు" అంటూ ఈస్టర్న్ పోలీసు విభాగం చేసిన ట్వీట్ ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరలవుతోంది.



పాట పాడుతూ.. బాధ మరుస్తూ

తయేజ్ (యెమెన్):

ఓ స్కూల్.. అక్కడికెళితే తూటాల రంధ్రాలున్న గోడలు స్వాగతం పలుకుతాయి. అది మొన్నమొన్నటి వరకు. కానీ, ఇప్పుడక్కడకు వెళితే చెవులకు ఇంపైన సంగీతం వినబడుతుంది. పిల్లలు కీబోర్డు వాయించడం కనిపిస్తుంది. అది యెమెన్‌లోని తయేజ్ నగరంలో ఉన్న అల్ నవ్రాస్ స్కూలు. నాలుగేళ్లుగా అంతర్యుద్ధంతో అట్టుడుకుతున్న యెమెన్‌లో పిల్లలు బుల్లెట్ల చప్పుడు, బాంబుల మోతను మరిచిపోవడానికి స్కూలు టీచర్లు చేసిన ఆలోచనది. యుద్ధ వాతావరణం నుంచి కోలుకోవడానికి పిల్లలకు సంగీతం నేర్పిస్తున్నారక్కడ.

2015-16లో జరిగిన దాడిలో తయేజ్‌లోని మూడంతస్తుల అల్ నవ్రాస్ స్కూల్ భవనం దెబ్బతిన్నది. గోడలనిండా బులెట్ల రంధ్రాలే. కొన్నిరోజులకు మళ్లీ స్కూల్‌ను తెరిచారు. ‘‘స్కూల్‌ను తెరిచాక వచ్చిన పిల్లల్ని చూస్తే బాధేసింది. వారి మానసిక పరిస్థితి ఏమాత్రం బాలేదు. బాంబుల మోతకు భయపడిపోయారు’’ అని ఓ టీచర్ చెప్పారు. ఆ భయం నుంచి వాళ్లను పక్కకు మళ్లించేందుకు సంగీతం నేర్పించడం మొదలెట్టామన్నారు. ప్రస్తుతం పదుల సంఖ్యలో విద్యార్థులు అక్కడ సంగీతం నేర్చుకుంటున్నారు. ‘మై ఫేస్.. మై ఫేస్.. దిస్ ఈజ్ మై నోస్’ అంటూ పిల్లలు ఆనందంగా పాటలు పాడుతూ బాధను మరిచిపోతున్నారు. చాలా మంది సంగీత టీచర్లు ఫ్రీగా బోధించేందుకు ముందుకొస్తున్నారు. దీంతో ఆ మ్యూజిక్ ప్రోగ్రామ్‌ను మరింత విస్తరించాలని టీచర్లు నిర్ణయించారు. అరబిక్, మ్యాథ్స్‌తో పాటు మ్యూజిక్‌ను కరికులమ్‌లో భాగం చేయాలనుకుంటున్నారు. అక్కడికి దగ్గర్లోని మొఖా నగరంలో ఉన్న ఓ యూనివర్సిటీ.. చిన్నారులకు మ్యూజిక్ నేర్పించేందుకు అవసరమైన వాయిద్యాలను ఫ్రీగా సరఫరా చేసింది.

కాఫీకి ఫేమస్

యెమెన్ నైరుతి ప్రాంతంలో ఉన్న తయేజ్ కాఫీ తోటలకు ప్రసిద్ధి. అక్కడి నుంచి ‘మోకా’ పోర్టు ద్వారా విదేశాలకు కాఫీని ఎగుమతి చేస్తుంటారు. కానీ ఇప్పుడు యెమెన్ యుద్ధభూమిగా మారింది. అక్కడి హౌతీ రెబల్స్ (ఇరాన్ సాయం చేస్తోంది), సౌదీ అరేబియా నేతృత్వంలోని ప్రాంతీయ మిలిటరీ దళాల మధ్య నాలుగేళ్లుగా భీకర పోరు జరుగుతోంది. ఈ విషయమై ఇప్పటికే జోక్యం చేసుకున్న ఐక్యరాజ్యసమితి తయేజ్‌లో శాంతి నెలకొల్పేందుకు ప్రయత్నిస్తోంది. తయేజ్ నగరంలోకి ప్రభుత్వ బలగాలు చొచ్చుకుపోవడంతో బయటి నుంచి రెబెల్స్ నగరాన్ని చుట్టుముట్టారు. దీంతో యుద్ధం భీకరంగా జరుగుతోంది.

10 వేల మంది మృతి

యెమెన్‌లో యుద్ధం మొదలయ్యాక 20 లక్షల స్టూడెంట్లు స్కూళ్లకు దూరమయ్యారు. 2015 నుంచి సుమారు 5 లక్షల మంది స్కూళ్లకు రావడం లేదని గత మార్చిలో యూఎన్ నివేదిక వెల్లడించింది. సౌదీ నేతృత్వంలోని మిలిటరీ 2015 మార్చిలో యెమెన్ విషయంలో జోక్యం చేసుకున్నాక అక్కడ సుమారు 10 వేల మంది మృతి చెందారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. కానీ మానవహక్కులు సంఘాలు మాత్రం చనిపోయిన వారి సంఖ్య అంతకు ఐదింతలు ఉంటుందంటున్నారు.









అరచేతుల్లో ఆయుధం

బాధితులకు బాసటగా మొబైల్ వీడియోలు ▪ పోలీసుల ఎఫ్ఐఆర్‌లకు అవే పెద్ద సాక్ష్యాలు

ఘటన1:

అది పంజాబ్‌లోని బర్నాలా. అంతా నల్లటి చీకట్లు. అందమైన ఓ 30 ఏళ్ల యువతి అక్కడుంది. అక్కడకు వచ్చిన కొందరు దుండగులు ఆమెపై దాడి చేశారు. కిందపడేసి కొట్టారు. కర్రలతో చితకబాదారు. ఆమె డ్రెస్ మొత్తం రక్తంతో తడిసిపోయింది. అక్కడితో ఆగలేదు ఆ దుండగులు.. ఆమె బట్టలను చించేశారు. ఘటన మొత్తాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ వీడియోను చూసిన మరుక్షణం పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. ఆ దుండగులు ఇంతలా రెచ్చిపోవడానికి కారణం.. రాజకీయ నాయకురాలైన ఆమె వివాహేతర సంబంధం పెట్టుకోవడమట.

ఘటన2:

హైదరాబాద్ గాంధీ ఆస్పత్రి.. 2017 మార్చి. రాజు అనే దివ్యాంగుడు ఆస్పత్రికొచ్చాడు. వీల్‌చైర్ కోసం అక్కడి వార్డ్ బాయ్‌ను అడిగాడు. కానీ, ఉచితంగా రోగులకు ఇవ్వాల్సిన వీల్ చైర్ కావాలంటే లంచం కావాలని అడిగాడా వార్డ్ బాయ్. ఇవ్వలేక బుడ్డ పిల్లలు ఆడుకునే సైకిల్‌పై వచ్చాడు రాజు. దాన్నెవరో వీడియో తీసి ఫార్వర్డ్ చేశారు. అది అలాఅలా పాకి వైరల్ అయిపోయింది. ఆరోగ్య శాఖ అధికారుల దృష్టి వరకెళ్లింది. దీంతో వార్డ్ బాయ్‌ను సస్పెండ్ చేయడంతో పాటు 30 వీల్‌చైర్లు, ఆరు స్ట్రెచర్లను కొనేశారు అధికారులు. రాజుకూ నగరంలోని ఓ ఎన్జీవో ఓ మాంచి వీల్‌చైర్ కొనిచ్చింది.

2017 నాటికి ఇండియాలో మొబైల్ ఫోన్లున్న జనం	116 కోట్లు
స్మార్ట్‌ఫోన్లున్న జనం	54 కోట్లు
ఇంటర్నెట్ వాడుతున్నోళ్లు	42.87%
మొబైల్ వాడుతున్న గ్రామీణ జనం	19.4 కోట్లు
నగరంలో స్మార్ట్‌ఫోన్ వాడుతున్నోళ్లు	36.6 కోట్లు
2014లో సగటున నెలకు వాడుతున్న నెట్	0.26 జీబీ
2017 నాటికి సగటున నెలకు వాడుతున్న నెట్	4 జీబీ
2010లో మొబైల్ ఫోన్ సగటు ధర	రూ. 17,000
2015లో మొబైల్ ఫోన్ సగటు ధర	రూ. 9,270
2015లో స్మార్ట్‌ఫోన్లపై పెట్టిన సగటు ఖర్చు	రూ. 7,700
2017లో స్మార్ట్‌ఫోన్లపై పెట్టిన సగటు ఖర్చు	రూ. 9,960

...ఈ రెండు ఘటనల్లోనూ బాధితులకు న్యాయం చేసింది ‘మొబైల్ వీడియోలు’. ప్రపంచమంతా ఇప్పుడు అరచేతుల్లో ఉంది. కారణం ఒక్క మొబైల్ ఫోన్. ప్రపంచం గురించి చెప్పడమే కాదు.. ఇలాంటి ఘటనలప్పుడు ఎవరూ ముందుకు రాకపోయినా నేనున్నానంటూ న్యాయ సాయం చేస్తోంది మొబైల్ ఫోన్ . ఏదైనా నేరం జరిగితే పోలీసుల దర్యాప్తుకు తోడుగా ఉంటున్నవి సీసీటీవీ కెమెరాలే. అన్ని చోట్లా అవి అందుబాటులో ఉండవు కదా. కానీ, మన చేతుల్లోనే ఇమిడే సీసీటీవీలున్నాయని తెలుసా? అవేవో కాదు.. మనం వాడే స్మార్ట్ మొబైల్ ఫోన్లే. ఎవరికైనా ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఎవరో మొబైల్‌లో తీసిన వీ డియోలే అండగా నిలుస్తున్నాయి. చాలా సార్లు పోలీసులు ఆ వీడియోల ఆధారంగానే కేసులూ పెడుతున్నారు. దేశవ్యాప్తంగా ఎందరికో ఆ మొబైల్ వీడియోలు బాధితులకు న్యాయం చేసిపెడుతున్నాయి. అలాంటి ఘటనల గురించి చెప్పుకుంటూ పోతే కొన్ని వందల వేలు మన కళ్ల ముందు మెదులుతాయి. ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన తాజా ఉదంతమూ మొబైల్ ఫోన్లు బాధితులకు ఎలా సాయపడుతున్నాయో చెబుతుంది. అజీత్ జాతవ్.. బహుశా గుర్తుండి ఉండకపోవచ్చు. కానీ, మధ్యప్రదేశ్‌లో ట్రాన్స్‌ఫార్మర్ కోసం జిల్లా కలెక్టర్ కాళ్లపై పడిన రైతు అంటే వెంటనే ఆ ఘటన కళ్ల ముందు కదలాడుతుందేమో. డబ్బులు కట్టినా తన పొలానికి ట్రాన్స్‌ఫార్మర్ పెట్టట్లేదని కలెక్టర్ కాళ్లపై పడి మొరపెట్టుకున్నాడాయన. ఆ వీడియో బాగా వైరల్ అయింది. అది చూసిన గుణ ఎంపీ జ్యోతిరాదిత్య సింధియా.. రెండు గంటల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించాలని ఆదేశించారు. ఫలితం ఒక్క వీడియో.. రెండు గంటల్లో న్యాయం. అది చాలదా మొబైల్ వీడియోలు బాధితుల పక్షాన నిలబడుతున్నాయని చెప్పేందుకు. ఏ సాక్షీ ముందుకు రానప్పుడు ఆ వీడియోనే పెద్ద సాక్షిగా ముందు నిలబడుతోంది. ఇలా న్యాయం పొందుతోంది కూడా సమాజంలో అట్టడుగున ఉన్నవారే.

ఆ వీడియో లేకపోయుంటే...

2017 జూలైలో మణిపురి (ఆగ్రా).. పెళ్లికి వెళ్లి వస్తున్న ఓ కుటుంబంపై అత్యంత దారుణంగా ప్రవర్తించిందో ముఠా. షికోహాబాద్ -కాస్గంజ్‌పాసింజర్ ట్రైన్‌లో మహిళలు, పిల్లలు, టీనేజర్లు సహా పది మంది ఉన్న ఆ కుటుంబంపై నీచంగా ప్రవర్తించింది. అందరినీ చితకబాది.. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు దుండగులు. వాళ్ల బట్టలను చించేశారు. ఆ ఘటన జరిగిన ఏడాదిన్నరకు స్పందించిన బాధితులు.. తమ దగ్గర వీడియో లేకుంటే న్యాయం జరిగి ఉండేదే కాదన్నారు. ఆ వీడియో వల్లే ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. ఇలాంటి కొన్ని ఘటనలే కాదు.. ఎన్నో ఘటనలు మొబైల్ ఫోన్లో రికార్డ్ చేయడం వల్ల బాధితులకు న్యాయం జరుగుతోంది. మూక హత్యల్లోనూ ఆ తరహా న్యాయమే బాధితులకు దక్కుతోంది.

రెండోవైపూ ఉంది..

నిజమే.. మొబైల్ వీడియోలు బాధితులకు న్యాయం చేస్తున్నాయనడంలో సందేహం లేదు. కానీ, అందులో చెడూ ఉంది. ఘటనలను వీడియోలు తీయడం వరకేనా ఓ పౌరుడి బాధ్యత అని ప్రశ్నించే స్వచ్ఛంద కార్యకర్తలు లేకపోలేదు. ఎందుకంటే.. జరిగే ఘటనను వీడియో తీసే బదులు.. ఆ ఘటనను ఆపితే ఇంకా బాగుంటుంది కదా అని అంటున్నారు. ఆ సాయం జస్ట్ వీడియోలు తీయడం దగ్గరే ఆగిపోతోందంటున్నారు. అంతేకాదు.. ఆ వీడియోలే నేరస్థులకూ అండగా ఉంటున్నాయనడం నిస్సందేహం. ఉదాహరణకు మాయమాటలు చెప్పో, లేదా బలవంతంగా ఓ అమ్మాయిపై ఓ దుండగుడు అఘాయిత్యానికి పాల్పడి, దాన్ని వీడియో తీసి, దాని చూపించి బ్లాక్ మెయిల్ చేస్తున్న సందర్భాలూ అనేకం ఉన్నాయి. వాటిని పట్టుకుని బాధితురాళ్లపై మళ్లీ మళ్లీ అఘాయిత్యానికి పాల్పడే ఘటనలు ఎప్పుడూ ఎక్కడో ఓ చోట వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఇండియాలో 116 కోట్ల మంది మొబైల్ ఫోన్లు వాడుతుంటే.. అందులో 54 కోట్ల మందికి స్మార్ట్‌ఫోన్లున్నాయి.

భూగర్భ నీటిలో మైక్రోప్లాస్టిక్స్

వాషింగ్టన్: ‘ఇందుగలదందు లేదను సందేహంబు వలదు’ అన్నట్టు ఎక్కడ చూసినా ప్లాస్టిక్ భూతమే కనిపిస్తోంది. మైక్రోప్లాస్టిక్స్‌తో ఇప్పటికే చెరువులు, నదులు, సముద్రాలు కలుషితమైపోయాయని భయపడుతుంటే.. ఇప్పుడు భూగర్భ నీటిలోకి వచ్చేసింది ఈ రాక్షసి. అమెరికాలోని సెయింట్ లూయిస్ మెట్రోపాలిటన్ ప్రాంతంలోని 11 పెద్ద భూగర్భ రాతిపొరలు, వాయవ్య ఇలినాయిలోని 6 చిన్న రాతి పొరల్లో నీటిని పరిశీలించిన సైంటిస్టులు.. సెయింట్ లూయిస్ ప్రాంతంలోని నీటిలో లీటరుకు 15.2 మైక్రోప్లాస్టిక్ అణువులున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం పరిశోధన ప్రారంభ దశలోనే ఉందని, మరిన్ని పరిశోధన చేశాక మైక్రోప్లాస్టిక్స్ వల్ల నష్టాలు చెప్పగలమన్నారు. ప్లాస్టిక్ వస్తువులు విడిపోయి మైక్రోప్లాస్టిక్ అణువులుగా మారుతాయని.. అవే నదులు, కాలువల ద్వారా సముద్రాన్ని కలుషితం చేస్తున్నాయని చెప్పారు. ప్లాస్టిక్ చిన్నచిన్నగా విడిపోయాక స్పాంజ్‌లా మారి అన్నింటిలో కలిసిపోతుందని, అలా అలా ఆహార గొలుసులోకి వచ్చేస్తోందని అంటున్నారు. ఇప్పటికే సముద్రజీవుల్లోని పేగుల్లో, చేపల మొప్పల్లో మైక్రోప్లాస్టిక్స్‌ను గుర్తించినట్లు చెప్పారు. 1940 నుంచి ఇప్పటివరకు సుమారు 630 కోట్ల టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి అయింది. దాంట్లో 79 శాతం భూమి, నీరు, వాతావరణంలో కలిసిపోయింది.



క్యాబేజ్ లిల్లీ

ఏం బాబు క్యాబేజీ ఉందా? హా.. గంపెడన్నీ! ఏది ఒకటివ్వు అనే సంభాషణ వీధుల్లో వింటుంటాం. కానీ ఈ స్టోరీ చదివితే మాత్రం ఔరా అనకమానరు. దోసిలిలో పట్టే క్యాబేజీ, పెద్ద గంప సైజు ఎదిగింది! అమెరికాలోని పెన్సిల్వేనియాకు చెందిన లిల్లీ రీస్ అనే తొమ్మిదేళ్ల పాప ఈ పే..ద్ద క్యాబేజీని పండించింది. అది ఎంత పెద్దగా ఉందంటే లిల్లీ, దాని పక్కన నిలబడితే కేవలం ఆమె మెడ మాత్రమే కనిపిస్తుంది. ‘నేషనల్ బొన్ని ప్లాంట్ థర్డ్ గ్రేడ్ క్యాబేజ్ ప్రొగ్రాం’ కాంపిటీషన్‌లో భాగంగా లిల్లీ క్యాబేజీ మొక్కను ఇంటికి తెచ్చుకుంది. రోజూ నీళ్లు పోసేది. కాసేపు ఎండ తగిలేలా చూసేది. అంతే. కొన్నాళ్లకు ఇంత పెద్దగా తయారైంది. దీన్ని చూసి ఆశ్చర్యపోయిన ఈవెంట్ నిర్వాహకులు లిల్లీని విజేతగా ప్రకటించారు. రూ. 70 వేలు ప్రైజ్ మనీగా అందజేశారు. పెన్సిల్వేనియాకు చెందిన 32 వేల మంది చిన్నారులు ఈ పోటీలో పాల్గొన్నారు.



అభిమాన పాల దొంగలు

- హీరో కటౌట్‌కు అభిషేకం కోసం పాల దొంగతనాలు

చెన్నై మహానగరం.. తెల్లవారుజామున నాలుగు గంటలు.. పాల పార్లర్ ముందు పాకెట్లు మాయమయ్యాయి. ఉదయం 8 గంటలు.. ఓ సూపర్ స్టార్ సినిమా విడుదలైంది. అభిమానులు ఉప్పొంగిన ఉత్సాహంతో తమ అభిమాన హీరో కటౌట్‌కు పాలతో అభిషేకం చేస్తున్నారు.

..ఈ రెండు ఘటనలకూ ఓ లింకుంది. ఆ లింకే.. పాల దొంగతనం. అవును, అభి మాన హీరో కటౌట్‌కు అభిషేకం చేస్తున్న ఆ పాలు దొంగిలించినవట. ఈ మాట చెబుతున్నది తమిళనాడు పాల డీలర్ల సంఘం మరి. దీనిపై బుధవారం పోలీసులకూ ఫిర్యాదు చేశారు అసోసియేషన్ సభ్యులు. ‘‘పాలను కేవలం దేవళ్ల అభిషేకానికి మాత్రమే వాడాలి. హీరోల కోసం కాదు’’ అని అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఏ పొన్నుస్వామి అన్నారు. హీరోల కటౌట్‌లకు అభిషేకాన్ని నిషేధించాలని కోరుతూ ఫిర్యాదిచ్చారు. రోజూ తెల్లవారుజామున డెయిరీల నుంచి పాలు వస్తుంటాయని, ఆ టైంలో పాల వ్యాన్‌ల నుంచి లోడ్ దించి షాపుల ముందు వదలి వెళుతుంటారని, కానీ, తెల్లారేసరికి అందులోని చాలా పాకెట్లు మాయమైపోతున్నాయని పొన్నుస్వామి ఫిర్యాదులో ఆరోపించారు. ఇక, గత మంగళవారం తమిళ నటుడు శిలంబరసన్.. తన సినిమా రిలీజ్ అవుతోందని, కాబట్టి తన పోస్టర్‌కు కుండలకొద్దీ పాలతో అభిషేకం చేయాలని అభిమానులను వీడియోలో కోరారు. ఆ వీడియో వైరల్ కావడంతో.. చర్యలు తీసుకోవాలని పొన్నుస్వామి కోరారు. అంతేగాకుండా రజనీకాంత్, కమల్‌హాసన్ వంటి అగ్రనటులను కలిసి ఇలాంటి వాటిని ఉపేక్షించొద్దని ఆయన కోరారు. దీనిపై రజనీకాంత్ పీఏ స్పందించారు. ఎంత చెప్పినా అభిమానులు పట్టించుకోవట్లేదని ఆయన అన్నారు. పదే పదే చెప్పినా వినిపించుకోవడం లేదన్నారు.



పిల్లల కోసం


నాన్న చేసిన ఆటో

పిల్లలు ఆడుకోవడానికి బొమ్మ కార్లు కొనివ్వడం చూసుంటాం. ఆ కార్లో కూర్చుని స్టీరింగ్‌ను అటూఇటూ తిప్పుతూ తెగ సంబరపడిపోతుంటారు బుడ్డోళ్లు. అది ఒట్టి బొమ్మ మాత్రమే. కానీ, కేరళకు చెందిన ఓ నాన్న.. తన పిల్లల కోసం తానే ఓ ఆటో తయారు చేసిచ్చాడు. అలా అని అది బొమ్మ కూడా కాదు. దానికి ఇంజన్ ఉంటది. ఆపదొస్తే ట్రీట్‌మెంట్ చేసుకోవడానికి ఫస్ట్‌ఎయిడ్ కిట్ ఉంటుంది. పాటలు వినడానికి డెక్.. బ్రేకులు, ఫోన్ చార్జింగ్ పెట్టుకునేందుకు సౌకర్యాలు.. ఒక్కటేమిటి అన్ని హంగులతో నిజం ఆటోలాగే ఉంటుంది. రోడ్డుమీద పరుగులు పెడుతుంది. కాకపోతే బుడ్డోళ్ల కోసం తయారు చేసింది కదా.. అంతే బుడ్డగా ఉంటదీ ఆటో. ఆ కథాకమామీషూ మీకోసం..

అరుణ్ కుమార్ పురుషోత్తమన్.. ఉండేది కేరళలోని తొడుపుళ. ఇడుక్కి జిల్లా ఆస్పత్రిలో స్టాఫ్ నర్స్. అతడికి ఇద్దరు పిల్లలు. కొడుకు మాధవ్ క్రిష్ణకు 1989లో మోహన్‌లాల్ నటించిన సినిమా ఆయ్ ఆటో అన్నా, ఆ సినిమాలోని ఆటో ‘సుందరి’ అన్నా మహా ఇష్టం. దీంతో తన పిల్లలకు ఆ సినిమా స్ఫూర్తితోనే ఓ మినీ ఆటోను తయారు చేద్దామనుకున్నాడు. ఏడు నెలల్లో పూర్తి చేసేశాడు. ఇంట్లోని పాడైపోయిన వస్తువులతో ఆటోను తయారు చేశాడు. ఆ ఆటో బరువు జస్ట్ 60 కిలోలు. టీవీ డిష్‌ను కోసి ఆటో ముందు భాగాన్ని తయారు చేశాడు. ఇంట్లోని పాత స్టవ్‌ను అణగ్గొట్టి చాసిస్‌ను రూపొందించాడు. ఆటోను స్టార్ట్ చేయడానికి కిక్ స్టార్టర్‌ను పెట్టాడు. మీటర్‌కు బదులు రంగురంగుల లైట్లు వెలిగేలా సౌకర్యం కల్పించాడు. షూ సోల్స్‌తో టైర్లను తయారు చేసి ఆటోకు పెట్టాడు. కేబుల్ డిస్క్‌తో బ్రేకులు పెట్టాడు. ఆటో కదిలేలా సైకిళ్లు, బైకులకుండేటటువంటి చైన్‌ను పెట్టాడు. అలా అన్ని హంగులతో ఆటోను తయారు చేసి పిల్లలకిచ్చాడు. తండ్రి తయారు చేసిన ఆటోను చూసి మాధవ్ కృష్ణ మస్త్ ఖుష్ అయిండు. ఆటోను నడుపుతూ ఎంజాయ్ చేస్తున్నాడు. ఇక, ఈ ఆటో లౌకిక ఆటో. ఆటో ముందు భాగంలో సరస్వతి అమ్మవారు, జీసస్, బుద్ధ వంటి దేవుళ్ల ఫొటోలను పెట్టాడు. ఇక, వెనకాల చెప్పేదేముంది.. మోహన్‌లాల్ స్ఫూర్తిగా తయారు చేశాడు కాబట్టి.. ఆయన ఫొటోనూ పెట్టేశాడు.







యాపిల్‌ను కొన్నంత పనిచేసింది

1996లో సన్ మైక్రోసిస్టమ్స్ డీల్ యాపిల్ అప్పులు చూసి వెనక్కు

యాపిల్.. ఆ పేరే ఒక బ్రాండ్. ఆ గుర్తే ఓ గొప్ప. అట్లాంటి కంపెనీ వేరే కంపెనీ చేతుల్లోకి వెళ్లిపోతుందంటే జీర్ణించుకోగలరా? లేదు కదా.. కానీ, ఓ సందర్భంలో కంపెనీ దాదాపు అమ్ముడుపోయినంత పనైంది. ఇప్పుడంటే యాపిల్‌కు తిరుగులేదు గానీ.. ఒకప్పుడు కంపెనీకి అన్నీ ఎత్తుపల్లాలే. యాపిల్ ఉత్పత్తులేవీ అమ్ముడుపోని పరిస్థితి. అలాంటి దీన స్థితుల్లో కంపెనీని సన్ మైక్రోసిస్టమ్స్ అనే సంస్థ కొనేందుకు ముందుకొచ్చింది. సన్ మైక్రోసిస్టమ్స్.. అనే కంపెనీ కూడా ఉందా అన్న అనుమానం మీకు వచ్చి ఉండొచ్చు. నిజమే ఆ పేరు కూడా ఇప్పటి తరానికి తెలిసుండదు. కానీ, 90ల్లో టెక్ దిగ్గజాల్లో అదొకటి. సరిగ్గా 22 ఏళ్ల క్రితం.. అంటే 1996లో ఆ సంస్థే యాపిల్‌ను సుమారు రూ.27,580 కోట్లకు (389 కోట్ల డాలర్లు.. అప్పటి రేటు ప్రకారం) కొనేందుకు ఆసక్తి చూపించింది. అప్పటికి స్టీవ్ జాబ్స్ కంపెనీకి సీఈవోగా లేరు. కొన్ని కారణాల వల్ల అంతకుముందే కంపెనీని వీడారు. ఆ ప్రభావంతో యాపిల్ ఉత్పత్తులు మార్కెట్లో ప్రభవం చూపించలేకపోయాయి. అందుకే ఆ డీల్ జరిగింది. సన్ మైక్రోసిస్టమ్స్ సీవోవో ఆ రెండు కంపెనీల బాధ్యతలను చూసుకుంటారన్న వార్తలు వినిపించాయి. కొద్ది రోజుల్లో చేజిక్కించుకుంటదనగా యాపిల్ కంపెనీ భారీ నష్టాలను ప్రకటించేసింది. దీంతో సన్‌మైక్రోసిస్టమ్స్ ఆ డీల్ నుంచి తప్పుకుంది. అప్పుడే మళ్లీ స్టీవ్ జాబ్స్ కంపెనీలోకి ఎంటరయ్యారు. ఆ తర్వాత యాపిల్ ఏ రేంజ్‌కు వెళ్లిపోయిందన్నది అందరికీ తెలిసిందే. కల్ట్ ఆఫ్ మ్యాక్ అనే సంస్థ విడుదల చేసిన నివేదికతో ఈ విషయం వెలుగుచూసింది.



Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.